సృజన

నవంబర్ - డిసెంబర్, 1985 169-170

అవును
ఇప్పుడు గాలికూడా వణుకుతోంది
అయినా అది
ఋతు మార్పును సూచిస్తోంది
కత్తి అంచులమీద నాట్యంచేయగల
సాహసికులారా రండి
రానున్న వసంతాన్ని అవిష్కరించుకొందాం.

- ఫైజ్ అహ్మద్ ఫైజ్.

సూచిక

సృజన, హనుమకొండ - 506 001 ఈ సంచిక రు. 4-00

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for "Sahitee Mithrulu" Printed at Tirumala Printers, Vizayanagaram for Venkataramana Mudranalayam, Warangal.

వ్యాఖ్య :

భాష కూడ నిర్బంధానికి గురి అయిన వేళ........

It is the logic of our times
No subject for immortal verse
We who lived by honest dreams
defend the bad against the worse

స్పెయిన్ అంతర్యుద్ధం చివరి రోజులలో "అజరామర కవిత్వానికిది వస్తువుకాదు" అంటూ సి. డే లూయిస్ ఈ చరణాలు రాశాడు. కాని నిజానికి రెండు ప్రపంచ యుద్ధాల మధ్యం కాలం కవిత్వానికి భాషకి అద్భుతమయిన రోజులు. ఆ ప్రభావాల లోనే అదే కాలంలో, శ్రీశ్రీ తెలుగు సాహిత్యాన్ని స్మశానాల వంటి నిఘంటువులు దాటించాడు. అంతకు అటు ఇటుగా గిడుగు రామ్మూర్తిగారి శిష్ట వ్యావహారికోద్యమం వచ్చింది. ప్రస్తుతం మన జీవితంలో భాగమయిన లిఖిత ప్రపంచ ప్రామాణిక భాష రూపు తీసుకొంది.

ఈ అర్ధశతాబ్ది కాలంలో మన భాషలోకి ఎన్నో కొత్త పదాలు, నుడికారాలు, వ్యక్తీకరణలు వచ్చిచేరాయి. అంతకు ముందే తెలుగు పదాలయి పోయిన ఇంగ్లీషు పదాలకి (రోడ్డు, రైలు,) తోడుగా మరికొన్ని వచ్చి చేరాయి (రాడికల్స్), కొత్త పదాలు రావడమే కాదు, పదాలకి కొత్త అర్థాలు కూడా వచ్చాయి.

"ప్రజాస్వామ్యం" అనే పదం తీసుకోండి, స్వాతంత్ర్య పోరాట రోజుల్లో ప్రజాస్వామ్యం అనే పదం స్వాతంత్ర్యం అనే మరోపదంలో ముడిపడి ఉంది. ప్రజల స్వేచ్ఛ, ప్రజల అభీష్టం, ప్రజామోదంతో పాలన, మొదలయిన అర్థాలను సూచించేదిగా ఆ పదం ప్రాచుర్యం పొందింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి క్రమక్రమముగా ప్రజాస్వామ్యం అనే పదానికి అర్థం కుంచించుకు పోయింది. ప్రస్తుతం ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల తంతు అనే అర్థం మాత్రము మిగిలింది, అదిలాబాద్‌లో ఈ ఏడు ఒక కాలేజిలో రాడికల్ విద్యార్థులు ఎన్నికలు

గెలిచారు. గెలిచిన అభ్యర్థులను పోలీసులు నిర్బంధించి కొట్టి రాజీనామా చేయించారు. ఎన్నికలు మళ్ళీజరిగాయి. ఈ సారి కొందరు ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలిచారు. అయితే వాళ్ళని రాడికల్స్ గెలిపించారని పోలీసులకి అనుమానమొచ్చి మరోసారి ఎన్నికలు జరిపించు క్రమంలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న అర్థంలో ఆదిలాబాద్‌లో అమలవుతున్నది నిర్బంధం కాదు, నిరంతర ప్రజాస్వామ్యం.

కొత్త పదాలని వాడుకలోకి తీసుకు రావడంలోనూ, వాటికి నిర్దిష్టమయిన అర్థాలని ఇవ్వడంలోనూ రేడియో, టెలివిజన్, పత్రికలు ముఖ్యమయిన పాత్రను నిర్వహిస్తుంటాయి. మారుతున్న సమాజంలో కొత్తగా భాషను సృష్టించుకుంటూ, పదాలకి అర్థాలని ఇస్తూ, ఆ అర్థాలకి అందర్నీ అలవాటు చేసే క్రమానికి ఇవి ముఖ్యమయిన సాధనాలు. పత్రికలు ప్రతిరోజు మనకు అనేకానేక సంఘటనలను వార్తల రూపంలో అందిస్తు ఉంటాయి. అయితే అదే క్రమంలో మరోవయిపు మనకు పదాలని, అర్థాలని ఇచ్చే పనికూడా నిర్వహిస్తుంటాయి. అంతేనా ? కాక జరిగిన సంఘటన గురించి ఒక నిర్దిష్ట దృక్పథాన్నికూడా మనకు కలిగిస్తాయా ?

కారంచేడు సంఘటన మొదటిరోజు రిపోర్టింగ్‌లో చాలా పత్రికలు "కారంచేడు ప్రశాంతత భగ్నమయింది" అని రాసాయి. ఈ సంఘటన జరగక ముందు కారంచేడు గ్రామం ప్రశాంతంగా ఉందనే భావన మనకు కలుగుతుంది. ఎక్కడుంది ప్రశాంతత ? ఎప్పుడుంది ప్రశాంతత ? భయంకర హత్యాకాండకు దారి తీసిన వైరుధ్యమయ గ్రామాన్ని ప్రశాంతంగా ఉందని ఎలా అనగలం ? - ఈ ప్రశ్నలన్నీ మనకి తట్టేలోగానే మనం అరిపోర్టు తర్వాత వాక్యంలోకిపోయి సంఘటన వివరాలలో నిమగ్నులయిపోతాం. ఏ వార్తను, ఏ పదాలతో అందించాలో నిర్ణయించు నేకు (తెలిసో తెలియకో) పత్రికలు మనకు వార్తల నందిస్తాయి.

ఈ పత్రికలు, ఇతర ప్రచార సాధనాలు సమాజంలో అధికారం ఉన్న వాళ్ళ చేతుల్లో ఉన్న మేరకు, అవి సంఘటనలని-సామాజిక వాస్తవికతను-పాఠకులు ఎలా చూస్తున్నారో మనకి చెప్పకని చెస్తుంది. అంతేకాదు ప్రతి సంఘటనని మనం ఎలా చూడాలని పాఠకులు అనుకుంటున్నారో కూడా చెప్తుంది.

నవంబర్ నెలలో తెలుగుదిన పత్రికలలో మూడు వార్తలు వచ్చాయి. "మన్యం ప్రాంతంలో అమాయకులయిన గిరిజనులు తీవ్రవాదం ప్రాబల్యంలోకి పోతున్నారని" ఒక వార్త "గిరిజనులకు ప్రత్యేక సంక్షేమ పథకం" అని రెండవ వార్త "మన్యంలో తీవ్రవాదులను అణచడానికి అదనపుబలగాలు" అని మరోవార్త. ఈ మూడు వార్తలను వాటి వాటి సంధర్భాలలో పరిశీలిద్దాం మొదటిది "విశ్వసనీయమయిన సమాచారంతో" ఇచ్చిన కథనం "ఒకదానికొకటి భౌగోళికంగా అనుసంధానించ బడిన బస్తర్, తూర్పుగోదావరి, విశాఖ కోరాపుట్, మన్యంప్రాంతాలలో గిరిజనులు "తీవ్రవాదుల ప్రాభావంలోకి గురి అవుతున్నారు" అనిదానిసారాంశం రెండవ వార్త "ఏడవ పంచవర్ష ప్రణాళికలో 55కోట్ల రూపాయలతో గిరిజనులకోసం. రూపొందించిన ప్రత్యేక సంక్షేమ పథకం" గురించి గిరిజన సంక్షేమశాఖ మంత్రి గారి ప్రకటన. పాడేరు, చింతపల్లి (విశాఖజిల్లా). చింతూరు (ఖమ్మం) లలో జూనియర్ కాలేజిలు ప్రారంభించడం అందులో భాగం. మూడవ వార్త "తీవ్రవాదులని అణచివేతకు పోలీసు వ్యూహం"లో భాగం. హైదరాబాద్‌లో 600 మంది సాయుధ పోలీసులకి ప్రత్యేక శిక్షణనిచ్చి కరీంనగర్ (పదిమంది సబ్ఇనస్పెక్టర్ల నాయకత్వంలో, 300 మంది పోలీసులు), వరంగల్ జిల్లా ఏటూరు నాగారం (భీరెల్లి. తుపాకులగూడెం, ఐలాపురం, రంగాపురం గ్రామాల్లో కొత్తగా ఏర్పరిచిన పోలీసుస్టేషన్లకి మొత్తం 128 మంది సాయుధ సిబ్బంది), తూర్పుగోదావరి జిల్లాలకు పంపడం ఈ వ్యూహంలో ప్రాధానాంశం. అందులో భాగంగానే "తీవ్రవాదుల అణిచివేతకు మన్యంకు మరిన్ని పోలీసుబలగాలు". సారాంశంతో ఈ మూడు సంఘటనలు ఒకే ఒక ప్రజాసమూహం - మన్యం ప్రజలు - గురించిన వార్తలు అయితే తీవ్రవాదం ప్రాబల్యంలోకి పోయినపుడువాళ్ళు "అమాయక గిరిజనులు" సంక్షేమ పథకాలకోసం వాళ్ళు "గిరిజనులు" అణిచివేయడానికి అదనపుబలగాలని పంపినపుడు వాళ్ళు "తీవ్రవాదులు" ఈ మూడు పదాలు దినపత్రిక పాఠకుల అలవాటయిన పదాలు అంతేకాదు వాటికి వాళ్ళ మనస్సుల్లో నిర్దిష్టమయిన అర్థాలుకూడా ఉన్నాయి. ఏ సంఘటనకు ఏ పదం వాడాలో ఎంపిక చేసుకొను క్రమం, ఈ సంఘటనను వార్తగా అందించే క్రమంతో విడదీయలేకుండా కలిసి పోతుంది. ఈ మూడు వార్తలకి ముడిసరుకు ఒకటి కదా అని "తీవ్రవాదులకి సంక్షేమ పథకం"

"అమాయక గిరిజనుల అణిచివేతకు అదనపు పోలీసు బలగాలు" అని శీర్షికలు పెడితే ప్రపంచం, వాళ్ళ ప్రపంచం, తలకిందులవుతుంది.

"తీవ్రవాదుల" తోపాటు ఇటీవల బాగా వాడుకలోకి వచ్చిన మరోపదం "ఉగ్రవాదులు" అధికారభాషలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లు "తీవ్రవాదుల", పంజాబ్‌లో మతోన్మాదులు "ఉగ్రవాదులు" ఇక్కడొక చిన్న విషయం చెప్పుకోవాలి. ఇంగ్లీషులో Entremists, terrorist అని రెండు పదాలకి కూడా తీవ్రవాదం అనే అనువదించి తెలుగు పత్రికలు కొంత తమ తెలివితేటల్ని కూడా ఈ గందరగోళానికి జోడిస్తుంటాయి. ఈ మధ్య ఒకప్రముఖ తెలుగు దిన పత్రిక ఒకేరోజు, ఒక పేజీలో అదే పదానికి ఒకచోట తీవ్రవాదం, మరోచోట ఉగ్రవాదం అని వాడింది కూడా అయితే ఈ తెలుగు గందరగోళానికి వాళ్ళ అసమర్థత మించి మరోకారణం ఉండక పోవచ్చు.

హైదరాబాద్ నగరం పాతబస్తీలో ఇటీవల ఒకతను అక్రమ ఆయుధ వ్యాపారం చేస్తూ అరెస్టయ్యాడు. అతను సిక్కు, అరెస్టయిన రోజున తొలివార్తలలో అతను "మారణాయుధాల వ్యాపారంలోని కీలకవ్యక్తి" మాత్రమే, అతని దగ్గర సమాచారం దొరికిందని ఆరోపిస్తు నగరంలో పటాంచెరువు పారిశ్రామిక ప్రాంత ఇప్టూనాయకుడు బసిరెడ్డిని పోలీసులు అరెస్టుచేశారు. ఆ సంధర్భంలో ఇంకా అనేక మందిని అరెస్టుచేసారు. భర్తలు దొరకలేదనిచెప్పి ముగ్గురుస్త్రీలను చాదర్ ఘాట్ పోలీసుస్టేషన్లో వారంరోజులు అక్రమ నిర్బంధంలో పెట్టారు. బసిరెడ్డిని నాలుగు రోజులపాటు అక్రమ నిర్బంధంలో హింసించి చివరికి జైలుకి పంపారు. అరెస్టయిన బసిరెడ్డి అధికారభాషలో "తీవ్రవాది". అయితే ఆయన అరెస్టయింది ఉగ్రవాద చట్టంకింద. పంజాబ్‌ను ఉద్దేశిస్తు కేంద్రం తీసుకు వచ్చిన చట్టంకాబట్టి అది ఉగ్రవాద చట్టం అయింది. మనరాష్ట్రంలో ఇప్పటికి విశాఖజిల్లాలో ఇద్దరు, ఖమ్మంజిల్లాలో ఎనిమిదిమంది, వరంగల్‌లో పదిమంది, గుంటూరుజిల్లాలో ఐదుగురు-మొత్తం కనీసం 25 మందికిపైగా ఈ చట్టంకింద అరెస్టయ్యారు. ఉగ్రవాద చట్టంకింద ఇలా అరెస్టయిన తీవ్రవాదులలో అనకాపల్లి కాలేజి ఇంగ్లీషు లెక్చరర్, రాడికల్ యువజన సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, తెనాలికాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్, విరసం

సభ్యుడు జేసువర్ధనరావు, పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్ కూడా ఉన్నారు. బసిరెడ్డి రాష్ట్ర రాజధానిలో మొదటి "ఉగ్రవాది" అయితే ఈ క్రమంలో అనవసరంగా మొట్టమొదట అరెస్టయిన అక్రమ ఆయుధ వ్యాపారి వారం తిరిగేసరికి కొన్ని పత్రికల భాషలో సిక్కు ఉగ్రవాది (అనువాద సామర్థ్యంలేని పత్రికల భాషలో సిక్కు తీవ్రవాది) అయిపోయాడు. ఇక్కడ ఈ పదాలకి నిర్దిష్ట రాజకీయ ప్రయోజనం ఉంది.

ప్రజాస్వామ్యం, ప్రశాంతత, గిరిజనులు, అమాయకులు, తీవ్రవాదులు, ఉగ్రవాదులు - ఏ పదానికయినా సరే శ్మశానాలవంటి నిఘంటువులో ఒకే ఒక సార్వజనీకమయిన అర్థం ఉంటుంది. కాని ప్రత్యేక స్థల, కాలాల్లో అది ప్రత్యేకార్థాన్ని సంతరించుకుంటుంది. అర్థశతాబ్ద కాలంలో మన పత్రికలు వాడే సామాజిక భాషలో ఎన్నో కొత్త పదాలు వచ్చిచేరాయి. పదాలన్నీ వాటి ప్రస్తుత అర్థాలని సంతరించుకున్నాయి. గిడుగు రామ్మూర్తి పంతులుగారి నుండి ఇవ్వాల్టి పాత్రికేయులుదాకా అందరు ఈ అర్థాల కారాగారంలో యావజ్జీవ ఖైదీలు, పోరాటం, నిర్బంధం, యుద్ధం, శాంతి, ఒక్క మాటలో సామాజిక వాస్తవికతంతా - మనకు ముందుగా ఎంపిక చేసుకున్న పటాలతోనే సాక్షాత్కరిస్తుంది. ఆ పదాలకు పాలకులిచ్చే అర్థాలకు మనమంతా అలవాటుపడతాం. ఆ అర్థాలకి మనమిచ్చే ఆమోదం నిర్బంధానికి మనమిచ్చే పరోక్ష ఆమోదం అవుతుంది. ఇవ్వాళ జరుగుతున్న భయంకర నిర్బంధకాండకి ఆ రకంగా భాషకూడా సాధనమవుతుంది. భాష కూడా నిర్బంధానికి గురి అయ్యే ఈ చీకటి రోజుల గురించే కాబోలు కవిత్వానికిది కాలం కాదని సిధే లూయిస్ తన ఆవేదనను వ్యక్తీకరించాడు కాని.

చీకటి రోజుల్లో గానం కొనసాగదా ? కొనసాగుతుంది,
చీకటి రోజుల్లో కూడ,
గీత లాలాపించబడ్తాయి,
చీకటి రోజుల గురించే (బెర్టోల్‌బ్రెష్ట్)

— అతిథి

కొత్త నియంత

—ఉదయ్ ప్రకాశ్

నియంత ఇంకా
అట్లాగే ఉంటాడని
కనీసం చాల పోలికలుంటాయని
అయననుకుంటాడు

అంతే
పై పెదవి మీద
సీతా క చిలకలా కత్తిరించిన మీసాలు
పతకాలూ రిబ్బన్లూ
ప్రజాసమూహాలను సమ్మోహపరిచే
వాక్పటిమా ఉంటాయనుకు టాడు

కాని ఏమైందంటే
వాడు వెనుకటి లాగ లేడు
ఒకవేళ వాడు మళ్ళీ
పాతరూపంలో పాత దుస్తుల్లో
వచ్చే ప్రయత్నం చేస్తే
ద్వేషంతో రగిలే గుండెలున్నా సరే
దుర్మార్గపుటాలోచనలు మసిలే మనసున్నా సరే
వాడు కేవలం విదూషకుని లాగే కనబడతాడు

కనబడిన వెనువెంటనే
తెలిసిపోయే నియంత కేడివాళ
ఉంటే

జనం వాణ్ని వెంటాడుతారు
వెక్కిరిస్తారు, భయపెడతారు
చిన్నారి పాపలుకూడ వాణ్ని
ఎగిరెగిరి తంతారు

బహుశావాడు
"నేనీ శతాబ్దంలో
అందరికన్న ఎక్కువ అపార్థానికి గురయిన వాణ్ని"
అంటూ వస్తాడు
బహుశా వాడు
వినోబాభావే గురించీ
సంత్ తుకారాం గురించీ
నిరాయుధీకరణ గురించీ మాట్లాడతాడు

బహుశా వాడు
గడ్డం శుభ్రంగా గీసుకుని
మర్యాదస్తుడి ముఖంతో
పశువుల పట్లా శిశువుల పట్లా
అవ్యాజమైన ప్రేమ కనబరుస్తాడు

బహుశా వాడు
సైన్యం అవసరాన్ని
పోలీసు అవసరాన్ని వ్యతిరేకిస్తాడు
బహుశా వాడు
ఎక్కడో ఒక ఆస్పత్రి నిర్మిస్తాడు
ఒక వలికేంద్రం తెరుస్తాడు
ఎక్కడో ధర్మశాలనో
నాటక కేంద్రాన్నో
గ్రంథాలయాన్నో నెలకొల్పుతాడు

వాడి సద్గుణాలకు
ఇవన్నీ సాక్ష్యాలు కావా అని
మనలోనే కొందరు
మనతో చర్చించవచ్చుకూడ
ఆ సమయానికి
వాడు నోబెల్ శాంతి బహుమతి
అందుకుంటుండ వచ్చుకూడ
లేదా
బహుమతి జాబితాలో
వాడిపేరు పైపైన
ఉండవచ్చు కూడ

★

['జనవాదీ కవితా' అనే పేరుతో రత్లమ్ [మధ్యప్రదేశ్] నుంచి ప్రచురితమయిన ద్విభాషా కవితా సంకలనంలోని ఈ కవిత చాల ఏళ్ళక్రితమే రాసింది. ఈ కవిత స్ఫురింపజేసే వర్తమాన నయానియంతను ఇంకా పుట్టకముందే గుర్తించి 'స్వాగతం' పలికిన కలికి అభినందనలతో ఇప్పుడీ అనువాదం]

మాక్‌బెత్ చక్రవర్తి

—అరుణ్ కమల్

లోకం ఎలా కనబడుతుంది ?
తుపాకి గొట్టంలోంచి చూస్తే
లోకం ఎలా కనబడుతుంది

బైలదిల్లా ఇనుపఖనిజపు కేంద్రమని వాళ్ళంటారు
లేదా పరుగులో వేడెక్కిన గుర్రపు నాడాకావచ్చు
పంత్‌నగర్ ధాన్యపుగని అని వాళ్ళంటారు
లేదా నిండా వికసించిన గోధుమగింజ కావచ్చు

చక్రవర్తీ
నువు తుపాకి గొట్టంలోంచి చూశావే,
బైలదిల్లా ఎలా కనబడింది ?
పంత్‌నగర్ ఎలా ఉంది ?

'ఒక గుండ్రని మాంసం ముద్ద
లోకమే ఒక గుండ్రని మాంసం ముద్ద'
అంతేనా ?
బాగుంది !
జనరల్ డయ్యర్ చెప్పులు ఎలాంటివంటే
అవి ప్రతి చక్రవర్తి కాళ్ళకూ సరిగ్గా సరిపోతాయి
ప్రతి చక్రవర్తీ
ప్రియమైన ఏకైక దూరదర్శిని
తుపాకీ గొట్టమే

కానీ, చక్రవర్తీ
లోకం విశాలమైనది
దాన్ని నీ తుపాకిగొట్టంలో బంధించలేవు
ముందుకు చూడు,
ఎవరు నడిచొస్తున్నారో-
గుండ్రని మాంసం ముద్దేనా ?

మాక్‌బెత్ చక్రవర్తీ
ఇప్పుడిక నువు తప్పించుకోలేవు
మనిషి ముందుకే నడిచొస్తున్నాడు
మనిషి
బిర్నామ్ అడవి వంటిమనిషి
ముందుకే వస్తున్నాడు.



3 డిసెంబర్ 1984

—భాస్కర్

అక్కడ* ఘోర హత్య జరిగింది
ఎప్పుడో కాదు మొన్ననే జరిగింది
ఇంకొన్ని రోజుల్లో దానికి
ప్రథమ వర్ధంతి జరగబోతోంది
ఉపన్యాసాలు బహుశా అప్పుడే
తయారవుతూ ఉంటుంటాయి
ఇదుగో, నా లాంటి కవులందరూ
ఈ పాటికి కవితలు వండేస్తూ
ఉంటారు
ఉదారమూర్తి జస్టిస్ కీనన్‌గారు
అప్పటికి బహుశా మరికొన్ని లక్షలు
దానం చెయ్యమని కంపెనీ దొరలను
ఆదేశిస్తారు
వారపత్రికలు ప్రత్యేక సంచికల కోసం
రంగు రంగుల ఫోటోలు, రసవత్తరమైన
రహస్య సమాచారాలు, గబగబా
సేకరించేసుంటాయి ఇప్పటికే
అదుగో, ప్లాట్ ఫారం మూలకూర్చుని
అదేపనిగా దగ్గుతున్న కూలీ మాత్రం
అప్పటికి చచ్చిపోతాడు

(16-9-85)

* భోపాల్

విరామ చిహ్నాలెందుకు ?

—సాగర్

రక్త రంజిత త్యాగాలను మాట్లాడించేకొద్దీ
నాకు రాయాలనే అనిపిస్తది......
అమ్మను చూసినప్పుడల్లా చంకనెక్కాలనే
చిన్నతనపు గారాబం పెరిగి పెద్దయినట్లు
నాకు ఉరికంబాలపైన ఉపన్యాసాలు చేయాలనిపిస్తది !
నేను ఊహల్లోనే కదూ ఇంత వాడ్నయ్యింది
శిలువను మోసే కదూ సద్ది గతికింది......

నా హృదయ కనాటం చలించే ఈ చోట
ఇక్కడ ఈదాలన్నా చెరువులూలేవు
నడవాలన్నా కాల్వలకి గట్లూలేవు
కరువు కరాళ ప్రేతనృత్యం చేస్తున్నప్పుడు
ఎక్కడ చూసినా రాక్షస పోలీసు తుపాసులు
నా తల్లి తెలంగాణాను చెరబడ్తున్నప్పుడు
మనసుకు ఇంకెంత మాత్రమూ జిద్దంటని
నిర్బంధాల మీద పదునెక్కిన అనుభవాల గవాక్షాలు
నన్ను సేదదీర్చ నాగర్భంలో కదిలినప్పుడు
నేను వెన్నెల చూడని ఉదయాల మధ్య
మరణించాను, ఎన్‌కౌంటర్ల మధ్య తిరిగి జన్మించాను !
అయితేనేమి ఈ ఇసుక తెన్నెల మూపున
నాకాలి గురుతులున్నాయి నా వేలి జ్ఞాపకాలున్నాయి
అవి ఉల్లిపొరలై విప్పిన వెల్తురు గుబాళింపులున్నాయి
అప్పుడు ఏ నెత్తురూ తుడుచుకోలేని కన్నీటిపాదాల మధ్య
నాకు ఆలాపాలెందుకు ? విరామ చిహ్నాలెందుకు ?
నిలువెత్తు అద్దంలోని రూపాలకు సాక్ష్యాధారాలెందుకు ?
ఈ ముల్లు పదునుగానే ఉంటది
ఈ స్వరం స్పష్టంగానే పలుకుతది
అవి పెనుమంటలై ఇక ప్రక్షాళనలతో విస్తరిస్తయి

సృజనా ప్రజననం

—సౌదా

పొగగొట్టం కాటుక జలపాతంలో
కదులాడిన అశ్రుకణాన్ని నేను చూశాను
సంకెళ్ల చప్పుళ్లలో
నిదురించని శ్రమవిలాపాన్ని నేనువిన్నాను
పరిమళించని అశ్రుపుష్పం
మరచిపోయిన సొగసును నేను ఆఘ్రాణించాను
చెమటచుక్క— రటనాలో
దుఃఖరేఖ సౌదామినుల్లై
జ్ఞాపకాలకుటీరంలో
మానవ పోరాటశకలాలు కలుక్కుమన స్పృహను నేన నినదించాను
మనిషి ముఖం మీద చిరిగిపోయిన మొదటిపేజి
ఒక పెనుగులాడిన పరివేదన
ఒక ప్రకటించిన మధుస్వప్నం
అరణ్య హృదయం—
కన్నీటి రక్తాన్ని వోడుతూ
మా కన్నీళ్ళింకింది-మీలో నేనునత్తుల్లై లేస్తాను
అనిస్పందించి నపుడు
పాలకులపాపపు కనుపాపలు
ఓడిపోవడమూ నేను చూశాను
కాను అశ్రువు లెప్పుడూ
నేత్రాంచల పర్షితాలుకానే కావు
సింహాసన హాసంలో
చంద్రోదయ కటాన్ని ధరించి

చీకట్లోతడుస్తూ ఇంకా శ్వాసిస్తారా అలగాజనం. . .. ?
కాదు కాదు...... అలిగిన జనం !
సంఘర్షణా పరాజయాల
పగలూరాత్రి స్పర్శలమధ్య
వొరు కుంటూ చొచ్చుకుపోతున్న
ప్రవాహదినాన్ని ఆవాహన చేస్తున్నాను
అంతటా పోటెత్తిన జనం ప్రవాహజనం
ప్రవాహా గిరిజనం
పడగెత్తినజన ప్రవాహం ఒక సృజనప్రవాహం
అశ్రిజన ప్రవాహం
ప్రవాహం ముందూవెనకా చుట్టూ అంతటా నేనే
ప్రత్యూషంకేసి సాగుతున్న మంటల
కన్నీటి కలలమధ్య నన్ను నేను కలగంటున్నాను

వెన్నెలకోసం

గవాక్యం

పోయికాడి బతుకొదిలి పోరుబాటతిగినా ఓ నాచెల్లెలా
నీ నెత్తుటి సాక్షి ఎర్రదండాతె నా చెల్లెలా
చీకట్లు వచ్చేటి అన్నల్ని జూసి ఓ చెల్లెలా
వెన్నెల కోసము ఇల్లిడిసినావె నా చెల్లెలా
పంటింటి కుండేటి జీవితానికి ఓ చెల్లెలా
ఒక్కసారిగా స్వస్తి జెప్పాతే నా చెల్లెలా
కుళ్ళు సమాజపు కట్టుబాటులా ఓ చెల్లెలా
గీత దాటి నీవు గఃబతికెక్కావే నా చెల్లెలా
నేఃతల్లి కళ్ళ నీళ్ళు తుడవాలని ఓ చెల్లెలా
తల్లిదనమూ నీవు వదులుకున్నావే నా చెల్లెలా
రాతపూతరాని నీ చేతితోటి ఓ చెల్లెలా
తుపాకినే బట్టి రాటుదేలావే నా చెల్లెలా
అంకమ్మ నిర్మల పిలుపందుకోని ఓ చెల్లెలా
ఆడోళ్ళకందరికి ఆదర్శమైనావు నా చెల్లెలా
అలిసినా పులిలోతె నిద్రపోతుంటే ఓ చెల్లెలా
నిక్కినిక్కి చూసి నక్కల్లావాళ్ళు నా చెల్లెలా
చుట్టుముట్టి మిమ్ము పట్టుకున్నారే ఓ చెల్లెలా
కాల్చిచంపి కట్టు కథలల్లినారే నా చెల్లెలా
కాల్చినా వాళ్ళకు కాల్పుల తోటి ఓ చెల్లెలా
ఖచ్చితంగా మేము జవాబు చెప్తం నా చెల్లెలా
వెన్నెలా కోసమూ నువు గన్నకలలు ఓ చెల్లెలా
ఎన్నాళ్ళకయినా సిద్ధింప జేస్తం నా చెల్లెలా

[కామ్రేడ్ జ్యోతి సంస్మరణలో]

[ఉప్పులేనింటికీ నా బిడ్డనిస్తి దమ్మదానియలో అప్పుడే జూసింటె గప్పునదందు "
అనే మహబూబ్‌నగర్ జిల్లా ఉద్దీల ఆటలో పాడే పాట బాణీలో]

పుస్తక సమీక్షలు :

సాహిత్య బాటసారి–శారద

గొప్ప గొప్ప పనులు చేసినవారు, ఉద్యమాలు నడిపినవారూ జీవితంలో గొప్ప విజయాలు సాధించిన వారి జీవిత చరిత్రలనే రాసే ఆనవాయితీ వున్న సమాజంలోకి ఒక సాధారణ వ్యక్తి జీవిత చరిత్ర వస్తే అదెలా వుంటుంది ?

అసలు జీవిత చరిత్ర అంటే ?

ఒక వ్యక్తి జీవించిన రోజుల్లో అనుకోకుండానో అనుకొనో జరిగిన అనేకానేక సంఘటనలేనా జీవితమంటే-

ఒక వ్యక్తి ఏ సంవత్సరం ఏ తేదీన ఏ గొప్పపని చేశాడో ఆ కాలక్రమ పట్టికేనా చరిత్ర ? ఈ పై రెండింటి కలయికే జీవిత చరిత్ర అయితే "సాహిత్య బాటసారి శారద" అన్న పుస్తకం జీవిత చరిత్ర కాదు.

అనేక రకాల పరిస్థితులతో అసమానతలతో వైరుధ్యాలతో నిండివున్న సమాజంలో వాటన్నిటికీ గురి అవుతూ, వాటన్నిటి తాకిడికీ తట్టుకుంటూ ఆ సమాజ మహా ప్రవాహంలో తన ఉనికిని వెతుక్కుంటూ ఆ ఉనికిని సార్థక పరుచుకోవాలని కలలు కంటూ కష్టపడుతూ, నవ్వుతూ, దుఃఖిస్తూ జీవించటం జీవితం అని ఒప్పుకుంటే- సామాన్య మానవుడు ఒక ప్రత్యేక కాలంలో ఏ సామాజిక పరిస్థితుల్లో బతుకుతున్నాడో చెప్పేదీ, ఆ పరిస్థితులవల్ల మాత్రమే ఆ మనిషి అలా వుంటం జరిగిందనే స్పృహతో, ఆ పరిస్థితులను మార్చుకోటానికి మనిషి చేసే పోరాటాలే చరిత్ర అని ఒప్పుకుంటే "సాహిత్య బాటసారి - శారద" అన్న పుస్తకం అత్యద్భుతమైన జీవిత చరిత్ర అవుతుంది. వ్యదార్థ జీవిత యదార్థ దృశ్యమే ఈ పుస్తకం.

తన జీవితకాలంలో ఎన్నో దురదృష్టాలనూ కష్టాలనూ అనుభవించిన శారదకు ఇప్పుడు-మరణించిన యిన్ని సంవత్సరాల తర్వాత అదృష్టం ఎదురయింది. ఏ తెనాలి డాక్టరు చేతిలోనో తన జీవిత చరిత్ర రంగులు మార్చుకోకుండా, విశ్వవిద్యాలయ

పరిశోధకుల చీకటి గుహల్లోనే తన జీవితం యింకోసారి అంతరించిపోకుండా తన సహచరుడు, సఖుడు, బాంధవుడు అయిన ఆలూరి భుజంగరావుగారి ద్వారా తన జీవిత చరిత్ర, జీవిత సారాంశాన్ని విడమరిచి చెబుతూ తెలుగు పాఠకులకు కోరిక పూర్తిగా తీరకుండా మరణించిన శారద జీవితమే యిప్పుడు ఒక గొప్ప కావ్యంగా తెలుగు వారికి మిగిలింది.

శారదకు మాతృదేశం మాతృభాషా ఈ సెంటిమెంట్లూ, వాటి ఔన్నత్యాల గురించి భ్రమలూ వున్నట్లులేవు. తన చుట్టూ వున్న మనుషులతో కమ్యూనికేట్ చేసుకోవాలనే తపనా తన హృదయంలో జనించే స్పందనను మాటల్లోకి మార్చాలనే కోరికా ఈ రెండే అతనిలో బలంగా వున్నాయి. శారద తెలుగు రచయిత కావటానికి అతని బతుకు దెరువు తెనాలిలో వుండటమే కారణం. అతనిలో వున్న తపనను తెనాలి వాతావరణం యింకాస్త యెక్కువ చేసింది. అనేక ఉద్యమాలకు పుట్టిల్లూ, కేంద్ర స్థానమూ కళా కేంద్రమూ అయిన తెనాలి శారద జీవితంలోని చీకటి వెలుగులను మరింత గాఢం చేసింది. అతని సున్నితమైన సహృదయాన్ని మరిన్ని ఒత్తిడులకు గురిచేసింది.
ప్రకాశం, భుజంగరావు, మొదలైన స్నేహితుల మధ్య ఆతని జీవితం మరింత సార్థకమయింది.

శారద మంచి రచయితే కాకుండా మంచి స్నేహితుడని మనకు ఈ పుస్తకం చదివితే అర్థమవుతుంది. తన స్నేహితులకు సహాయపడటమే మంచి స్నేహితుని లక్షణం అని చాలామందికి తెలుసు నిస్సంకోచంగా, మనసులో ఏ మాత్రం చిన్నబుచ్చుకోకుండా, సహజంగా, తల్లి నుంచి పాలుతాగినట్లుగా స్నేహితుల సహాయాన్ని అడిగి పొందేవాడు మంచి స్నేహితుడుగా ఈ సమాజంలో గుర్తింపబడడు కానీ దీనికి ఎంతో స్నేహమయ హృదయం వుండాలి. మనుషుల్ని తనలోకి తీసేసుకునే శక్తి వుండాలి. శారదకు ఆ శక్తి వుంది. కానీ చాలామంది శారదలోని ఆ లక్షణాన్ని అపార్థం చేసుకున్నట్లే కనపడుతోంది. "శారద ఎప్పుడూ డబ్బులు అడిగేవాడు" అనే మాట్లాడేవారున్నారు. తను యిష్టంగా కొనుక్కున్న పుస్తకాలను శారద అమ్మేసినా అర్థంచేసుకునే స్నేహితులూ శారదకున్నారు. శారద తన స్నేహితులకు తాను చేయగలిగిన సాయం చాలా చేశాడు. తన తపననూ, రచనాకాంక్షనూ స్నేహితులకు

పంచాడు తన కష్టాల్లో వారి చేయి పట్టుకున్నాడు కలిసి ప్రయాణం చేశాడు. శారద మంచి స్నేహితుడు-కాకపోతే రోజు కూలీకి హోటల్లో పనిచేస్తూ పత్రికలు నడపాలనీ, సినిమాలు తీయాలనీ ఆలోచించేవాడు కాదు. పత్రిక నడిపాడు కూడా. ఆరోగ్యం మంచిదయితే సినిమాలు కూడా తీసేవాడేమో - కలలు కనగల శక్తి ఉన్నవాడే ఏదైనా సాధించ గలుగుతాడని శారద నిరూపించాడు.

శారద మంచి పాఠకుడు - చిన్నతనం నుంచి సాహిత్యమే ఆహారంగా బతికాడు. ప్రాచీన, నవీన సాహిత్యాలతో గాఢమైన పరిచయం పెంచుకున్నాడు. ఎంతో చదివితే గాని కొంచెం రాయలేనన్న విషయం తెలుసుకుని సగం జీవితాన్ని చదువుకే అంకితం చేశాడు. గుడ్డి దీపపు కాంతిలో అనారోగ్యంతో దుర్భరమైన పరిసరాల్లో సాహిత్యం లోనే సృష్టి సౌందర్యాన్ని సందర్శించాడు. శారద సౌందర్యారాధకుడు - "శారద నీరదేందు" కాని, తన చుటుపక్కల వ్యక్తుల శారీరక మానసిక సౌందర్యాల నుండి, పావన నవ జీవన బృందావనం వంటి సమసమాజ సౌందర్యం వరకూ వెళ్ళగలిగాడు. శారద మంచి కార్యకర్త - హోటల్ వర్కర్ల సంఘంగానీ, రాత పత్రిక నడిపే రచయితల సమూహంగానీ, పాకీపని వారి సంఘం గానీ, కమ్యూనిస్టుపార్టీ పూరేగింపు గానీ, శారద చురుగ్గా ఆ పనులన్నీ చేశాడు. రచయితల సభలో రచయితకు తగిన పారితోషికం కావాలని అతను చేసిన డిమాండ్ వెనకాల కార్యకర్తగా అతనికున్న అనుభవసారం మనకు కనిపిస్తుంది. శారద మంచి హాస్యప్రియుడు-జీవితం తల్లకిందు లవుతున్న సందర్భాల్లో కూడా నవ్వుకుని నవ్వించగల శక్తి శారదకుంది. మద్రాసులో పస్తులు పడుకుంటూ పరిచయస్తుల కోసం వారి సాయంకోసం వెదుకుతూ "నెత్తిన చేయి పెడదామంటే ఎవరూ కనపడరే" అని నవ్వుకోగల ధైర్యం వుంది.

శారద మంచి రచయితగా తెలుగు పాఠకులకు చాలాకాలం నుంచీ తెలుసు. భుజంగరావుగారి పుస్తకం రాకముందు ఒక స్నేహితుడుగా, స్నేహితుడి హాస్య ప్రియుడిగా పాఠకుడిగా, సౌందర్యారాధకుడిగా, కార్యకర్తగా శారద గురించి తెలుగు వారికి ఏమీ తెలియదు - ఇప్పుడు ఒక పరిపూర్ణమైన మానవుడిగా ఆనాటి సమాజంలో శారద ఉనికి ఏమిటో తెలుగు పాఠకులకు చాలా వివరంగా తెలుసు.

శారద గురించి రాయటమంటే తెనాలి గురించే అనాటి ఉద్యమాల గురించీ రాయక తప్పదు. భుజంగరావుగారు ఆ పనికికూడా చాలా న్యాయం చేకూర్చారు. అనాడు కమ్యూనిస్టుపార్టీ ఊరేగింపులో శారదా తానూ పాల్గొన్నటు రాయటమే చరిత్ర కాదు. ఆ ఊరేగింపులో పాల్గొన్న నాయకులెవరూ ? ఊరేగింపు తర్వాత వారి స్థితేమిటి తమ పరిస్థితేమిటి అన్న విషయం కూడా రాశారు. స్వతంత్రం వచ్చి యిన్నాళ్ళయ్యాక ధనికులు మరింత ధనికులుగా పేదలు మరింత పేదలుగా మారారని అందరికీ తెలిసిందే - కానీ యిన్నేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో లక్షాధికార్లూ, కోటేశ్వరులూ అయిన కమ్యూనిస్టు లెందరు ? ఉద్యమంలో వారి పాత్ర ఎలాంటిది ? ఈ విషయం గురించి ఆలోచించాలనే జ్ఞానం ఈ పుస్తకం యిస్తుంది. ఆ జ్ఞానాన్ని కలిగించటమే చరిత్ర పుస్తకానికి వుండాల్సిన ముఖ్యమైన లక్షణం.

"ఆ రోజుల్లో కమ్యూనిష్టులమై వుండే మేము అన్ని ఆచారాలూ పాటించాం. అవి పాటించకూడదనే ఆలోచన మాకు లేదు" అని చెప్పటానికి తప్పు ఒప్పుకోగలిగే నిజాయితీ వుండేవాలు "ఆ రోజుల్లో కమ్యూనిస్టుపార్టీకి కూడా ఆ విషయాల్లో పట్టులేదు. అందువల్లే మేమలా చేశాం ! అని చెప్పటానికి ఎంతో ఆలోచనా సాహసం కావాలి.

చంద్రిక మాసపత్రిక నిర్వాహకుల్లో కమ్యూనిష్టుపార్టీ సభ్యులూ సానుభూతి పరులూ వుండి కూడా ఆ పత్రికలోని రచనలకు శ్రామికవర్గ దృక్కోణం లేకుండా పోవటానికీ - కమ్యూనిష్టు సాహిత్యంగా ప్రచారమవుతున్న సాహిత్యంలో శ్రామిక వర్గ దృక్పథం వుందా లేదా అని కమ్యూనిష్టులు పట్టించుకోక పోవటానికీ కారణాలు అడుగుతున్నారు భుజంగరావుగారు అంతేకాదు. అనాడు కమ్యూనిష్టులు పాడుకున్న పాటలు ఈ నాడు పాలకవర్గానికి ఉపయోగపడటానికీ, ఈనాటి కమ్యూనిష్టులు పాలకవర్గానికి ఊడిగం చేయటానికి వున్న సంబంధం గురించి ఆలోచించమంటున్నారు, గత చరిత్ర ఫలితమే వర్తమాన చరిత్ర అని జ్ఞాపకం చేస్తూ వర్తమాన చరిత్ర నుంచి భవిష్యత్తును చూపించే ప్రయత్నం అద్భుతంగా సౌందర్యవంతంగా భుజంగరావుగారు ఈ పుస్తకంలో చేశారు. అనాడు ఈనాడు సమాజంతో జీవిస్తూ స్పందిస్తూ ఆలోచిస్తూ వుండటమే కారణం కావచ్చు.

విశాఖపట్నం వెలుగునీడలు

విశాఖపట్నం తెలుగుదేశానికి ఇంగ్లీషు వాడిచ్చిన వరం, శాపం ఇంగ్లీషువాడు సముద్రపు ఒడ్డున తానుకొనాల్సిన వస్తువుల కోసం ముందున్న రేవు పట్నాలలో (మచిలీపట్నం, సూరత్, గోవా, వగైరా) దిగి తాను అమ్మాల్సిన వస్తువుల కోసం వాటిని నాశనం చేసి తన అవసరాలకనుగుణంగా తన రేవుల్ని తాను నిర్మించుకున్నాడు. (బొంబాయి, కలకత్తా, మద్రాసు వగైరా) అలా వచ్చిందే విశాఖపట్నం అప్పటి నుండి విశాఖపట్నం తాను పెరుగుతూ తన పెరుగుదలకు తగినట్టుగా ఇటు తూర్పుగోదావరి అడవులనుంచి అటు బరంపురం దాకా, అటు కోరాపుట్ నుంచి ఇటు సముద్రపు ఒడ్డుదాకా మొత్తం ప్రాంతాన్ని తన బలమైన నీడల బందిఖానాలోనే పెరగనిచ్చింది. ఆ క్రమంలోనే భూమిచుట్టూ అల్లుకున్న సాంఘిక సంబంధాలలో మార్పులు వచ్చాయి. "సగం సగం కాలి మొరడులా ఉన్న దాన్ని సింహద్వారమని, గోడలన్నీ జారి దిబ్బపడ్డ భాగాన్ని దివాన్‌ఖానా అనీ, చావిడి ముందు భాగాన్ని బొంకుల దిబ్బ అనీ అనుకోవడం లాంఛనప్రాయంగా మిగిలేయి గాని వాటి స్వరూపమే మారిపోయింది" (దివాణం సేరీపేట-భూసపాటి కృష్ణంరాజు) ఈ మార్పుల్ని నియంత్రించడం కోసం

"సాహిత్య బాటసారి-శారద" అన్న ఈ పుస్తకంలో జీవితమూవుంది. చరిత్రవుంది కావ్య సౌందర్యం జీవన మాదుర్యం చారిత్రక గాంభీర్యం పెనవేసుకున్న పుస్తకం యిది. అందుకే ఈ పుస్తకం చదువుతూ మనం మనసారా నవ్వుతాం ఏడుస్తాం, దిగులు పడతాం ఆలోచిస్తాం ప్రశ్నిస్తాం.

—అక్కినేని కుటుంబరావు

సాహిత్య బాటసారి-శారద, స్మృతిశకలాలు
ఆలూరి భుజంగరావు, ప్రతులకు రాహుల్ సాహిత్య సదనం గుడివాడ
521 301 పే. 156 వెల రూ. 6.

ఒక రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వచ్చింది (కఠిన శిక్ష - భమిడిపాటి రామగోపాలం) అంతేకాదు తరతరాలుగా బాకీ పడిపోయే అప్పు గురించి ఆందోళన పడుతున్న పోలిగాడితో "ముందుకి సిన్నోడు పెరగడా ? ముందుకు అట్టే కంబారితనం వుంచి ముందా అప్పు తీర్చమా" అని అసిరి అన్నట్టు (వారసత్వం-పండిత అ-నరసింహశర్మ) వాళ్ళ జీవితంలో కంబారితనం ప్రకృతంత సహజమైపోయింది. వ్యాపారమే కాదు, పెట్టుబడి కూడ ప్రవేశించింది. దాని అవసరాలకోసం "కారడవులలో కొత్తగా రైల్వేలైను" వచ్చింది: (వఱడు-అల్లం శేషగిరిరావు) ఇంత వ్యాపారాన్ని, పెట్టుబడిని తీసుకువచ్చిన బ్రిటిష్‌వాడు దాన్ని సక్రమంగా నడిపించేందుకు ఒక పెద్ద న్యాయ వ్యవస్థని నిర్మించు న్నాడు. "పాడులోకానికి తగినట్టుగానే న్యాయం నిలబెట్టాడు ఇంగ్లీషువాడు ఈ కోర్టు ఈ 'లా' పుస్తకాలు ఈ ప్లీడరీ పట్టాలు, ఈ సాక్షి పద్ధతులు ఇవన్నీ వాడి భిక్షే.... ఎదురుతిరిగితే... సాయానికి కోర్టులున్నాయి, జెయిళ్ళున్నాయి. ఇవి లేకపోతే ఇంగ్లీషువాడి రాజ్యమే లేదు. గొప్ప మాయగాడు (మాయ-రాచకొండ విశ్వనాథశాస్త్రి) ఈ మాయకు మొదట్లో బాధితులయి, తిరిగి దాన్ని బలంగా ప్రచారం చేసే మధ్య తరగతి ఒకటి వచ్చింది. ఈ మధ్య తరగతి ఎప్పుడూ "పులివెంట తిరుగుతూ ఉంటుంది. పులి తిని విడిచిపెట్టేసిన మాంసం, ఎమ్ములు తిని బతుకుతుంది" (వఱడు-అల్లం శేషగిరిరావు) అయితే ఈ క్రమానికి కూడ ఎక్కడో ఎప్పుడో ప్రతి చర్య ఉండకుండా పోదు. రాజులకి దర్పం తప్ప మరేమీ మిగల్లేదని సామాన్య ప్రజానీకానికి అర్థమవుతుంది. "సినరాజులు సేరిపేట జిగిని పందిని కాకపో[illegible] ఆడిపిపంది మినదే" అని నరిసి నవ్వుతూ చెపుతుంది. ఎంకి అంతా అర్థమ[illegible] ఒర్రి తిప్పుకుంటూ గ్రామంలోకి వెళ్ళిపోతుంది (దివాణం సేరిపేట) అడవి[illegible] కొన్నవాడే క్రమంగా అడవిని తినేయడం సాగించిన సత్తెయ్య షావుకారి వ్యాపారం తక్కున ఆగిపోతుంది. "ఒకనాడు గోచిపాతల్తో మిగిలిన వాళ్ళంతా ఏకమై నిలబడ్డారు." (అడివంటుకుంది-భూషణం)

స్థూలంగా చెప్పుకోవాలంటే ఉత్తరకోస్తా ప్రాంతం సామాజిక చరిత్ర ఇది సముద్రతీరాన విశాఖపట్నం వెలియకముందే ఈ ప్రాంతాన్ని రాజులు ఏలినకాలంలో "దేవుడు [illegible] నమ్మకం (బొమ్మరూపాయి చాగంటితులసి) సృష్టించిన మాయ ఏలింది. ఆ తర్వాత ఇంగ్లీషువాడు సృష్టించిన

మాయవాదానికి తోడయింది. మానవ సంబంధాలన్నీ ఈ మాయలో భాగంగానే తప్ప తమదంటూ ఒక అస్తిత్వం లేనివిగా కనిపిస్తాయి. అయితే ఈ "మాయ మధ్య ఎంతటి బాధ" (మాయ) మనలో కొందరికి ఈ మాయ అర్థంకాదు మరి కొందరు మాయని తెలుసుకోగలరు గాని బాధను తెలుసుకోలేరు తెలిసినా పట్టించుకోరు కొందరు పట్టించుకుని ఈ మాయకు భౌతిక పునాదిగా ఉన్న సమాజాన్ని "దుంప నాశనం చేసేస్తే గాని బతుకు లేదు (అడిపంటుకుంది) అని గ్రహించిన ప్రజల పోరాట చైతన్యానికి ప్రతిస్పందించే వాళ్ళు మరికొందరు, అందరూ ఇందులో భాగమే ఈ మాయలో భాగం అవుతూ కూడ దానికి వెలుపల నిలబడుతూ ఈ సామాజిక చరిత్ర మీద తెలిసోతెలియకో తమ ప్రతిఫలనాలని కథలుగా రాయగల శక్తి ఉన్న మధ్య తరగతిని కూడ ఈ మాయని సృష్టించిన క్రమమే సృష్టించింది. ఈ ప్రాంతంలో పుట్టిన అలాంటి కొందరు కథకుల కథల్ని "కళింగ కథానికలు" పేరుతో చాసో ప్రచురించారు.

కళింగ కథలకే కాక తెలుగు కథకు శ్రీకారం చుట్టిన గురజాడ కథ దిద్దుబాటు, సానిదానికి అలవాటుపడ్డ భర్తతో కోపాన్ని నటించి మరుగున పడిన ప్రేమను, అభ్యుదయ దృక్పథాన్ని పైకి తీసుకువచ్చిన కమలిని కథ.

ఈ సంకలనంలో చోటు చేసుకున్న ఉప్పల లక్ష్మణరావుగారి కథ గెరిల్లా. ఇది కళింగ కథ కాదు తెలంగాణ పోరాటకథ. అతడు-ఆమె నవలలోలాగే ప్రజా ఉద్యమాలలో పడినలిగే స్త్రీ పురుష సంబంధాల గురించిన కథ. అయితే జాతీయోద్యమంతో ఉన్న పరిచయం అనుబంధం లక్ష్మణరావు గారికి తెలంగాణతో ఉన్నట్టు అగుపించదు. (వాతావరణంలో బిగుసుకు పోయిన ఒక తెలంగాణ పోరాట గ్రామాన్ని "సాగతీసిన వీణ తీగెలా రవంత తాకితే చాలు మొరోగ్రి అని మోగుతుంది" అనే ఉపమానంతో వర్ణించారు !) బహుశా అందుకే కథలో స్త్రీ పురుష సంబధాలలో ఉండే సంతోష భయాందోళనలని చిత్రించినంత బలంగా ఆయన వాటి సామాజిక నేపథ్యాన్ని ప్రతిఫలించలేకపోయారు.

చిగురుమర్తి వెంకట రామారావుగారి "భద్రయ్యగారి సమస్య" ఒక ఉమ్మడి కుటుంబంలో జీవితాంతం ప్రైవసీ లేకుండానే గడించిన ఇద్దరు వృద్ధ దంపతుల

అవసరాలపై అల్లిన సున్నితమైన ప్రేమ కథ. ఉమ్మడి కుటుంబ నిర్మాణం కళింగ ప్రాంతంలో కూడా ఇంకా బతికి ఉందనేది అనుమానమే. కాని కుటుంబ వ్యవస్థలో ఉండే నిర్భంధాన్ని మరింత తీవ్రతరం చేసే ఉమ్మడి కుటుంబాలలోని కుటుంబ పెద్దల్లో సున్నితత్వం, సామ్యం తప్ప మారేమీ ఉండదనుకుంటే ఇది మంచి కథ.

ఈ ప్రాంతం సామాజిక చరిత్రను తన కథలలో అద్భుతంగా ప్రతిఫలించిన కాళీపట్నం రామారావుగారి మిగతా కథలన్నిటినీ పక్కకు నెట్టేసి ఈ సంకలనంలో ప్రవేశించిన కథ వీరుడు-మహావీరుడు. ఇది మహానగరపు లంపెన్ సమాజ నేపథ్యంలో జరిగే ఇద్దరు రౌడీల మధ్య ఫైట్ విడిపించడానికి వెళ్ళిన గంజిపేట రౌడీని అల్లిపుర వస్తాదు తంతుంటే నిరపేక్షగా చూసే ప్రేక్షకుల మీద ఒక విమర్శ మధ్యలో దిగిన కొత్తపేట శాంతో బలవంతుడి సైడు తీసుకుంటాడు. వాడి బలానికి బహుశా కారణం అదే అయివుంటుందని మనకు అనిపిస్తుంది. ఈ కథలో 70ల నాటి ఇండో-చైనా కథని కూడా చదివితే బహుశా కారా అభ్యంతరం చెప్పరు. కాని ఆయన కూడా ఊహించనంత విచిత్రంగా ఇందులో 80లటి ఇండో చైనా కూడా దాగిఉంది.

తర్వాతకథ పండింత అ నరసింహాశర్మగారి వారసత్వం. సిసలయిన కళింగ కథ. ఒక చిన్న ఊళ్ళో జీవితావసరాల కోసం అప్పు తీసుకుంటూ తరతరాల కట్టుబానిసతనానికి గురయ్యే అసిరి, పోలిగాళ్ళకథ. ఈకథలో కంబారితనం [illegible] దుర్మార్గంగా కాదు, వాళ్ళ జీవితాన్ని శాసించే ఒక భౌతిక నియమంలా (Objective Law) గాకన్పిస్తుంది పెద్దగా ప్రాచుర్యం పొందని ఇంత మంచి కథని వెలుగులోకి తీసుకొచ్చినందుకు మనం చాసోని అభినందించాలి,

ఈ ప్రాంత గ్రామీణ సమాజ సాంఘికాధికారంలో వచ్చిన, వస్తున్నమార్పుల్ని రాజులవేట ద్వారా చిత్రించిన కథ పూసపాటి కృష్ణంరాజుగారి దివాణం సేరివేట కొండకోడి గొల్లపాలెం చెంద్రిగాడి జగిని పందిని పట్టుకుని అడవి పందని చెప్పి తమ దర్పాన్ని ప్రదర్శించుకునే రాజుల కథ. ఆ విషయం చెప్పినందుకు చెంద్రిగాడికి దవడమీద వాత, ఏభై రూపాయలు మాత్రం మిగిలాయి. ఈ దౌష్ట్యం, డబ్బు సహాయం లేకుండా పాతకాలపు దర్పం, మాయ నిలబెట్టు కొవడం కష్టం అని చెప్పకని

చెప్పినకథ (ఈ కథలో మునిలిరాజుగారు కొన్నాళ్ళకితం విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉండి మీసాలు తప్ప మరేమి మిగలని మరో రాజుగారిని మనకు జ్ఞాపకం చేస్తారు).

రెవిన్యూ డిపార్ట్‌మెంట్ రూల్సు ప్రకారం ఈ శాఖలో చేరిన ప్రతి వ్యక్తి ఉన్నతోద్యోగానికి ప్రమోషన్ పొందాలంటే కనీసం రెండేళ్ళపాటు రె వి న్యూ ఇనస్పెక్టర్‌గా **(RI)** గా పనిచేయాలి. ఈ రెవిన్యూ డిపార్ట్‌మెంట్ అనే రాక్షసిని సృష్టించిన బ్రిటిష్ వాడి భారతీయ శిక్షాస్మృతిలో (RI) అంటే Rigorous Imprisonment-కఠినశిక్ష-అని అర్థం. రెవిన్యూ ఇనస్పెక్టర్ (RI) గా వచ్చి పై అధికారులని మేపడం కోసం తను లంచాలు పుచ్చుకొని చివరికి మరో రెండేళ్ళు మరో R_I, కఠినశిక్షకు, గురి అయిన వాసుదేవరావుకథ "కఠినశిక్ష" రచయిత భమిడిపాటి రామగోపాలంగారు పుటుకవల్ల కళింగుడేకాన కథకుడిగా మాత్రం ఏ ప్రాంతానికయినా చెందవచ్చు, రెవిన్యూ డిపార్ట్‌మెంట్ లా.

మధ్య తరగతి బ్రాహ్మణ జీవితాల్లో దేవుడిమీద, పేదవాళ్ళ మీదా ఉన్న ప్రేమలో ఇమిడిన హిపోక్రసికి అద్దంపట్టినకథ, చాగంటి తులసిగారి బొమ్మరావాయి.

1967 అక్టోబర్ లో, పార్వతీపురం తాలూకా కవిడి దగ్గర కొరన్న మంగన్నల వీర మరణంతో మలుపుతీసుకున్న శ్రీకాకుళ పోరాట నేపథ్యంలో రాసిన భూషణంగారి ప్రముఖకథ "అడివంటుకుంది', కథ చదువుతుంటే నవలను కథగా కుదించారే అని అనిపిస్తుంది. శ్రీకాకుళంలో గొచిపాత రామున్న తిరుగుబాటు సుదీర్ఘ పోరాట ప్రయాణంలో ఒక మైలురాయి. కవిడి సంఘటన గుణాత్మక మార్పుని సూచించే ఒకదశ కాని ఈ కథలో అది అకస్మాత్తుగా జరిగిన ఒక సంఘటనగా కన్పిస్తుంది. అది కేవలం నవ ను కథగా కుదించడంవల్ల జరిగిన ఒక రచనా నిర్మాణ లోపమా ? ఇన్నేళ్ళయాయిం తరువాత ఈ కథ మళ్ళీ చదువుతుంటే అది ఒక రాజకీయ ఏర్పథం కూడానా అని ప్రశ్న ఉదయించకమానదు ఆ ప్రశ్నకు ఇంకా సమాధానం మాత్రం దొరకాల్సేఉంది.

బస్సు ప్రయాణంలో ఎవగింపుకున్న వాడికే సేవలు చేసిన "మోటుమనిషి" కథ కె. ఎన్. వై. పతంజలికథ దీన్ని గురించి మనం చెప్పుకోవల్సిందేమిలేదు. బ్రిటీష్ వాడు సృష్టించిన "మాయ" గురించిన కథ రావిశాస్త్రి సారాకథ "మాయ" తెలుగు సాహిత్యంలో గొప్ప కథల్లొ ఒకటి. అయితే ఒక్క విషయం మాత్రం చెప్పుకోవాలి. బ్రిటీష్‌వాడి మాయలో ప్రాంతీయత కంటే సార్వజనీకతె ఎక్కువ. ఈ మాయ కలకత్తాలోనూ, బొంబాయిలోనూ లాహోర్‌లోనూ కూడా కన్పిస్తుంది. అయితే అక్కడ దాని మాండలీకంవేరు. ఆ రకంగా చూస్తే రావిశాస్త్రి కళింగ కథకుడుకాడు. మరి ఆయన కథా ప్రపంచంలో భాగమయి మసందరి జీవితాలని వెన్నాడే విశాఖ నగరపు అదోజగత్ ప్రపంచపు (Underworld) మనుషులు కళింగులే కదా అని ఎవరయినా మనల్ని ప్రశ్నించవచ్చు మాండలీకం, యాస, (Slang) వేరయినా ఈ మనుషులు కిషన్ చందర్ కథలలో (బొంబాయి), సాదత్ హసన్ మాంటొ(లాహోర్) కథలలోనూ కూడా మనకు కన్పిస్తారు, నిజానికీ రావిశాస్త్రి కథల్లొ పలికించిన ప్రజాజీవితం, ఆ ప్రజల జీవితాన్ని మనకి పరిచయం చేయడం కోసం రాసినట్టుతోచదు వాళ్ళ జీవితాన్ని సాధనంగా తీసుకొని మధ్యతరగతిని, సమాజాన్ని, మాయను విమర్శించడము వాటి ప్రయోజనం. కథకుడిగా రావిశాస్త్రిలో బలమూ అదే, బలహీనత అదే విశాఖపట్నంలేకున్నా కళింగ ప్రాంతముండేది కాని బ్రిటీష్ వాడు, వాడి మాయలేకపోతే విశాఖపట్నం లేదు విశాఖపట్నం లేకపోతే రావిశాస్త్రి లేడు.

మనుషుల కోసం కాక రేవు పట్నానికి ఖనిజం చేరవేయడం కోసం అడవుల్లొ వేయించిన రైల్వేలైను ప్రాజెక్టు నేపథ్యంలో నడిచినకథ అల్లం శేషగిరిరావు గారి వఱడు కథ తనను ప్రేమించి తన గురించి ఇంజనీర్‌తో తగువు పెటుకున్న డ్రైవర్ చిన్నయ్య డిస్మిస్‌కి కారణమయిన ఎకౌంటెంట్ దశరాధ రామయ్యకథ ఈ కథలో చిన్నయ్య పాత్ర, మొత్తం ప్రాజెక్టు కాంపు వాతావరణమూ ఏక కాలంలో వాస్తవికంగానూ, కాల్పనికంగానూ కన్పడి మన మనసు మీద బలమయిన ముద్రవేస్తాయి.

ఒకే స్కూలుకి వెళ్ళెమోతుబరి రైతు కూతురు, గొచిపాత రాముడి కూతురు మధ్య జీవన స్థితిగతులలో మాత్రమే కాక చిన్నప్పుడే వాళ్ళ చైతన్యంలోనూ,

దృక్పథాలలోనూ కూడా ప్రతిఫలించే అసమానతలను చిత్రీకరించిన కథ చాగంటి సోమయాజులు గారి "కుంకుడాకు"

చివరి కథ త్రిపుర గారి "పాము" ఇదికూడా కళింగ కథ కాదు బెనారస్ విశ్వవిద్యాలయకథ రోజుకో వేషం వేసుకొని ఉల్లిపొరలా తనని తాను వలుచుకుంటూ పొర వలిచినప్పుడల్లా మధురమయిన విషపు నవ్వు నవ్వుతునే శేషాచలపతి అను అలఫ్ నిరంజన్ అను సాల్వడార్ డాలీ కథ. మామలో ఇమడనూలేక దానితో పోరాడనూలేక ఎటూ చెందకుండా పరాయీకరణకు గురి అయ్యే నగర మధ్యతరగతి వ్యక్తుల అస్తిత్వవాద ఆందోళన త్రిపురగారి భావ ప్రపంచం. ఈ భావ ప్రపంచానికి భౌతిక జీవితానికి మధ్యవైరుధ్యం నిజంలా కన్పించి మనల్ని పీడించె ఒక అబద్ధం, పరాయికీకరణలో ఉండే సామాజిక అంశాను గుర్తించకపోతే దీనిగమ్యం "దశాశ్వమేధఘాట్" అందుకే బహుశా త్రిపుర కథలనిండా ఒంటరితనపునిగులు, మరణపు నీడలు అయితే ఏదో ఒక స్థాయిలో ఈ విషయం కథకుడికి తెలుసున్ అనిపిస్తుంది, ఆయన కథలో ఉన్న ఐరనీ వల్ల మాత్రమేకాదు ఆ కథలు రాయడం మానేసినందువల్లాకూడా, ఆయనను అభిమానులకి ఈ విషయం అర్థమయినట్టు లేదు. **He is condemned to appreciation by misunderstanding** (చూడుడు త్రిపుర కథా సంకలనం చివర అనవసరమయిన వ్యాఖ్యలు) ఇక ఇప్పుడు చాసోగారు ఆయనకు కళింగతను అపాదించారు.

మొత్తం మీద ఇది కళింగత తక్కువయిన కళింగ కథా సంకలనం. ఈ కథకులు కాకుండా ఇతర కళింగ కథకులు లేదా ఇందులో ఉన్న కథకులవి కూడా ఇంతకంటె మంచి కథలులేవా అని మనకు సందేహాలు రాకమానవు అయితే ప్రశ్నలతో చాసోని బాధించడం మాత్రం అనవసరం. "నా భావాలకి అనుగుణంగా నాకు నేను ఏర్చికూర్చినవి. నాసప్తతికి నా స్వంతఖర్చుతో ప్రకటించ బడ్డది. కేవలం నా వ్యక్తిగతమయిన సంకలనం. అదెందుకు వేశారు? ఇదెందుకు వెయ్యలేదు? అన్న ప్రశ్నలకి తావులేదు" అని ఆయన ముందుగా ముందు మాటలో చెప్పుకొన్నారు. "యువతరం కొరకు ఈ సంకలనం" అని ఆయన అందించిన ఈ మంచి కథా సంకలనం లేవనెత్తిన ఈ ప్రశ్నలకి యువతరం మాత్రం సమాధానం వెతుక్కోవాలి.

ఈ సంకలనంలో ఉన్న 14మంది కథకుల్లో సుమారు పదిమంది ప్రాథమికంగా విశాఖపట్నం కథకులు. నగరాలు ఆధునిక సాహిత్యానికి పుట్టినిల్లు అని 18వ శతాబ్ది చివరి రోజుల నుండి ప్రపంచ సాహిత్య చరిత్ర చేపుంది. మనకు హైదరాబాద్ అనే మరోనగరం ఉంది కాని అది కవి తిలక్ భాషలో "ఫ్యూడల్ రహస్యాలని నేటికి దాచుకున్న పుండ్రేక్షు కోదండం" విశాఖపట్నము మన మొదటి ఆధునిక నగరం. భయంకరమయిన దోపిడినీ, దానిచుటు అల్లుకున్న అద్భుత మాయని, ఈ రెంటివల్లా వైవిధ్యము, విస్తృతం అయిన ప్రపంచాన్ని ఇచ్చిన విశాఖపట్నం సామ్రాజ్యవాదం తెలుగు దేశానికిచ్చిన వరం శాపం.

చివరిగా ఒక్కమాట. గురజాడ దిద్దుబాటు కథలో సానికొంప నుండి ఇంటికి ఆలస్యంగా వచ్చిన గోపాలరావు భార్య కనపడకపోవడంతో ఆందోళనపడ్తాడు. పనివాడు రాముడి మీద అరుస్తాడు. "కోపగించితే చెప్పలేనుగాని, ఆడారు చదువు నేరిస్తే మేటికది" అని రాముడంటాడు. స్త్రీకి విద్య ఉండాలని విశ్వసించె గోపాలరావు వాదిస్తాడు. "ఆడోరు యెజమాని చెప్పినట్టల్లా యిని పల్లకుంచాలి లేకుంటే సానమ్మ నుంచుగుంటారు" అని తన విశ్వాసాలని మరింత బలంగా ప్రకటిస్తాడు రాముడు. ఇందులో ఓ విచిత్రమయిన వైరుధ్యంఉంది. సమాజాభివృద్ధి క్రమానికి అవసరమయిన విశ్వాసాన్ని కలిగి ఉన్న గోపాలరావు ఇంకజేసి సానికొంపలకు అలవాటు పడిన వాడయ్యాడు. అభివృద్ధి నిరోధకమయిన భావాన్ని ప్రకటించే రాముడు నిజాయితీ పరుడిగా కన్పిస్తాడు. ఈ వైరుధ్యం చరిత్ర మన కిచ్చిన వైరుధ్యం గురజాడ ఈ కథ రాసి ఎనిమిది దశాబ్దాలు గడిచింతరువాత ఇప్పుడు మనకు ఒక ఆలోచన వస్తుంది. రాముడికే ప్రగతిశీల చైతన్యం ఉంటే ఈ కథ ఎలా ఉండేది ? ఈ ప్రాంత చరిత్ర ఎలా ఉండేది ? ఈ ప్రశ్నలకి ఈ సమీక్షకుడి దగ్గర సమాధానాలులేవు కాని బహుశా అప్పుడు నిజమయిన, నిండయిన కళింగ కథా సంకలనం వస్తుందని మాత్రం ఆశించ వచ్చు.

—సూరా

సాహిత్యలేఖలు
ప్రజానాట్యమండలి జ్ఞాపకాలు
(సృజన ప్రచురణ)

పై గ్రంథానికి శ్రీ కె. వి. ఆర్. గారు రాసిన ముందుమాటకు మరికొంత సమాచారం :

1) 4వ పేజీలో 8వ పంక్తిలో శ్రీయుతులు పెండ్యాల లోకనాథం, తుమ్మల పెండ్యాల లోకనాథం, తుమ్మల వెంకటరామయ్య గార్లతో పాటు శ్రీ వాసిరెడ్డి నాగేశ్వరరావు అనే రైల్వే ఉద్యోగి కూడ కార్మికులను ప్రబోధిస్తూ "కూలోడా" ? వగైరా అనేక గేయాల్ని రచించారు. అది "ప్రభ" పత్రికలో (1935) ప్రచురింపబడి చాలా పాప్యులర్ అయాయి, అందుచేత ఆయన పేరు కూడా ఉదహరించవలసింది.

2) అదే పేజీ చివరలో సోషలిస్టు పార్టీ 1935 కాలం నాడు నిర్వహించిన. ప్రజాఉద్యమాల జాబితాలో మహిళాసంఘాలు కూడా నిర్మించబడి ప్రచారం జరిగింది. ఆ రోజులలో తూర్పు గోదావరి జిల్లాలో మహీధర సీతాదేవి (మహీధర జగన్మోహన్ గారి భార్య) ప॥గోదావరి జిల్లాలో శ్రీమతి పరకాల అహల్య (పరకాల పట్టాభిగారి భార్య) అద్దరాజు మాణిక్యాంబ (అద్దరాజు రామంగారి భార్య) మొ॥ వారు చురుకుగా పనిచేశారు.

3) 9వ పేజీలో 8వ పంక్తి తరువాత పేర్కొన్న బుర్రకథ దళాలలో వల్లం నరసింహారావు, కేశవరావు, పెరుమాళ్ళు గారలతో కూడిన దళం కూడ బహుళ ప్రచారం చేసింది, వీరు, "కష్టజీవి", "అల్లూరి సీతారామరాజు" కథలకు ప్రసిద్ధి చెందారు.

4) 10వ పేజీలో 12వ పంక్తి "అపనింద" నాటకాన్ని మహిళాదళం మద్రాసులో కూడా ప్రదర్శించారని రాశారు. మద్రాసులో ఆ నాటకాన్ని ప్రదర్శించినది కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి (కోడూరి అచ్చయ్య గారి దర్శకత్వం) అని జ్ఞాపకం.

అదే పేజీలో స్త్రీలే స్త్రీ పాత్రలు పోషించిన నాటకాల కంపెనీలలో ప్రఖ్యాత సురభి నాట్యమండలిని కూడా పేర్కొంటే బాగుండేది. సమాజంలో వారికి ఈ నాటికీ గౌరవం వుంది.

అదే సందర్భంలో ప్రజానాట్యమండలిని గురించి చెప్పినప్పుడు మరో ముఖ్యమైన విషయాన్ని కూడ పేర్కొనవలసింది. అదేమిటంటే, ఘోషా పద్ధతిని అనుసరించే క్షత్రియ కుటుంబాల నుంచి కూడా స్త్రీలు వచ్చి ప్రజానాట్యమండలి వారి నాటకాలలో స్త్రీ పాత్రలు నిర్వహించడం. ఉదాహరణకు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యాకాంతం అనే పెండ్లికాని 12-13 ఏళ్ళ అమ్మాయి వచ్చి రాష్ట్ర ప్రజానాట్యమండలి దళంలో "మా భూమి" నాటకంలో "కమల" పాత్రను నిర్వహించేది. తరువాత కొందరు పిల్లలు బుర్రకథ దళాలుగా ఏర్పడి కథలు చెప్పేవారు కూడ.

5) 11వ పేజీలో శ్రీ మిక్కిలినేని గారు పేర్కొన్న ప్రజానాట్యమండలి కళారూపాల జాబితాలో వీధి భాగవతాన్ని పేర్కొనలేదు. ఆరోజులలో శ్రీ కోగంటి గోపాలకృష్ణయ్య రచించిన "హిట్లరు పరాజయం" వీధి భాగవతం ఎంతో ప్రజాదరణ పొందింది.

6) 12వ పేజీలో 18వ పంక్తిలో కోడూరి అచ్చయ్య దర్శకత్వంలో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి వగైరా నటీనటులతో నాటకాలు ప్రదర్శింపబడేవని రాశారు. అది పొరపాటు-కోడూరి అచ్చయ్యగారు కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలికి దర్శకులు. వీరు పేర్కొన్న నటీనటులు రాష్ట్ర ప్రజానాట్యమండలి దళంలో వుండేవారు. దానికి దర్శకత్వం డా॥ రాజారావుగారు వహించారు. కోడూరి అచ్చయ్యగారు కాదు. రాష్ట్ర దళం ఏర్పడకముందే కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి ఏర్పడి "ముందడుగు" "అపనింద", "మా భూమి" నాటకాలను అచ్చయ్యగారి దర్శకత్వం కింద ప్రదర్శించేవారు.

7) 12వ పేజీలో నాలుగో పేరాలో 'మా భూమి' నాటకం మీద 'అభ్యుదయ్' పత్రికలో ప్రచురించబడిన ప్రతికూల విమర్శలో ప్రయాగ కోదండ రామశాస్త్రి హస్తం ప్రోత్సాహం కూడా వున్నాయి. ఆ విమర్శను యువజన సంఘం పత్రిక "నవయుగ" లో శ్రీ శ్రీకోదండరామశాస్త్రి వచ్చి ఆయన వద్ద క్షమాపణ కూడా చెప్పుకున్నాడట.

8) 7వ పేజీలో 6-7 పంక్తులలో పేర్కొన్న వల్లం రాధ, వల్లం రుక్మిణి ఇద్దరూ ఒకటే ఆమె పూర్తి పేరు రాధారుక్మిణి అంతా రాధ అనే పిలుస్తారు.

తెలంగాణా ప్రజా పోరాటానికి ప్రజానాట్యమండలి ఎంతో ఉత్తేజాన్ని సహాయాన్ని ఇచ్చింది. పోరాటం సాగిన దినాలలో ప్రజానాట్యమండలి దళాలు నైజాం-ఆంధ్ర సరిహద్దు గ్రామాలలో తమ కార్యక్రమాలను ఇచ్చి వేలాది తెలంగాణా ప్రజలను ప్రబోధించాయి. సభలలో విరాళాలు పోగుచేసి తెలంగాణా పోరాటనిధికి పంపేవారు. ఆ సభలకు శ్రీ రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి గారలవంటి ప్రముఖులు హాజరయ్యేవారు. ఆ కార్యక్రమాలను, సభలను భగ్నం చెయడానికి నైజాం ప్రభుత్వం గుండాలను ప్రయోగించేది. అయినా ప్రజలు వారిని తిప్పికొట్టేవారు.

—కె. రాధ

తా. క : మీరు ప్రచురించిన "లేఖ" లోని విషయాలను గురించి నాకు అంతగా తెలియదు. అందుచేత బాగోగులను గురించి నేనేమీ చెప్పలేను. కాని ప్రజానాట్య మండలి చరిత్ర చెప్పేటప్పుడు కృష్ణాజిల్లాలో దాని ప్రథమ, ప్రముఖ నిర్మాతలలో ఒకరైన ఆయన పేరు చెప్పక పోవడం మాత్రం - అది ఏవిధంగా జరిగినా - తప్పే అని నా అభిప్రాయం.

మొదట కృష్ణాజిల్లా బుర్రకథ స్త్రీల దళంలో తాపీ రాజమ్మ, కిలారు సత్యవతి, అమ్మణ్ణి చెప్పేవారు. అలాగే గుంటూరు స్త్రీం దళం మోటూరు ఉదయం, మహంకాళి లక్ష్మి, చింతల కోటేశ్వరమ్మ, ఆనాడు పాడిన పాట, "ఎన్నాళ్ళీ గతి బానిస బ్రతుకు యోచన చేయవదేలా ! మూన్నాళ్ళనను స్వేచ్ఛగ బ్రతుకుట మేలని ఎంచరదేలా" !

అనాడు నాటకం "ప్రతిమ" నటకులు లక్ష్మి పెరుమాళ్ళు, వి. మధుసూధన రావు (మరికొందరు).

శ్రీ ఆత్రేయ రచించిన నాటకం "పరివర్తన" నటకులు ఆత్రేయ, కొమరాజు పద్మ, డాక్టరు రాజారావు (మరికొందరి పేర్లు గుర్తులేవు)

తరువాత నాటకం "ముందడుగు" ఈ నాటకాన్ని కోటూరు అచ్చయ్యగారు డైరెక్టు చేశారు. ఇందులో శ్రీ పాత్రను కొన్నాళ్ళు సూరపనేని పెరుమాళ్ళు, వల్లం నరసింహారావు పోషించారు. తరువాత అదే పాత్రలను కొండపల్లి కోటేశ్వరమ్మ, అనసూయ నటించినట్లు గుర్తు.

ఎందరో మహారథులు (సంవత్సరాలు గుర్తులేవు) అనాడే భారత కమ్యూనిస్టు పార్టీ సెక్రెటరీ శ్రీ పి. సి. జోషి అవగాహనను బలపర్చి (పుచ్చలపల్లి సుందరయ్య మద్దుకూరి చంద్రం), డాక్టర్ కొమరాజు అచ్చమాంబగారు, ముక్కామల నాగభూషణం మరికొంతమంది నాయకులు ఇచ్చిన పిలుపుతో, పార్టీ కామ్రేడ్, సానుభూతి పరులు తమ బిడ్డలను, భార్యలను, "ప్రజానాట్యమండలి" నాటకాలు ఇతర కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో మహిళలు పాల్గొనే ప్రోత్సాహన్నిచ్చి ముందుకు పంపారు. అనాడు పాల్గొన్న మహిళాదళం (అచ్చమాంబ గారింట్లో) డాక్టర్ రాజారావు గారి ఆధ్వర్యంలో ముక్కామల, నాగభూషణరావు డైరెక్షన్‌లో-మోటూరి ఉదయం, ప్రభావతి, చిట్టెమ్మ అన్నపూర్ణ, కిలారు సత్యవతి, కొమరాజు పద్మ సీనియర్ సరోజిని, జూనియర్ సరోజిని అనాటి పాటలు (ఆ దళం ప్రదర్శించిన ప్రోగ్రామ్స్ "మా తెలుగు తల్లికి మల్లె పూదండ", దేశమను ప్రేమించుమన్నా! మంచి యన్నది పెంచుమన్నా" మాస్కో పొలిమేర లోనా" లాట "భారతీ భారతీ ఉయ్యాలో", బతకమ్మ నృత్యం, "నా ఎమంత్రసాని" నాటిక పద్మ రా కొన్నాళ్ళ తరువాత.

"అపనింద" నాటకం కృష్ణాజిల్లా దళం సభ్యులు శ్రీ కోటూరు అచ్చయ్య కృష్ణమూర్తి, రాఘవేంద్రరావు, భాస్కరరావు, కేశవరావు, చదలవాడ కుటుంబరావు సాలారు, పెరుమాళ్ళు, కొల్లూరు, సుబ్బారావు, వల్లం నరసింహారావు, చలపతిరావు, రాధారుక్మిణి, సరోజిని, "అపనింద" నాటకం రిహార్సల్ రెండు మాసాలుపైగా

జరిగాయ్. రోజుకు కనీసం పదిగంటలు జరిగేవి, "సంసార స్త్రీలు నటిస్తున్నారట" అనేది పెద్ద సంచలనం కలిగించింది. ఆ సంచలనానికి కారణ భూతులైన వారి స్థితి వర్ణించడానికి ఎన్నో పేజీలు పడుతాయి. "అపనింద" నాటకం మొదటి ప్రదర్శన పి. సి. జోషి అతిథిగా రామాటాకీస్ (విజయవాడలో), అలాగే ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా, మద్రాసు వి. పి. హాల్ కోపూరు అప్పయ్యగారి డైరక్షన్‌లో ప్రదర్శనలు జరిగాయి. "అపనింద" రచించిన సుంకర, వాసిరెడ్డి గారలకు మంచిపేరు వచ్చింది. ఆ తరువాత వారే "మా భూమి" నాటకం రచనచేసి ఎంతో పేరు గడించారు. ఆ రచనలే వారిని సినీరంగానికి ఆకర్షించాయి. ఆ నాటకం విజయవాడ నాట్యకళా పరిషత్‌లో సెకండ్ ప్రయిజ్ సంపాయించింది.

ఆ పరిషత్‌లో ఆత్రేయ రచించిన, ఆయన అధ్వర్యంలో ప్రదర్శించిన "ఈనాడు" (వెంకటగిరిదళం) ఫస్టు ప్రయిజ్ సంపాయించింది. ఆ రచనతోనే ఆత్రేయ గారిని మద్రాసు సినీ ప్రపంచం ఆహ్వానించింది.

ప్రభుత్వ నిర్బంధ విధానంతో ప్రజానాట్యమండలి కార్యకలాపాలు మూల బడ్డాయి. ఆ రోజులలోనే-

ప్రజానాట్యమండలి అనుభవంతోనే ఆంధ్ర ఆర్టు థియేటరు (హనుమంతరాయ గ్రంథాలయం) స్థాపించి లక్ష్మీనరసయ్య, మిక్కిలినేని మరికొందరు)? అధ్వర్యంలో "గాలిమేడలు" "మా వూరు" (అనిసెట్టి రచన) ఆడడం జరిగింది. అందులో వి. మధుసూధనరావు, సరోజిని, లక్ష్మీనరసయ్య, లక్ష్మణరావు, మిక్కిలినేని (మరి కొందరు) నటించడం, కొన్ని ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది.

అలాగే "ఇన్స్‌పెక్టర్ కాల్స్" కు అనువాదం కొప్పరపు సుబ్బారావు గారు రచించిన "ఇనపతెరలు" పాటలు లేని నాటకం కేవలం డైలాగ్స్, ఏడుగురు ఆర్టిస్టులతో ఒకే రంగంగా ఆడిన నాటకం, "ఇనపతెరలు" ఆర్టిస్టులు - డి. వి. నరసరాజు, పులిపాక రామచంద్ర, కాస్యప, మాచినేని వెంకటేశ్వరరావు, వెంపటి రాధాకృష్ణ, వెంకటగిరి జమిందారు, శ్రీ పార్ధసారథి, కొప్పరపు సరోజని, వి. సరోజని.

బెంజమిన్ మొలైసే సంస్మరణ

ఆశ నిరాశల స్వేచ్ఛాస్వప్నం దక్షిణాఫ్రికా ప్రజాపోరాటం

— పృథ్వి

(ఈ డిసెంబర్ ఒకటవతేదికి భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరి తీసి దశాబ్దం పూర్తయింది. ఉరిశిక్షను రద్దుచేయాలని మరోసారి నినదిస్తూ, ఇటీవల దక్షిణాఫ్రికాలో ఉరితీయబడ్డ కవి బెంజమిన్ మొలైసే సంస్మరణలో ఈ వ్యాసం

—సాహితీ మిత్రులు)

తప్పని పరిస్థితులు

బతుకు తెరువు కోసం మద్రాసు వలసవెళ్ళిన నటీనటులు, రచయితలు, పార్టీ పిలుపు ఇచ్చినపుడు వచ్చి ఎన్నికల్లో పాల్గొంటూ వారి వంతు కర్తవ్యాన్ని (సానుభూతి పరులుగా) నిర్వర్తించారు. అల్లూరి సీతారామరాజు కథ వి. సరోజిని, శ్రీమతి శకుంతల ('52, 57 గుర్తులేదు) చెప్పడం జరిగింది. ఆత్రేయ రచించిన "అంత్యార్పణ"లో జి. వరలక్ష్మి, ఆత్రేయ, వి. మధుసూదనరావు, సరోజిని, నటించడం జరిగింది.

అలాగే "పోతుగడ్డ" మద్రాసు ప్రజానాట్యమండలి పేరుతో అక్కడకు చేరిన సుంకర, వాసిరెడ్డి రచన చేస్తే కోసూరు అచ్చయ్యగారి డైరక్షన్‌లో వల్లంనరసింహారావు, మోహన్‌దాస్, అచ్చయ్య, కుటుంబరావు, పెరుమాళ్ళు, వి. సరోజిని (మరికొందరు) నటించి ఆంధ్రలో ఎన్నో ప్రదర్శనలిచ్చారు.

ఆ రోజులలోనే "భూతాలం, భూతాలం" అనే నృత్యనాటిక (ఆసిసెట్టి రచన) కూడా గిడుతూరు సూర్యం వగైరాలు నటించి, కొన్ని ప్రదర్శనలిచ్చారు.

వీరమాచనేని
సరోజిని

"విలపించు, ప్రేమైక మాతృభూమీ, విలపించు మా భయానికి వారసుడయ్యే ఇంకా జన్మించని శిశువుకోసం విలపించు అతను నేలతల్లిని గాఢంగా ప్రేమించకుండా చూడు. అతని వేళ్ళ సందుల నుంచి నీళ్ళు ప్రవహించేటప్పుడు అతణ్ణి ఆనందంగా కేరింతలు కొట్టనివ్వకు పడమట వాలుతున్న సూర్యుడు పచ్చిక మైదానాన్ని మంటలతో ఎరుపెక్కించేటప్పుడు అతణ్ణి మౌనంగా నిలబడనివ్వకు ఈ నేల మీద పక్షులు కిలకిలారావాలు చేసేటప్పుడు అతణ్ణి లోలోతుల్నించి స్పందించనివ్వకు అతని హృదయాన్ని ఓ పర్వతానికో లోయకో సమర్పించనివ్వకు అతనలా చేస్తే అతణ్ణి భయం అశక్తుణ్ణి చేస్తుంది."

(ఎలన్ పాటన్, క్రై ది బిలవెడ్ కంట్రీ, 1948)

దక్షిణాఫ్రికా నవలా రచయిత ఎలన్ పాటన్ తన దేశాన్ని ఉద్దేశించి ఈ విషాద ఉద్వేగ ఆకాంక్ష ప్రకటించేనాటికి ఆ శిశువు ఇంకా జన్మించలేదు. అతను వారసత్వం వహించవలసిన భయం మాత్రం తరతరాలుగా, శతాబ్దాలుగా పేరుకుపోయి ఉంది. కాని ఆ శిశువు ఆ తర్వాత కొన్నేళ్ళకే జన్మించి తన నేలతల్లిని గాఢంగా ప్రేమించాడు. అశక్తుడయ్యేందుకు కాదు, ఉరికంబం మీద స్వేచ్ఛాగీతం ఆలపించ గలంత శక్తివంతుడయ్యేందుకు అతను తన ప్రజలనూ ప్రకృతినీ ప్రేమించాడు. తరతరాల భయానికి కాదు, తరతరాలుగా ఎడతెగని పోరాటానికి, స్వేచ్ఛా ఆకాంక్షకు అతను వారసుడయ్యాడు. నిజానికి అతణ్ణి ఆ వారసత్వం నుంచీ, ఆ పోరాట చరిత్ర నుంచీ విడదీసి చూస్తే అతడేమీ అర్థంకాడు. బహుశా కేవలం మలిసెల బెంజమిన్ మొలైసే అనే పేరు మాత్రం మనకు తెలుస్తుంది. కాని మొలైసే మొలైసే మాత్రమే కాదు. అంతకన్న ఎక్కువగా అతను ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ కార్యకర్త, ఉంకొంటో విసిజ్వె యోధుడు, ప్రపంచాధిపత్యాన్ని కాలదన్ని శ్వేత జాత్యహంకార ప్రభుత్వం నిస్సిగ్గుగా ఉరి తీసిన మనిషి. అతణ్ణి అర్థం చేసుకోవాలంటే దక్షిణాఫ్రికాను అర్థం చేసుకోవాలి.

చీకటి ఖండంగా పేరుబడ్డ ఆఫ్రికాలో దక్షిణపుకొమ్మున ఉన్న దేశం దక్షిణాఫ్రికా మనకు పరిచయమైన వాస్కోడిగామా చుట్టివచ్చిన కేప్‌ఆఫ్ గుడ్‌హోప్ ఈ దక్షిణాఫ్రికాలోదే. ఇప్పుడు దక్షిణాఫ్రికా అట్లాంటిక్, హిందు మహాసముద్రాలు,

మొజాంబిక్, స్వాజిలాండ్, రొడీషియా, బోటోస్వానా, నమీబియాలను సరిహద్దులుగా కలిగి ఉంది. దేశం మధ్యలో 30 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో లెసోథో అనే చిన్నదేశం కూడ ఉంది. దక్షిణాఫ్రికా వైశాల్యం 12 లక్షల 21 వేల చ.కి.మీ. రాజధాని ప్రెటోరియా జనాభా మూడు కోట్ల నాలుగులక్షలు (1982) ఇందులో నల్లవాళ్ళు 59% తెల్లవాళ్ళు 12%. ఆసియన్లు 3% మిగిలిన వాళ్ళు మిశ్రమ వర్గాల వాళ్ళు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ట్రాన్స్‌వాల్, ఆరెంజ్ ఫ్రీస్టేట్, కేప్, నేటల్ అనే నాలుగు రాష్ట్రాలు, ట్రాన్స్‌కీ, బోపుతాట్స్వానా, వెండా, సిస్కీ అనే నాలుగు బంటూ స్వయం పాలిత ప్రాంతాలూ ఉన్నాయి.

తొలి రోజుల్లో ఈ ప్రాంతంలో బుష్‌మెన్, హాటెన్‌టాట్ తెగలకు చెందిన ప్రజలు మాత్రమే ఉండేవారు. 10వ శతాబ్ది నాటికి ఉత్తర దిశ నుంచి బంటూ భాషాతెగలకు చెందిన ప్రజలు క్రమక్రమంగా ఈ ప్రాంతమంతటా వ్యాపించారు. వీరి సంతతికే చెందిన జూలూ, బసుటో, క్షోసా, పోడో, ట్స్వానా, ఉత్తరసోథో, దక్షిణసోథో, షాంగాన్, త్సోంగా, వెండా తదితర తెగలకు చెందిన ప్రజలు ఇప్పుడీ ప్రాంతంలో ఉన్నారు.

1652లో డచ్ ఈస్టిండియా కంపెనీ కేప్‌టౌన్‌లో స్థావరాన్ని ఏర్పరచుకుంది. క్రమక్రమంగా బోయర్లు అని పిలవబడే డచ్ వ్యవసాయదారుల బృందాలు ఇక్కడికి వలస రావడం మొదలైంది. ఇక కేప్ ప్రాంతంలో తమ ప్రాబల్యం పెంచుకోవడానికి బోయర్లు ప్రయత్నాలు మొదలెట్టారు. తమ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు బంటూలు ప్రాణాలకు తెగించి దచ్చివాళ్ళతో పోరాటాలు చేశారు. ఈలోగా పంతొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల్లో బ్రిటిష్ వాళ్ళు కేప్ కాలనీలో ప్రవేశించి బోయర్లను అక్కడి నుంచి తరిమేశారు. బోయర్లు మరింత ఉత్తరానికి జరిగి ఆరెంజ్, వాల్ నదీ తీరాల ప్రజలను తరిమేసి ఆరెంజ్ ఫ్రీస్టేట్, ట్రాన్స్‌వాల్ రిపబ్లిక్‌లను ఏర్పరచుకున్నారు. బ్రిటిష్ వాళ్ళు 1840ల్లో నేటల్ ప్రాంతాన్ని ఆక్రమించుకుని అక్కడ చెరుకు పండించడం మొదలెట్టారు, ఈ చెరుకు తోటల్లో పనిచేసేందుకు వాళ్ళు భారతదేశం నుంచి రైతులను, కూలీలను తోలుకుపోయారు, ఇలా బలవంతాన వలస తీసుకుపోబడ్డ భారతీయులు 1900 వచ్చేనాటికి దక్షిణాఫ్రికాలో తెల్లవాళ్ళకన్న జనసంఖ్యలో మించి

పోయారు. బ్రిటిష్ ప్రోత్సాహంతో వలస వచ్చేవారి సంఖ్య పెరిగిపోయి బ్రిటన్ కన్ను డచ్చి రాష్ట్రాల మీద కూడ పడింది. ఈ లోగానే ఆ రెండు రాష్ట్రాలలోనూ బంగారం, వజ్రాలు నిక్షేపాలున్నట్టు వెల్లడైంది. ఇక ఆ రాష్ట్రాల మీద ఆధిపత్యం కోసం 1881 లో, 1899-1902 ల్లో బోయర్లకు, బ్రిటిష్ వాళ్ళకు మధ్య యుద్ధాలు జరిగాయి. బోయర్ యుద్ధాలుగా పేరుపొందిన ఈ యుద్ధాల్లో డచ్చివాళ్ళు ఓడిపోయి దక్షిణాఫ్రికా అంతా బ్రిటిష్ వాళ్ళ చేతుల్లోకి వచ్చింది. 1910లో బ్రిటిష్ వాళ్ళు నాలుగు రాష్ట్రాలనూ కలిపి యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా పేరుతో దేశాన్ని ఏర్పరిచారు.

ఇలా **తమ** భూమిమీద అధికారం కోసం ఒక వైపు డచ్చివాళ్ళు, మరోవైపు బ్రిటిష్ వాళ్ళు పోట్లాడుకుంటుండగా ఆఫ్రికన్లు ఆ ఇద్దరితోనూ ఎన్నో పోరాటాలకు సిద్ధపడ్డారు. దాదాపు పద్దెనిమిదో శతాబ్దం మధ్యభాగం నుంచి డచ్చివాళ్ళ మీదా, తర్వాత బ్రిటిష్ వాళ్ళ మీదా వాళ్ళు యుద్ధం చేస్తూనేవచ్చారు. కాఫర్ యుద్ధాలుగా పిలవబడే ఈ యుద్ధాలలో ఒక దాంట్లో **మ**కానా అనే షోసా యోధుడు, తెగనాయకుడు ఎనిమిదివేలమంది సైన్యంతో డచ్చివాళ్ళ గ్రాహమ్స్ టౌన్ మీద దాడి చేశాడు. డచ్చిసైన్యం **మ**కానా ఓడించింది, షోసాల గూడారాలు తగుల బెట్టింది. ప్రజల్ని ఊచకోతకోసింది. మకానాను సైనికులకు ప్రవాస శిక్ష విధిస్తానని బెదిరించింది. ఐనా ప్రజలు **మ**కానా వెనుక దృఢంగా నిలబడి యుద్ధం కొనసాగించారు. చివరికి 1819 ఆగస్టులో తాను పట్టుబడితే ప్రజల మీద అణచివేత ఆగిపోతుందనే అమాయకత్వంతో మకానా లొంగిపోయాడు. కాని మకానాను డచ్చిపాలకులు జీవిత శిక్ష వేసి రాబెన్ ద్వీపానికి పంపారు. ఇలాంటి మరొక కాఫర్ యుద్ధంలోనే 1857లో బెంబులు తమ భూమి మీద అధికారం కోల్పోయారు. 1877లో పోండోలు ఓడిపోయారు. ఈ కాలం లోనే బ్రిటిష్ వాళ్ళకు జూలూలకు భీకర ఘర్షణలు చెలరేగి చిట్టచివరికి జూలూల భూభాగాన్ని ఇంగ్లీషువాళ్ళు 1881లో ఆక్రమించుకున్నారు.

యూరోపియన్ల ఆధునిక యుద్ధ సాధనాల ముందు ఓడిపోయిన ఆఫ్రికన్లు 1880ల్లో రాజకీయంగా సంఘటితం కావడం మొదలుపెట్టారు. 1880 దశకం తొలి రోజుల్లో తూర్పుకేప్‌లో మొట్టమొదటి ఆఫ్రికన్ రాజకీయ సంస్థ ఇంబుంబా యమ

ఆఫ్రికా (ఆఫ్రికన్ల సంఘం) ఏర్పడింది. ఈలోగా డచ్చివాళ్ళు తమనుతాము ఆఫ్రికా నెర్లమని పిలుచుకుంటూ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పక్షీకరణ పొందడం మొదలెట్టి ఆఫ్రికాండర్ బాండ్ అనే రాజకీయ పార్టీని ప్రారంభించారు.

1901లో రెండో బోయర్ యుద్ధం తర్వాత బోయర్లకు, ఇంగ్లీషు వాళ్ళకు మధ్య కుదిరిన ఒప్పందాన్ని బ్రిటిషర్లు బుట్ట దాఖలు చేశారు. ఇది ప్రత్యక్షంగా ఆఫ్రికానెర్ జాతీయ వాదాన్ని, పరోక్షంగా దేశవ్యాప్త సంచలనాన్ని సృష్టించింది. "నాగరిక క్రిస్టియన్" ఆఫ్రికన్లు పూర్టిన్ లుటులి నాయకత్వాన నేటల్ నేటివ్ కాంగ్రెస్‌ను ఏర్పరచుకున్నారు. 1894లో గాంధీ నేటల్‌లో ఇండియన్ కాంగ్రెస్ స్థాపించాడు. కేప్‌లో మిశ్రమవర్గాల ప్రజలు ఆఫ్రికన్ పీపుల్స్ ఆర్గనైజేషన్ ఏర్పరచుకున్నారు. 190[illegible] నాటికి ట్రాన్స్‌వాల్‌లో నేటివ్ కాంగ్రెస్ ఏర్పడింది. డచ్చివాళ్ళు 250 ఏళ్ళకింద ఏర్పరచిన పాస్ నిబంధనలు తొలగించాలని అది బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మరోవైపు బంబాటా అనే నాయకుని ఆధ్వర్యంలో జూలూలు మరొక తిరుగుబాటు జరిపారు.

బ్రిటిష్ ప్రభుత్వం బోయర్ల మిలాఖత్తుతో శ్వేతజాతి మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పరచి దేశాధికారం కట్టబెట్టబోతున్నదని 1909 నాటికి స్పష్టమైంది. ఆఫ్రికన్ల రాజకీయ సంస్థలన్నీ ఈ ప్రయత్నానికి వ్యతిరేకంగా గొంతెత్తాయి. రెవరెండ్ వాల్టర్ రుబుసానా, జాన్ టెంగో, జబావు, రెవరెండ్ జాన్ డుబెల నాయకత్వాన నిరసన చెలరేగింది. మిశ్రమవర్గాల ప్రజలు కూడ అసమ్మతి ప్రకటించారు. కాని బ్రిటిష్ ప్రభుత్వం యూనియన్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. రాజ్యాంగాన్ని ప్రకటించింది. ఆ రాజ్యాంగం నల్లవాళ్ళమీద తెల్లవాళ్ళకు అపరిమిత అధికారాల్ని ధారాదత్తం చేసింది.

1910లో మొట్టమొదటి దక్షిణాఫ్రికా మంత్రివర్గం ఏర్పడింది. లూయీబోథా ప్రధానమంత్రిగా, జాన్ స్మట్స్ ఉపప్రధానిగా, జెబిఎం హెర్ట్‌జోగ్ మరొక సభ్యుడుగా అది ఏర్పాటయింది. ఈ ప్రభుత్వం చేసిన మొదటి పని ఆఫ్రికన్లను కొన్ని రకాల ఉద్యోగాలను నిషేధించి తక్కువ వేతనా శ్రమకే పరిమితం చేయడం. తర్వాత కొద్ది కాలానికే ఆఫ్రికన్ శ్రామికులు కదు[illegible]ంచినా, [illegible] రంగా పరిగణించే శాసనం వచ్చింది.

డేవిడ్ డియోప్ అనే ఆఫ్రికన్ కవి "అమరవీరుడు" అనే కవితలో రాసినట్టు

తెల్లవాడు మా నాన్నను చంపేశాడు
మా నాన్న ఆత్మగౌరవం చూపేవాడు
తెల్లవాడు మా అమ్మను చెరిచాడు
మా అమ్మ అందంగా ఉండేది
పట్టపగటి వెలుగులో తెల్లవాడు
మా అన్నను తగులబెట్టాడు
మా అన్న దృఢంగా ఉండేవాడు
నల్ల రక్తంతో ఎర్రబడ్డ చేతులతో
తెల్లవాడు నా వేపు తిరిగి విజేత గొంతుతో
'ఒరేయ్, ఓ కుర్చీ, రుమాలూ, పానీయం తీసుకురా' అన్నాడు

అలా యూరోపియన్ల ఉక్కుపాదం కింద ఆఫ్రికన్లందరూ, ముఖ్యంగా దక్షిణాఫ్రికా బంటూలు, మకానాలుగా రూపొందగల శక్తివంతులైన యువకులందరూ వంట మనుషులుగా, గనుల్లో కార్మికులుగా, తోటమాలీలుగా, సఫాయిలుగా మార్చబడ్డారు.

శ్రమలో, ఆర్థిక జీవనంలో సృష్టించబడ్డ అంతరాలు సాంఘిక జీవనంలో అంతరాన్ని, వివక్షతను, అణచివేతను పెంచి, పోషించి, బలోపేతం చేశాయి. ఆఫ్రికన్లు పేవ్‌మెంట్ల మీద నడవ గూడదు. తెల్లవాళ్ళు ఎదురయినప్పుడు టోపీ తీసి పట్టుకోవాలి. రైళ్ళలో జంతువుల్ని రవాణా చేసే పెట్టెల్లాంటి నాలుగోతరగతి పెట్టెల్లో ప్రయాణించాలి. దుర్భరమైన పన్నులు కట్టేందుకైనా అసహ్యకరమైన, కష్టతరమైన, తక్కువ స్థాయి పనులెన్నో చేసి సంపాదించాలి. అడిగినప్పుడల్లా పోలీసులకు తమపాసులు, పన్నుల రశీదులు చూపాలి. ఏ కాగితం దొరక్కపోయినా పోలీసులు వాళ్ళను అరెస్టు చేయవచ్చు. తెల్లవాడి కోర్టు వాళ్ళ మాట వినదు, విన్నానమ్మదు. రాజకీయంగా వాళ్ళకు ప్రాతినిధ్యమూలేదు, వాళ్ళదైన గళమూలేదు. వాళ్ళ పిల్లలకు ఉన్నత విద్యలో ప్రవేశం లేదు.

ఈ భయంకరమైన వివక్షత పిక్స్‌లీ కా ఇజాకాసెమె అనే ఆఫ్రికన్ న్యాయ వాదిలో సంచలనం రేపింది. అతను మిషనరీల సాయంతో అమెరికాలో, ఇంగ్లండ్‌లో

చదువుకోగలిగిన నూటయాభైమంది యువ "నేటివ్"లలో ఒకడు ప్రపంచాన్ని చూసివచ్చిన సెమె తనదేశంలో తన ప్రజలపై సాగుతున్న క్రూరమైన దాడిని ఎదిరించడానికి నిశ్చయించుకున్నాడు. తనలాగే ఆలోచించే మరో ముగ్గురు ఆఫ్రికన్ న్యాయవాదులతో చర్చించి 1912 జనవరి 8న దక్షిణాఫ్రికాలోని అన్ని తెగల నాయకులతో. ప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. అన్ని తెగలూ తమలో తమ విభేదాలను విస్మరించి ఆఫ్రికన్ జాతీయ సంఘంలో సంఘటితమై వలసపాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపిచ్చాడు. అట్లా ఏర్పడింది ఇప్పటి ఎఎన్‌సికి తొలి రూపమైన దక్షిణాఫ్రికా నేటివ్ నేషనల్ కాంగ్రెస్ (ఎస్ఎన్‌సి).

ఆఫ్రికన్స్ తమ కాంగ్రెస్‌ను ఏర్పరచుకున్న రెండు సంవత్సరాలకు ఆఫ్రికానేర్‌ల మంత్రివర్గం నుంచి తొలగించబడ్డ జనరల్ హెర్‌జోగ్ నాయకత్వంలో నేషనల్ పార్టీని ఏర్పరచుకున్నారు.

ఎస్ ఎన్ సి స్థాపన తర్వాత సెమె తూర్పుట్రాన్స్‌వాల్‌లో నాలుగు వ్యవసాయ క్షేత్రాలు కొని ఆఫ్రికన్‌లకు ఆధునిక వ్యవసాయం నేర్పాలని తలపెట్టాడు. దక్షిణాఫ్రికా కూడ వ్యవసాయదేశమే. అక్కడ కూడ ప్రధాన సమస్య భూమి సమస్యే. అప్పటిదాకా యూరోపియన్లకు ఆఫ్రికన్లకు జరిగిన ఘర్షణలన్నిటిపునాది భూమి సమస్యే. ఆ భూమి అప్పటికి రాజకీయాధికారంలో ఉన్న యూరపియన్ల చేతుల్లోనే ఉంది. కాని సెమె ప్రయోగం ఫలించి ఆఫ్రికన్‌లు వ్యవసాయ క్షేత్రాల్ని విస్తరించుకోవడం మొదలుపెడితే జరిగే పరిణామాల గురించి పాలకులు భయపడ్డారు. అప్పుడు నేటివ్ లాండ్ బిల్ తీసుకువచ్చారు. అది పదిలక్షల మంది ఉన్న తెల్లవాళ్ళకు 90 శాతం భూమిని కట్టబెట్టింది. నలభై లక్షల ఆఫ్రికన్లకు 7.3 శాతం భూమిని పరిమితం చేసింది. ఈ భూమి కూడ నాసిరకం దేనని చెప్పనవసరంలేదు. పైగా అది ఎప్పుడూ దుర్భిక్షానికి గురవుతూ ఉండే భూమి కూడా. అట్లాగే ఈ బిల్లే తెల్లవాళ్ళ భూముల నల్లవాళ్ళు ఉండడం నేరంగా ప్రకటించింది. అలా ఉండే నల్లవాళ్ళని బలవంతాన తొలగించాలని ఆదేశించింది. అప్పటికి దాదాపు పదిలక్షల మంది ఆఫ్రికన్లు తెల్లదొరలకు కూలీలుగా పాలేర్లుగా తమ కుటుంబాలతో ఆ క్షేత్రాలమీద జీవిస్తున్నారు.

ఈ భయంకరమైన బిల్లును అమలు పరచవద్దని కోరుతూ ఎస్ ఎన్ సి గవర్నర్ జనరల్‌కు విజ్ఞప్తి చేసింది. కాని బ్రిటిష్ చక్రవర్తి తరపున గవర్నర్

జనరల్ లార్డ్ గ్లాడ్‌స్టోన్ సంతకంచేయగా 1913 జూన్ 20 నుంచి ఆఫ్రికన్లు తాము పుట్టిన నేలమీదనే పరాయివాళ్ళయి పోయారు.

ఈ లోగా అనుమతి పత్రాల నిబంధనలు మరింత కఠినతరమై పోయాయి, ప్రతినెలా ఒక షిల్లింగు విలువగల కొత్త పాస్ కొనుక్కోవాలనే నిబంధనలో ఎక్కువలో ఎక్కువ నెలకు రెండు పౌండ్ల జీతం మాత్రమే సంపాదించే మహిళలు, తీవ్రంగా ఆందోళనపడ్డారు. విన్నపాలు, చర్చలు విఫలమయి పోయాక 1913 జూలై లో బ్లూమ్ ఫోంటీన్‌లో 600 మంది మహిళలు మునిసిపల్ కార్యాలయానికి తరలివెళ్ళి డిప్యూటీ మేయర్ ముందర తమ అనుమతి పత్రాల బస్తాలు విసిరేసి మళ్ళీ తామింక అనుమతి పత్రాలు కొనబోమని హెచ్చరించారు.

నిజానికి అప్పటికి దేశంలో రగులుతున్న అసంతృప్తికి ఈ మహిళల ర్యా ఒక వ్యక్తీకరణ మాత్రమే. అన్ని తెగల ప్రజలూ తెల్లవాళ్ళకూ, వాళ్ళ చట్టాలకూ వ్యతిరేకంగా తిరగబడడానికి సిద్ధంగా ఉన్నారు. కాని అప్పటి ఎస్ ఎన్ సి నాయకత్వానికి ఇంకా బ్రిటిష్ పాలకుల స్వేచ్ఛా ప్రియత్వం మీద, విజ్ఞప్తులు సాధించే ఫలితాలు మీద నమ్మకంపోలేదు. అందుకే 1914లో యుద్ధం రాగానే కాంగ్రెస్ తన దేశ ప్రజల కోర్కెలకు కాస్త విరామం ఇచ్చి ప్రభుత్వానికి అన్నిరకాల సహాయం అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం ఈ పిలవని పేరంటాన్ని అనుమానంగా చూసింది. యుద్ధంలో విచ్ఛిన్న కరపాత్ర నిర్వహించడానికే ఆఫ్రికన్లు ఈ సహాయాన్ని ప్రకటిస్తున్నారేమోననే అనుమానాన్ని వెల్లడించింది కూడా. ఆఫ్రికన్లకు ఎక్కువలో ఎక్కువ నౌకర్ల ఉద్యోగాలు తప్ప సైనికోద్యోగాలు దొరకనే లేదు.

యుద్ధం ముగిసే నాటికి అటు జనరల్ స్మట్స్ ప్రపంచ నాయకుల్లో ఒకడయ్యాడు. ఇటు కాంగ్రెస్ నాయకత్వంలో విభేదాలు పెరిగిపోయాయి. నిధులు తరిగిపోయాయి, పత్రిక పడుతూలేస్తూ సాగవలసి వచ్చింది. మొత్తానికి యుద్ధం కాంగ్రెస్‌ను దాదాపు చివరిదశకు తెచ్చినట్టనిపించింది.

యుద్ధం తర్వాతి దశలో మారిన ఆర్థిక పరిస్థితులలో ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారు. అప్పటి వరకు దొరికిన మితవాద సంస్కరణ వాద నాయకత్వ

మయినా అప్పుడు నాయకత్వం ఇచ్చేంత శక్తివంతంగాగానీ, ఆసక్తితోగానీ లేకపోయింది.

ఏ నాయకత్వమూ లేకుండానే జోహాన్స్‌బర్గ్ పారిశుధ్య కార్మికులు 1918లో రోజుకూలీ ఆరుపెన్నీలు పెరగాలని సమ్మె మొదలుపెట్టారు. దక్షిణాఫ్రికాలో శ్రామికులు జరిపిన మొట్టమొదటి సమ్మె అది. 152 మంది కార్మికులను అరెస్టుచేసి ప్రభుత్వం ఆ సమ్మెను అణచివేసింది. ఇంతలో బ్లూమ్ ఫోంటీన్‌లో మరొక సమ్మె మొదలైంది. ప్రభుత్వం అక్కడ సైనిక శాసనం విధించింది. ఇలా నాయకుల కోసం ఎదురు చూడకుండా ప్రజలు తమంతతాము తమ సమస్యల పరిష్కారాల కోసం పోరాటాలకు సిద్ధపడుతున్న సమయాన క్రమక్రమంగా కాంగ్రెస్‌కు వేడిపుట్టింది. డానియేల్ లెటాంకా నాయకత్వాన కాంగ్రెసు ప్రజా ప్రదర్శనకు సారథ్యం వహించడం మొదలు పెట్టింది. 1919 మార్చ్, ఏప్రిల్‌లో జోహాన్సుబర్గ్‌లో కాంగ్రెసు నాయకత్వాన వేలాది మంది ఆఫ్రికన్‌లు తమ అనుమతి పత్రాలు వాపసుచేశారు. ఈ అనుమతి పత్రాలు తిప్పికొట్టే సత్యాగ్రహ ఉద్యమం దేశమంతా వ్యాపించింది. వందలాదిమంది అరెస్టులకు సిద్ధపడ్డారు. ఈ ఉద్యమాల ఫలితంగా కాంగ్రెసు మహిళా విభాగం కూడ ఏర్పడింది. 1920లో విట్‌వాటర్‌స్రాండ్‌లో సమ్మెకు తలపడ్డ నలభై వేలమంది గని కార్మికులను సంఘటితం చేసే కార్యాచరణ రంగంలోకి కాంగ్రెసు దిగింది. 1922 నాటికి అది ప్రభుత్వంలో అవిశ్వాసాన్ని ప్రకటించింది. బ్రిటిష్ ప్రభుత్వంలో కూడ విశ్వాసం ఉంచనవసరం లేదని తీర్మానించే స్థాయికి ఎదిగింది.

ఐతే కాంగ్రెస ఆ కాలంలో ఆఫ్రికన్ ప్రతిష్ఠ గురించి, ఆఫ్రికన్ సాంఘిక, నైతిక జీవితంపై వలస పాలకుల దాడి గురించి, ఆందోళన పడ్డంతగా దారిద్ర్యాన్ని, జీవన ప్రమాణాన్ని పట్టించుకోలేదు.

ఆ పనిని దక్షిణాఫ్రికాలో తొలికమ్యూనిస్టులు చేశారు. కమ్యూనిస్టు కాని క్లైమెంట్స్ కడాలీ 1919లో కేప్‌టౌన్‌లో ఏర్పరచిన ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ వర్కర్స్ యూనియన్ (ఏసియు) లో కమ్యూనిస్టులు పనిచేశారు. ఆ సంఘం మొదట 24 మంది సభ్యులతో ఓడరేవు కార్మికుల సంఘంగా ప్రారంభమైనా, 1925 నాటికి జోహాన్సుబర్గ్ కేంద్రంగా దేశ వ్యాపిత సంస్థగా విస్తరించింది. అసంఖ్యాకంగా సమ్మెను

నిర్వహించింది. ఆఫ్రికన్ కార్మికులకు కనీస వేతనాలు నిర్ణ   ాలని మొదటిసారిగా డిమాండ్ చేసింది. కడాలీ తన సాహసంతో ఆఫ్రికన్లను, ప్రభుత్వాన్ని ఆశ్చర్య పరిచాడు. నేటల్‌లోకి వెళ్ళడానికి ప్రభుత్వం తనను అనుమతించకపోయినా, అసలు అనుమతి పత్రాల నిబంధనలనే ధిక్కరిస్తూ అక్కడికి వెళ్ళి ఎనిమిదివేలమంది ఐసియు సభ్యుల సమావేశంలో పాల్గొని క్షేమంగా తిరిగివచ్చాడు. ఆయన ప్రయత్నాలతో 1926 నాటికి ఐసియు యాభై వేలమంది సభ్యులుగల సంస్థగా రూపుదాల్చింది. 1928 నాటికి రెండులక్షలమంది సభ్యులుగల సంస్థగా బ..పడిన ఐసియు కడాలీ అధిపత్య ధోరణితో, అంతర్గత విభేధాలతో 1930 నాటికి విచ్ఛిన్నమై పోయింది.

హెర్‌జోగ్ ప్రభుత్వం 1926లో వర్గ పరిమితి బిల్లును, గనుల పరిశ్రమల సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. పాత మాస్టర్స్ అండ్ సర్వెంట్స్ ఆక్ట్‌ను విస్తరించింది. 1927లో నేటివ్ అడ్మినిస్ట్రేషన్ ఆక్ట్‌తో తెగల నాయకుల హక్కుల్ని హరించింది. గిరిజన ప్రాంతాలలో సభలపై పరిమితులు విధించింది.

ఈ సమయంలో కాంగ్రెస నిష్క్రియాశూన్యత అట్లాగే కొనసాగింది. చివరికి 1925లో ఎట్టకేలకు దాన్ని పునర్నిర్మించడానికీ, బలోపేతం చెయ్యడానికే ప్రయత్నాలు జరిగాయి. పేరును సౌత్ ఆఫ్రికన్ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎ ఎన్ సి) గా మార్చారు. ఒక జెండా, ఒక గీతం రూపొందించుకున్నారు. మారుతున్న పరిస్థితులలో ఎ ఎన్ సి కొత్త నాయకుల్ని సమకూర్చుకుంది. పరిస్థితులు ఆదేశిస్తున్న కర్తవ్యాలకు, నాయకత్వపు సంకోచాలకు మధ్య సాగిన ఘర్షణలో ఎ ఎన్ సి క్రమక్రమంగా కార్యాచరణవేపు, వామపక్షభావాలవేపు అడుగులు వేయడం మొదలుపెట్టింది. 1927లో ఎ ఎన్ సి అధ్యక్షుడు బెల్జియంలో కమ్యూనిస్టులు ఏర్పాటు చేసిన సామ్రాజ్యవాద వ్యతిరేక లీగ్ సమావేశానికి హాజరయ్యాడు. అక్కడి నుంచి ఆహ్వానంపై రష్యా పర్యటించాడు, కమ్యూనిస్టుల మీద ఇతరేతరంగా ఎన్ని అపనమ్మకాలున్నా వాళ్ళొక్కరినే హెర్‌జోగ్, ఆఫ్రికన్ పార్టీ, ఇంగ్లీషు పత్రికలు, గనుల యజమానులు వ్యతిరేకిస్తున్నందువల్ల, వాళ్ళొక్కరే ఆఫ్రికన్ ప్రజల డిమాండ్లను నిర్ద్వంద్వంగా సమర్థిస్తున్నందువల్ల, ఎఎన్‌సిలో ప్రగతిశీల శక్తులకు కమ్యూనిస్టులకు సాన్నిహిత్యం బలపడింది. ఐతే అప్పటికయినా ఎ ఎన్ సి పూర్తిగా నల్లజాతి ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించే ప్రజా సంస్థగా మారిందా అనేది అనుమానమే, అప్పటికీ అది ప్రధానంగా మర్యాదస్తుల

సంఘమే. దాని సమావేశాల్ని మేయరో, బిషప్పో, చీఫ్ మెజిస్ట్రేటో, పోలీసు సూపరింటెండెంటో ప్రారంభించేవాడు.

అప్పుడే రయటీస్ అసెంబ్లీస్ అమెండ్‌మెంట్ బిల్ అని ఒక కొత్త నల్లచట్టం వచ్చింది. ఒక ప్రత్యేక జిల్లాలో ఏ వ్యక్తి ఉనికి అయినా శాంతికి భంగకరమని న్యాయశాఖమంత్రి భావిస్తే ఆ వ్యక్తిని ఆ జిల్లా నుంచి బహిష్కరించగల అధికారాన్ని ఈ చట్టం కట్టబెట్టింది. ఈ చట్టానికి దేశవ్యాప్తంగా నిరసన పెల్లుబికింది 30ల తొలి రోజుల్లో పశ్చిమ కేప్‌లో ఎ ఎన్ సి సమావేశాలన్నిటినీ ప్రభుత్వం నిషేధించింది. ఈ నిషేధం ఎ ఎన్ సి ప్రభావాన్ని ఏ మాత్రం తగ్గించలేక పోయిందని గుర్తించగానే ప్రభుత్వం ఎ ఎన్ సి నాయకులను, సాను భూతి పరులను ఆయా ప్రాంతాల నుంచి నిషేధించింది. ఈ దశాబ్దంలో దేశం మొత్తం మీద ఏటా సలభై వేలమంది నల్లవాళ్ళు అనుమతి పత్రాల నిబంధనలకింద నిర్బంధించబడేవారు.

30ల ఆర్థిక సంక్షోభం ఆఫ్రికాకు కేవలం ఆకటిదశాబ్దం మాత్రమే కాదు, అవకాశాలు తగ్గిపోయి, నిర్బంధం పెరిగిపోయి కొనసాగిన భయంకరమైన ఆకటి దశాబ్దం. తెల్ల కార్మికులు కాఫర్లపనుల్లోకి జొరబడి కాఫర్లను వీధుల్లోకి తరిమేశారు. కొనసాగిన సంక్షోభం ఆఫ్రికన్ల జీవితాన్ని మరింత అల్లకల్లోలం చేసింది. ఆకటి దశాబ్దపు స్మట్స్ ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా తొక్కివేసే రక్తదాహాన్ని ప్రదర్శించింది. మరోవైపు ఎ ఎన్ సిలో అంతర్గత విభేదాలతో, ప్రగతిశీల శక్తులకు ఇతర కర్తవ్యాలతో మొత్తానికి దేశంలో వామపక్ష శక్తులూ, భావాలూ, వెల్లువా తగ్గిపోయాయి. అభివృద్ధి నిరోధక శక్తులది పై చెయ్యి అయింది, కొత్తగా నియమించబడ్డ రక్షణ మంత్రి పేరో హిట్లర్‌కు సన్నిహితుడయ్యాడు. గ్రేషర్ట్స్, బ్లాక్ షర్ట్స్ వంటి దురహంకార సంస్థలు తలెత్తి తీవ్రమైన జాతి విద్వేషం రగిలింది,

ఈ లోగా హెర్‌జోగ్, స్మట్స్‌ల మధ్య మళ్ళీ మిలాఖత్తు కుదిరి యునైటెడ్ పార్టీ అంటూ ఒకటి ఏర్పడి అధికార పీఠంలో వచ్చిన గందరగోళాల్ని తప్పించుకుంది ఐసియు నామ రూపాలు లేకుండా పోయింది. కమ్యూనిస్టు కార్యకలాపాలు ఆగి పోయాయి, ఎ ఎన్ సి పత్రిక ఆగిపోవాల్సి వచ్చింది. సెమె ఆధిపత్యధోరణి వల్ల సంస్థ విచ్ఛిన్నం కావడం మొదలైంది. అలాంటి స్థితిలో హెర్‌జోగ్ నేటివ్ బి

ఇకముందు వోటర్లుగా నమోదు చేయించుకోవడానికి వీలులేకుండా చేసే చట్టం తేతం పెట్టాడు. ఈ చట్టంతో అప్పటికే పరిమితంగా ఉన్న నల్లజాతి ప్రాతినిధ్యం మరింతగా కుంచించుకుపోతుంది. తెగల నాయకులతో ఏర్పడిన ఒక వోటర్ల బృందం పరోక్షంగా నలుగురు తెల్లజాతి సెనెటర్లను ఎన్నుకోవాలనే నియమంవచ్చింది. పూర్తిగా సలహా వ్యవస్థ స్థాయి మాత్రమే ఉండే ఒక నేటివ్ ప్రాతినిధ్య కౌన్సిల్ (ఎన్ ఆర్ సి) ఏర్పాటయింది, ఈ ఎన్ ఆర్ సిలో తెగల పెద్దలు, ప్రభుత్వాధికారులు, నేటివ్‌లు ఉంటారు. కేప్ రాష్ట్రంలో నల్లవాళ్ళు తమకు ప్రత్యేకించబడ్డ రిజర్వ్‌ల బైట భూమి కొనుక్కోవడం నిషేధించబడింది. కాని అలా వాళ్ళకు ప్రత్యేకించబడ్డ భూమి మొత్తంలో 13 శాతం మాత్రమే.

చరిత్ర ఒక మజిలీకి, ఒక మూలమలుపుకు చేరి ఇక కొత్త పద్ధతిలో నిర్మాణం కాక తప్పని దశకు వచ్చినప్పుడు తప్పనిసరిగా ప్రజలు, వాళ్ళ ఆశలు ఆకాంక్షలు వ్యక్తీకరించేపోరాటం, వాళ్ళు నిర్మించే చరిత్ర కొత్తదారిని వెదుక్కుంటాయి. తన మీద బలవంతాన రుద్దబడ్డ ప్రతిష్టంభనను చరిత్ర నిర్మాణం తోసిరాజంటుంది. అవిచ్ఛిన్నంగా పురోగమిస్తుంది. ఎ ఎన్ సి చరిత్రలో కొన్ని దశాబ్దాల్లో ఈ భౌతిక చరిత్ర నిర్మాణ నియమం రుజువైంది. అటు పాలకుల నుంచో ఇటు నాయకుల నుంచో ఎ ఎన్ సి దారి బలవంతాన మూలమలుపుకు కొనిపోబడ్డప్పుడల్లా ఒక ఆకస్మిక గంతుతో ఎ ఎన్ సి చరిత్ర నిర్మాణం మలుపు తిరిగింది.

ఎ ఎన్ సి చరిత్రలోని ఎన్నో అలాంటి మలుపుల్లో 1935 ఒకటి ఆ సంవత్సరం బ్లూమ్ ఫోంటీన్‌లో అఖిల ఆఫ్రికన్ సమ్మేళనం జరిగింది. రాజకీయ, సాంఘిక, మత, ఆధిపత్య, నాయకత్వ ప్రయోజనాలవంటి విభిన్నవిస్తృత ప్రయోజనాలతో విభేదాలున్న వాళ్ళందరూ ఒకే వేదిక మీద కలుసుకున్నారు. ఆఫ్రికన్లకు, చర్చివాళ్ళకు, ట్రేడ్‌యూనియనిస్టులకు, వివిధ సంస్థల ప్రతినిధులకు, ప్రముఖ లిబరల్‌లకు ఒక ఐక్యతకుదిరింది. నేటివ్ వోటర్ల విషయంలో ప్రభుత్వం చెయ్యబోతున్న నిర్ణయాలను వ్యతిరేకించడానికి, ప్రభుత్వంతో ఆ విషయమై చర్చించడానికి ఒక ప్రతినిధి బృందం వెళ్ళింది. మొత్తానికి హెర్‌జోగ్ తన ప్రయత్నాన్ని కొద్దిగా మార్చుకోక తప్పలేదు.

అయితే మళ్ళీ అంతలోనే ఎన్ ఆర్ సిలో చేరాలా లేదా, పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొనా లేదా అనే సమస్యలపై ఆఫ్రికన్లలో తీవ్రమైన విభేదాలు తలెత్తాయి. ఎ ఎన్ సిలో వామపక్షం మాత్రమే క్రియాశీల నినాదాలు, కార్యక్రమాలు ముందుకు తేవడం మొదలు పెట్టింది. "ఎన్ ఆర్ సి వెనుక, పార్లమెంటరీ ప్రతినిధుల వెనుక దృఢంగా నిలబడడమే ఇవాల్టి కర్తవ్యం" అని నాయకత్వం ప్రకటించింది. నిజానికి ఎన్ ఆర్ సి తీర్మానాలకు ప్రభుత్వం ఏ మాత్రం విలువ ఇవ్వదు. నల్లవాళ్ళ ఎంపీలు పార్లమెంటులో ఏం మాట్లాడినా వోటింగ్ దగ్గరికొచ్చేసరికి వాళ్ళు చెయ్యగలిగిందేమీ ఉండేది కాదు.

మళ్ళీ యుద్ధం వచ్చింది. హెర్ట్‌జోగ్‌ను తోసేసి స్మట్స్ ప్రధాని అయ్యాడు. అప్పుడే ఎ ఎన్ సి కి డాక్టర్ ఆల్‌ఫ్రెడ్ బిటిని షుమా అనే కొత్త అధ్యక్షుడు వచ్చాడు. ఆయన దీక్షగా ఎ ఎన్ సిని పునర్నిర్మించడం మొదలెట్టాడు. పాత ప్రణాళికను తీసేసి, మరింత ప్రజాస్వామికంగానూ, రాజకీయ పార్టీకి తగినట్టుగానూ ఉండే కొత్త ప్రణాళిక రాశాడు.

యుద్ధ సమయంలో ఆఫ్రికన్ల మీద అణచివేత విషయంలో ప్రభుత్వం దాగుడుమూతలాడింది. ఇంగ్లండ్ విజయాలకూ, జర్మనీ విజయాలకూ మధ్య ఆఫ్రికన్ ప్రజల మీద తన పట్టు సడలకుండా, ప్రపంచ యుద్ధ వ్యూహంలో తన కాలు పట్టు దప్పకుండా స్మట్స్ అనేక ఎత్తులు వన్నాడు. కొంతకాలం అనుమతి పత్రాల నిబంధనలు సడలించబడ్డాయి. అట్లాంటిక్ ఛార్టర్ ఆఫ్రికన్లకు కూడ వర్తిస్తుందనే హామీవచ్చింది. మారుతున్న రాజకీయార్థిక వాతావరణంలో నిర్బంధం సడలింపు మరింత క్రూరమైన అణచివేతనే అనివార్యంగా దారి తీసింది.

ఆ మారుతున్న రాజకీయార్థిక వాతావరణమే యువ ఆఫ్రికన్లలో జాతీయవాదాన్ని కొత్త కోణం నుంచి రేకెత్తించింది. జాతీయవాదం ఒక సెంటిమెంటు కాదనీ, వలస పాలకులకు వ్యతిరేక కార్యాచరణ అనీ, అది రంగు భేదపు తెల్లవాని మీద పోరాటం కాదనీ, తన నేలమీద తన మీద, తన ఆర్థిక, సాంఘిక, రాజకీయ, మత వ్యవస్థల మీద ఉక్కుపాదం మోపిన పాలకవర్గం మీద పీడితవర్గ పోరాటమనీ యువతరం గుర్తించింది, ఆ గుర్తింపు వ్యక్తీకరణ పొందడం మొదలెట్టింది. అంటన్

ముజువాకె లెంబెడె, ఆలివర్ టాంబో అనే న్యాయవాదులుగా మారిన ఉపాధ్యాయుడు లీడరు అధ్యక్ష కార్యదర్శులుగా యూత్‌లీగ్ ప్రారంభమైంది. ఎ ఎన్ సి లో భాగంగానే నిర్మాణమైన ఈ యూత్‌లీగ్ ఆఫ్రికన్ రాజకీయాలలో సమరశీల కార్యాచరణలో పెద్ద ముందడుగు వేసింది. యూత్‌లీగ్ కాంగ్రెస్‌కు కొత్త చూపునూ, కొత్త శక్తినీ ఇవ్వ తలపెట్టింది. ఆఫ్రికన్ జాతీయ వాదపు ఆర్థిక పునాది సోషలిజమని అది ప్రకటించింది. సోషలిజం "మన పూర్వీకుల నుంచి మన కందిన విలువైన వారసత్వం" అని అది గుర్తించింది. పాత ఆఫ్రికన్ సమాజంలో సాంప్రదాయికంగా మనుషులను వాళ్ళ ఆస్తిని బట్టిగాక సమాన స్థాయిలో పాల్గొన నిచ్చే ఖోట్లాల వంటి గిరిజన సభల వారసత్వంగా ప్రజాస్వామ్యాన్ని అది స్వీకరించింది.

యూత్‌లీగ్ ప్రణాళిక ఎ ఎన్ సి పాత విధానాలన్నిపైనా దాడి చేసింది. ఎ ఎన్ సి తనను తాను "శుభ్రమైన చేతుల పెద్ద మనుషుల సంఘం"గా భావించుకొని అణచివేతకు లొంగిపోయిందనీ, ఇక ఇప్పుడు యూత్‌లీగ్ ఆఫ్రికన్ జాతీయవాదపు "మేధస్సంపదగానూ, శక్తి వనరు" గానూ నిలిచి ఎ ఎన్ సిని పునస్సంఘటితం చేసి, స్వేచ్ఛా సమరానికి శక్తినీ మార్గాన్నీ పటుత్వాన్నీ ఇవ్వాలని అది ప్రకటించింది.

దేశంలోని భూమినంతా అన్ని జాతుల రైతులకు వారి జనాభా నిష్పత్తిని పంచాలని, రైతులకు ప్రణాళికాబద్ధ అభివృద్ధినీ, శాస్త్రీయ పద్ధతులనూ నేర్పి పూర్తి స్థాయి పారిశ్రామికీకరణ సాధించి, సకల శ్రామికుల జీవన ప్రమాణాన్ని పెంచాలనీ అన్ని రంగాలలోనూ వర్ణ వివక్షతను రద్దు చేయాలని యూత్‌లీగ్ లక్ష్య ప్రకటన చేసింది.

దక్షిణాఫ్రికాలో యుద్ధం రేకెత్తించిన పరిస్థితులు పెద్దఎత్తున ప్రజాస్వామ్యంతో తిరుగుబాటుల వెల్లువలకు పురికొల్పాయి. ఐతే ఈ వెల్లువలకు ఎ ఎన్ సి గాని, యూత్‌లీగ్‌గాని, ఎ ఎన్ సి గాని కాక ఆయా పరిస్థితులు సృష్టించిన నాయకులు మౌలిక మానవ అవసరాల ఆకాంక్షలకు స్పందిస్తూ ఎదిగి వచ్చి సారథ్యం వహించారు. జోహాన్స్‌బర్గ్, అలెగ్జాండ్రా నగరాలలో ప్రజలు వేల సంఖ్యలో పాలకవర్గ నియమాల్ని ధిక్కరిస్తూ ఉద్యమించారు.

యుద్ధం, యుద్ధానంతర పరిస్థితులు ప్రపంచాన్ని దక్షిణాఫ్రికాకు, దక్షిణాఫ్రికాను ప్రపంచానికి మరింత సన్నిహితం చేశాయి. ఎ ఎన సి నాయకత్వపు ఆలోచనా ధోరణుల్లో గణనీయమైన ప్రభావాలు కనబడడం మొదలైంది.

1946లో దక్షిణాఫ్రికా భారతీయులు ప్రారంభించిన పాస్‌ల వ్యతిరేక సత్యాగ్రహ ఆందోళనకు ఎ ఎన్ సి తన మద్దతునిచ్చింది. అప్పటికి చెదురు మదురుగా భారతీయులకూ ఆఫ్రికన్‌లకూ మధ్య ఒక స్థాయిలో సాగుతూ వచ్చిన సంఘీభావం బలపడింది.

1946 ఆగస్టులో యాభై వేలమంది గని కార్మికులు సమ్మె ప్రారంభించారు. దక్షిణాఫ్రికా చరిత్రలో అది కనీవినీ ఎరగని సమ్మె ప్రభుత్వం దారుణ దమనకాండను అమలు చేసింది. బలవంతాన గనుల్లోకి దించబడ్డ కార్మికులు లోపల కూచుని పనిమానేశారు. ప్రదర్శన జరుపుతున్న కార్మికుల మీద పోలీసులు విరుచుకు పడి ఆరుగురుని ? చంపేశారు. ఈ ఘటన తర్వాత సమావేశమైన ఎన్ ఆర్ సి ప్రభుత్వ ప్రతినిధులను ధిక్కరించి ఈ ఘటనను చర్చించింది. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఈ హత్యలు చేసిందని ఆఫ్రికన్లు ప్రకటించారు.

“మీ ఇష్టం వచ్చింది చేసుకోండి మీరు మమ్మల్ని కాల్చెయ్యవచ్చు నిర్బంధించొచ్చు, కాని మీరు మా దీక్షను సడలించలేరు” అని ఎన్ ఆర్ సి తన అభిప్రాయాన్ని స్పష్టంగా ప్రకటించింది. 36 ఏళ్ళపాటు విన్నపాలతో గడిపిన ఎ ఎన్ సి ఓపిక చివరికి బద్దలైంది. “మీరు అక్కడ కూచుని చర్చిస్తారు. తీర్మానాలు చేస్తారు గొంతులెండిపోయేదాకా మాట్లాడతారు. మీ మాటలే ఆగిపోతాయి గాని ఫలితమేమీ ఉండదు. ఇది దురదృష్టం, కేవలం అమాయక మూర్ఖత్వం” అని గుర్తించి, “ప్రభుత్వం ఫాసిస్టు విధానాన్ని కొనసాగిస్తున్నదనీ అది అట్లాంటిక్ ఛార్టర్‌నూ, ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌నూ తుంగలో తొక్కుతున్నదనీ ఎన్ ఆర్ సి ప్రకటించింది. ఇక ప్రభుత్వానికే, ఎన్ ఆర్ సికీ ఘర్షణ మొదలైంది.

గనుల్లో సమ్మె ఇంకా కొనసాగుతూనే ఉంది. పోలీసుల కళ్ళుగప్పి చాకలి మూటలో, కిరాణా సామాన్లల్లో, చొక్కాపట్టీలకట్టల్లో కరపత్రాలు పంచబడుతూనే ఉన్నాయి. అవి గనికార్మికులకు ధైర్య సాహసాలందజేస్తూనే ఉన్నాయి. కాని మళ్ళీ సమరశీలంగా ఉన్న ట్రేడ్ యూనియనిస్టుల అరెస్టుతో, ట్రేడ్ యూనియనిస్టులకూ, ఎ ఎన్ సికీ మధ్య వచ్చిన విభేదాలతో సమ్మె విఫలమై పోయింది.

ఈ లోగా దక్షిణాఫ్రికా సమస్య ఐక్యరాజ్యసమితిలో తలెత్తడం మొదలైంది. ఎన్ ఆర్ సితో వచ్చిన విభేదాన్ని తొలగించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఇలా ఒక వైపు వర్గవివక్షతకు వ్యతిరేక సూచనలు కనబడుతుండగానే మళ్ళీ పారిశ్రామిక ఒప్పందాల (జాతీయ ల) చట్టం ఒకటి వచ్చింది. అదిగనుల్లో, వ్యవసాయంలో, గృహసేవల రంగంలో ట్రేడ్ యూనియన్లను నిషేధించింది. ఆఫ్రికన్లు యూనియన్లు పెట్టుకోవడం శిక్షార్హమైన నేరమైంది. సమ్మెలు నిషిద్ధమయ్యాయి. ఎన్ ఆర్ సి లో రాజీ ప్రయత్నాలలో కూడ ప్రభుత్వం కుట్ర చేసి, ఎన్ ఆర్ సిలో తన తైనాతీలను చేర్చుకునేందుకు దాని సభ్యత్వాన్ని 12 నుంచి 50కి పెంచింది. ఎన్ ఆర్ సి ఈ ప్రతిపాదనను తిరస్కరించింది.

1948 ఎన్నికల్లో డాక్టర్ మాలన్ నాయకత్వాన వర్గవివక్షతను తన సిద్ధాంతంగా ప్రకటించే నేషనల్ పార్టీ గెలిచింది. ఎ ఎన్ సికీ, ఎ ఎసికీ మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. ఎ ఎన్ సి జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాటానికి పిలుపిచ్చింది.

నేషనల్ పార్టీ పాలకులు తామిక ప్రజాప్రతిఘటనను ఎదుర్కోక తప్పదని గుర్తించారు. ప్రజా అసంతృప్తిని పక్కదారి పట్టించే ప్రయత్నాలు మొదలైనవే ఆఫ్రికన్లకూ ఆసియన్లకూ మధ్య, ముఖ్యంగా ఆఫ్రికన్లకూ భారతీయులకూ మధ్య మొదలైన ఘర్షణలు 1948 జనవరి 13న దర్బన్‌లో భారతీయులకు ఆఫ్రికన్లకు భయంకరమైన ఘర్షణలు జరిగాయి. సైన్యం, పోలీసులు దర్బన్ మీద దాడి చేశారు. మొత్తం మీద 50 మంది భారతీయులు, 86 మంది ఆఫ్రికన్లు, ఐదుగురు ఇతరులు చనిపోయారు. ఎ ఎన్ సి నాయకుడు మూమా మాటల్లో "ఒక సంవత్సరం నేషనలిస్టు పాలన తర్వాత దక్షిణాఫ్రికా జాతీయ ఆత్మహత్యవేపు, జాతుల మధ్య ఘర్షణల వేపు వెళ్ళే మార్గాన్ని చేపట్టింది.

ఆ సమయంలో పోరాటమే తక్షణ కర్తవ్యమని యూత్‌లీగ్ అభిప్రాయపడింది. ఎంతోకాలంగా ఎ ఎన్ సి ఒక మేధావుల బాతాఖానీ క్లబ్బయిపోయి ఏటేటా బ్రహ్మాండమైన తీర్మానాలు చేయడం, మరుసటి సంవత్సరం ఆ తీర్మానాలు ఎంతవరకు అమలయ్యాయో చూసుకోవడం సాగిస్తూ, తాము జాతీయ వ్యవహారాలు చర్చిస్తున్నామనే సంతృప్తిపొందుతూ, ఒక సాంఘిక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తమలో తామే

మారిపోతూ వచ్చిందని యూత్‌లీగ్ ప్రకటించింది. ఈ పరిస్థితిని, ఈ సాంప్రదాయాన్ని ఇకనెంత మాత్రమూ కొనసాగనివ్వదలిచేదని యూత్‌లీగ్ ప్రకటించింది. యూత్‌లీగ్ మద్దతు ఇచ్చిన జేమ్స్ మొరాకా ఎ ఎన్ సి అధ్యక్షుడయ్యాడు. మితవాదులు యూత్‌లీగ్ నాయకులు, కమ్యూనిస్టులు కలగలిసిన కొత్త కార్యవర్గం కార్యాచరణ ప్రణాళికను బలంగా అమలు చేయతలపెట్టింది. 1936 చట్టం కింద జరిగే ఎన్నికలన్నిటినీ బహిష్కరించాలని, ఆఫ్రికన్ల ఆకాంక్షలను వాస్తవం చేసే సమ్మెలు, శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ కొనసాగించాలని కార్యాచరణ కార్యక్రమం ప్రకటించబడింది.

ఈ కార్యాచరణలో భాగంగా మే ఒకటో తేదీన ఒక రోజు పనిమానేయాలని ఎ ఎన్ సి పిలుపిచ్చింది. దేశంలో పలుచోట్ల ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసే పనికి కమ్యూనిస్టుపార్టీ చురుకుగా పూనుకుంది. కమ్యూనిస్టు మీద దురభిప్రాయాలతో, అనుమానాలతో యూత్‌లీగ్ ఈ పిలుపుకు మద్దతును ఉపసంహరించుకుంది. ఐనా, యూత్‌లీగ్ వ్యతిరేకతను, ప్రదర్శనలపై సభలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని, జోహాన్స్‌బర్గ్ ప్రాంతంలో రెండువేల మంది పోలీసుల దాడిని అధిగమించి వేలాది ఆఫ్రికన్ కార్మికులలో సగం మంది పని మానేశారు. ప్రదర్శకుల మీద కాల్పులు సాగాయి. పద్దెనిమిది మంది కార్మికులు చనిపోయారు.

అప్పటిదాకా కష్టసాధ్యమైన రాజీని విషాదం సాధించింది. యూత్‌లీగ్, కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడిగా ఒక సంస్మరణ, నిరసన ప్రదర్శన నిర్వహించాయి. వేర్వేరు ప్రజాసమూహాలను విడదీసేందుకు ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలు నిజానికి ప్రజలను మరింతగా కలిపాయి. జాతి నుంచి జాతిని, తెగనుంచి తెగను వేరుచేయడానికి వచ్చిన గ్రూప్ ఏరియాస్ ఆక్ట్ ప్రత్యేకంగా భారతీయులను దెబ్బతీసింది. పాపులేషన్ రిజిస్ట్రేషన్ ఆక్ట్ మిశ్రమ వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. అయితే అన్నిటికన్న ఎక్కువగా కమ్యూనిజం అణచివేతబిల్ (సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం బిల్) వచ్చింది. అది అప్పటికి దేశంలో ఉన్న రెండువేలమంది కమ్యూనిస్టుల మీద కన్న ఎక్కువగా స్వేచ్ఛా పోరాటాన్ని అణచివేయడానికి ఉద్దేశించబడిందని యూత్‌లీగ్, ఇండియన్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ సమన్వయం

కుదుర్చుకుని, జూన్ 26న జాతీయ సమ్మెను జరపాలని దేశచరిత్రలో మొదటిసారిగా ఒక సంయుక్త పిలుపు ఇచ్చాయి. జూన్ 26 సమ్మె జయప్రదంగా జరిగింది.

1950 జూలై తొలిరోజుల్లో కమ్యూనిజం అణచివేత బిల్ పార్లమెంటులో ప్రవేశపెట్టబడి, సమావేశాల చివరిరోజున చట్టమైపోయింది. ఆ చట్టం కమ్యూనిస్టు పార్టీని చట్టవ్యతిరేకంగా ప్రకటించింది. దేశంలో సాంఘిక. రాజకీయ, ఆర్థిక మార్పులు తేదలచుకున్న ఎవరినైనా కమ్యూనిస్టు అని నిర్వచించింది. న్యాయశాఖామంత్రి ఎవరినైనా కమ్యూనిస్టుగా గుర్తించి వారిని సంస్థల నుంచి, సమావేశాల నుంచి, ప్రాంతాల నుంచి నిషేధించవచ్చును. ఈ నిషిద్ధ సంస్థ ప్రయోజనాల్ని రక్షించేందుకు పనిచేశారని తెలిస్తే 10 సంవత్సరాలు జైలుశిక్ష విధించవచ్చు. ఒకవైపు కమ్యూనిస్టుల పేరుతో ప్రజాఉద్యమం మీద ఈ దాడి మొదలెట్టిన ప్రభుత్వం చివరికి 1951లో ఎన్ ఆర్ సిని కూడ రద్దుచేసింది.

1951 నుంచి ప్రభుత్వం ప్రజలస్వేచ్ఛపై ఒకదాని వెనుక ఒకటిగా అత్యాచారాలు చేయడం ముమ్మరం చేసింది. సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం అక్టును వెనుకటి నుంచి వర్తించే లాగ సవరించింది. ట్రేడ్ యూనియనిసులపై దాడి చేసింది. పాస్ పోర్టులు రద్దు చేసింది. గిరిజన జీవితాన్ని వక్రీకరిస్తూ బంటూ పాలక ప్రాంతాలేర్పరచింది. రంగు ప్రజలను వోటర్ల జాబితా నుంచి తొలగించే ఉద్దేశ్యంతో రాజ్యాంగంలో అధికరణాలు మార్చే పనికి పూనుకుంది.

1952 ఏప్రిల్ 6న దక్షిణాఫ్రికాలో తెల్లవాడి పాలనకు 300 ఏళ్ళు నిండిన సందర్భంగా అప్పటికి అమలవుతున్న నల్లచట్టాలలో ప్రత్యేకంగా క్రూరమైన ఆరు చట్టాలను రద్దు చేయకపోతే దేశవాప్త సత్యాగ్రహం ప్రారంభిస్తానని ఎ ఎ సి ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది.

ఏప్రిల్ 6న దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి. ఎ ఎన్ సి కొత్తగా శాసనోల్లంఘన కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పదివేలమంది వలంటీర్లు కావాలని పిలుపిచ్చింది. నెల్సన్ మాండెలా జాతీయ వలంటేర్-ఇన్-చీఫ్‌గా నియమించ బడ్డాడు. శాసనోల్లంఘన కార్యక్రమాన్ని జూన్ 26న ప్రారంభించాలని నిర్ణయం జరిగింది.

శాసనోల్లంఘనోద్యమప్రచారంలో భాగంగా మే 31న జరిగిన ఒక సభలో ప్రొఫెసర్ మాథ్యూస "స్వేచ్ఛకోసం పోరాటం విహారం కాదు. అది ఒక బాధాకరమైన క్రమం అఘర్షణలో బాధా ఉంటుంది. మరకణం కూడ ఉండవచ్చు" అని స్పష్టంచేశాడు. "దక్షిణాఫ్రికాలో అణగారిన ప్రజలకు స్వేచ్ఛ సాధించాలనే మా ఆశయాన్ని నెరవేర్చుకునేందుకు మేం మా నైతిక, శారీరక, ఆర్థిక శక్తులన్నీ ధార పోస్తామని మేం ప్రగాఢంగా ప్రతిజ్ఞ చేస్తున్నాం"- అని మొరోకా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాడు. "మేం డచ్చివాళ్ళను గానీ, ఇంగ్లీషు వాళ్ళను గానీ ద్వేషించడంలేదు. కాని మేం ఏ దారుణ దమనకాండ కింద బతకక తప్పండంలేదో ఆ చట్టాలను ద్వేషిస్తున్నాం" అని స్పష్టం చేశాడు.

ప్రభుత్వం 500 మంది ప్రజలను సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం చట్టం కింద నిషేధించింది. ఐనా జూన్ 26న శాసనోల్లంఘన మొదలైంది. మాయిబుయె అఫ్రికా (ఆఫ్రికా, వెనక్కి తిరిగిరా) అని నినాదాలిస్తూ, "మేం ఆఫ్రికన్ ప్రజలం, మేమేం చేశాం" అని పాటలు పాడుతూ జనం వేలాదిగా ధిక్కరణ కార్యక్రమంలో పాలు పంచుకోవడం మొదలెట్టారు. రైల్వే స్టేషన్లలో, పోస్టాఫీసుల్లో యూరపియన్లకు మాత్రమే అని ఉన్న భాగాల్లోకి వెళ్ళి చట్టాల్ని ధిక్కరించి అరెస్టయ్యారు.

జూలైలో 1500 కన్న ఎక్కువ మంది స్త్రీ పురుషులు శాసనోల్లంఘనలో అరెస్టయి జైళ్ళకు వెళ్ళారు. ఆగష్టులో 2000 మంది వలంటీర్లు అరెస్టు అయ్యారు. సెప్టెంబర్‌లో 2358 మంది అరెస్టయ్యారు. వలంటీర్లు, శాసనోల్లంఘనోద్యమం కొత్త సంస్కృతిని, పాటల్ని, నినాదాల్ని సృష్టించాయి. ఆఫ్రికన్ల జానపదగీతాలు చాల తరచుగా జైళ్ళలో కొత్తగా అల్లబడి, ప్రచార కార్యక్రమంలో భాగమయ్యాయి, ఆ పాటల లయ, అభినయం, ఉద్వేగభరితంగా, ప్రేరణాత్మకంగా ఉండేది.

అక్టోబర్‌లో దక్షిణాఫ్రికాపై ఐక్యరాజ్యసమితి దృష్టిని మళ్ళించేందుకు, తీవ్రతరం చేసేందుకు ప్రచార కార్యక్రమం శ్రద్ధతీసుకుంది. విస్తృతంగా సాగిన ప్రచార కార్యక్రమం ఫలితంగా, కొద్ది నెలల కింద 7,000 ఉన్న ఎ ఎన్ సి సభ్యత్వం లక్షకు చేరింది.

అదే సమయంలో పార్లమెంటులో నల్లవాళ్ళకు ప్రాతినిధ్యం వహించే నలుగురు ఎంపిలతో, మేధావులతో, ఇతర ఉదారవాదులతో, బిషప్ అంబ్రోస్ రీవ్స్‌తో సహా ఎందరో నల్లవాళ్ళ పక్షం తీసుకున్నారు. ప్రభుత్వం మళ్ళీ వెనకటి కేప్ కాలనీ ఉదారవాద విధానాన్ని అవలంబించాలని వాళ్ళు కోరారు.

ఎన్ని నిర్బంధాలెదురైనా శాసనోల్లంఘన ముందుకే సాగింది. కార్యకర్తలను కొరడా దెబ్బలు కొట్టినా, నిర్బంధం పాలుజేసినా, అంతకంతకూ ఎక్కువగా శాసనోల్లంఘన కొనసాగింది. అక్టోబర్‌లో 2254 మంది జైలుకెళ్ళారు. వర్ణవివక్షతకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసింది.

డిసెంబర్ మొదట్లో 280 మంది జైలు కేళ్ళారు. డిసెంబర్ 2న మొరొకా, సిసులు, మాండెలా తదితరులను సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం ఆక్ట్ కింద విచారించడం మొదలెట్టారు. విచారణ జరిగిన ఆరవైమందికీ తొమ్మిదినెలల కఠినశ్రమతో కూడిన శిక్ష పడింది. ఈ తీర్పులతో కలగలిపి ప్రభుత్వం 52 మంది నాయకులను నిషేధించింది. అంతే ఆయా నాయకులు తమతమ సంస్థల కార్యకలాపాలలో ఇంకెంత మాత్రమూ పాలుపంచుకోవడానికి వీలులేదు ఉల్లంఘిస్తే పది సంవత్సరాల జైలుశిక్ష పడుతుంది. దీనికి తోడు నెల్సన్ మాండెలాను రెండేళ్ళపాటు జోహాన్స్‌బర్గ్ జిల్లా వదిలి వెళ్ళగూడదని ఆదేశించారు. అట్లాగే మిగిలిన నాయకులకూ స్థల పరిమితులు, కాల పరిమితులూ విధించారు.

ఈ నిర్బంధకాండ తర్వాత ప్రభుత్వం స్వేచ్ఛ గురించీ, ఆఫ్రికన్ల అభివృద్ధి గురించీ మరింత ఎక్కువగా మాట్లాడ్డం మొదలెట్టింది. బంటూ విద్య పేరిట ప్రజల్ని బలవంతాన వాళ్ళ స్థలాల నుంచి కొత్త స్థలాలలోకి మార్చే ప్రయత్నం ప్రభుత్వం చెయ్యబోతున్నదని స్పష్టమైంది. ఎ ఎన్ సి ఈలోపు అల్బర్ లుతులి నాయకత్వం కింది కొచ్చింది.

ప్రభుత్వం, ప్రజా భద్రతా చట్టాన్ని, క్రిమినల్ లా సవరణ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ఈ చట్టాల ద్వారా ఎదైనా ప్రత్యేక ప్రాంతం ప్రమాదంలో ఉందని ప్రభుత్వానికి తోచినప్పుడు ప్రభుత్వం ఆ ప్రాంతంలో తన ఇష్టం వచ్చిన చట్టాలను తాత్కాలికంగా రద్దు చేయవచ్చును. చట్టాన్ని ఉల్లంఘించడం శిక్షార్హమైన నేరంగా

ప్రకటించవచ్చును. శాసనోల్లంఘనకు ఆర్థిక సాయంచేసేవారికి కూడ శిక్షలు విధించవచ్చును. ఈ కొత్త శాసనాలు శాసనోల్లంఘనోద్యమాన్ని చివరిదశకు తెచ్చాయి. ఐతే శాసనోల్లంఘనోద్యమం నిజానికి విజయవంతంగా జరిగింది. వచ్చిన పదివేల మంది వాలంటీర్లలో 8, 500 మంది జైలుకు స్వచ్ఛందంగావెళ్ళారు. ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. ప్రచార సాధనాల దుష్ప్రచారాన్ని తట్టుకుని నిలచారు. దక్షిణాఫ్రికా పాలకుల వర్ణవివక్ష విధానాన్ని ఐక్యరాజ్యసమితి చర్చించక తప్పని స్థితివచ్చింది.

1953లో ఎ ఎన్ సి అన్ని జాతులకు, అన్ని తెగలకు, దేశంలోని అన్ని ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రజలతో ఒక జాతీయ మహాసభ జరపాలని నిశ్చయించింది. భవిష్యత్తులో ఏర్పడబోయే ప్రజాస్వామిక దక్షిణాఫ్రికా కోసం స్వేచ్ఛా పత్రాన్ని తయారు చెయ్యడం, తద్వారా ప్రజల్ని నిష్ఫలమైన, ప్రతికూలమైన పోరాటాలలో పాల్గొనే బదులు మన జీవితకాలంలోనే స్వేచ్ఛ సాధించే అనుకూల కార్యక్రమాన్ని ప్రకటించాలని నిశ్చయించింది.

ఈ లోగా జాన్‌స్టన్ స్వెవెలా అనే ఒక కేప్‌టౌన్ నాయకుడు తనమీద సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం చట్టం కింద అమలవుతున్న నిషేధాన్ని చట్టపరమైన లొసుగుల గురించి కోర్టులో ప్రశ్నించగా ఆ నిషేధపు ఉత్తర్వులన్నీ రద్దయిపోయాయి. నాయకులందరూ హఠాత్తుగా విడుదలయి పోయారు. పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు మళ్ళీజరిగాయి.

ఇంతలో ప్రభుత్వం ఆఫ్రికన్లను "అజ్ఞానంలో అల్పత్వంలో" ముంచడానికి బంటూ విద్యను ప్రారంభించింది. ఎ ఎన్ సి ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది.

1954 డిసెంబర్‌లో ఎ ఎన్ సి చొరవలో జరిగిన జాతీయ ప్రజా మహాసభ స్వేచ్ఛా పత్రాన్ని తయారు చేసింది.

ప్రభుత్వం ఇంకా తన అవివేక విధానాలలో ఆగకుండా ముందుకే సాగుతూ పోయింది. 1950 నుంచి ఆఫ్రికన్ స్త్రీలు అనుమతి పత్రాలు లేకుండా తిరగగూడదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్త్రీల నుంచి ఈ కొత్త నిబంధనలకు తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. రిఫరెన్స్ పుస్తకాలను నిరాకరించడం చట్టవ్యతిరేకం కాకపోయినప్పటికీ, వాటిని నాశనం చేయడం చట్టవ్యతిరేకంగా ఉన్న రోజుల్లో వేలాది మంది

స్త్రీలు తమ అనుమతి పత్రాలు తగులబెట్టేశారు. ఈ సందర్భంగా మహిళాప్రదర్శనలలో మొత్తం యాభై వేలమంది మహిళలు పాలుపంచుకున్నారు.

ఈ సమయంలో ప్రభుత్వం 1910లో రాజ్యాంగం ప్రకలకు కల్పించిన రక్షణలన్నిటినీ రద్దు చేసేసింది. 500 మంది స్థానిక నాయకులను ప్రవాసం పంపింది. దేశద్రోహం ఆరోపణపై న్యాయశాఖ 200 మందిని అరెస్టు చేస్తానని బెదిరించింది. ఇక ఎ ఎన్ సి మీద, మొత్తంగా ప్రజా ఉద్యమం మీద ప్రభుత్వం పెద్ద ఎత్తున కోర్టుల చుట్టూ తిప్పి వేధించే, చట్టబద్ధంగా శిక్షలు వేసే ప్రయత్నాలు మొదలెట్టింది. 1956 డిసెంబర్ ఐదు వేకువ జామున దేశవ్యాప్తంగా నగరాల్లో, పల్లెసీమల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రజల్ని కూడగట్టగల నాయకులందరి మీద పోలీసులు విరుచుకు పడ్డారు. ఇక్కడో గిరిజన తెగ నాయకుణ్ణి, అక్కడో ప్రొఫెసర్‌ను, ఇక్కడో డాక్టర్‌ను అక్కడో న్యాయవాదిని, ఎ ఎన్ సి కార్యకర్తను, ట్రేడ్ యూనియన్ కార్యకర్తను క్రైస్తవమత నాయకుణ్ణి, స్త్రీలనూ అందరినీ అరెస్టు చేశారు. అలా అరెస్టు చేసిన 156 మంది మీద ప్రపంచ ప్రసిద్ధమైన ట్రెజన్ ట్రయల్ (దేశద్రోహవిచారణ) మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు జరిపిన ఒక కుట్రలో భాగంగా దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఈ 156 మంది కుట్ర పన్నారని ప్రభుత్వం ఆరోపించింది.

ఈ కేసు దక్షిణాఫ్రికా ఉద్యమ ప్రజా స్వభావాన్ని, విస్తృత ప్రజాపునాదిని అదివరకెన్నడూ లేనంత స్పష్టంగా ముందుకు తెచ్చింది. ఆ ఉద్యమం కేవలం తెలుపు, నలుపు చర్మాల మధ్య వర్ణపోరాటం కాదు తెల్లదొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు, మిశ్రమ వర్గాల వాళ్ళు సాగిస్తున్న వర్గపోరాటమని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. ఈ విచారణకు డిఫెన్స్‌నిధి సేకరణను కూడ అన్నివర్గాల ప్రజలు చేపట్టారు.

డిసెంబర్ 19న విచారణ మొదలైంది. వేలాది మంది ప్రజలు కోర్టు ముందర గుమిగూడారు. పాటలతో, నినాదాలతో తమ నాయకులకు స్వాగతం చెప్పారు, అసంఖ్యాకంగా వచ్చిన ఆ ప్రజలతో పోలీసు అధికారులు గందరగోళ పడ్డారు. ఖైదీల లెక్కతప్పి పోయింది. హడావుడిగా ఖైదీలను వ్యాన్లలోకి తోసి విచారణ

మర్నాటికి వాయిదా వేశారు. మర్నాడు జన సమూహం రెట్టింపయింది. ప్రజల మీద పోలీసులు నిర్విచక్షణగా కాల్పులు జరిపారు. మొత్తానికి విచారణ తొమ్మిది నెలలపాటు సాగింది. ఎక్కడెక్కడినుంచో ఎత్తుకొచ్చిన కాగితాలన్నీ గందరగోళంగా కూర్చి ఎ ఎన్ సి హింసావాదానికీ దేశ ద్రోహానికీ పాల్పడిందనేందుకు నిదర్శనంగా చూప ప్రయత్నించారు. ఎ ఎన్ సి ప్రకటించిన స్వేచ్ఛా పత్రం కమ్యూనిజాన్ని కోరిందని ఆరోపించారు. 1957 సెప్టెంబర్ 11న ప్రాథమిక విచారణ పూర్తయింది. దేశ ద్రోహనేరం కింద ముద్దాయిలను విచారించడానికి తగిన ఆధారాలున్నాయని మెజిస్ట్రేట్ ప్రకటించాడు. ప్రత్యేక విచారణ జరిగేలోగా నిందితులను విడుదల చేశాడు.

ఈ విడుదలతో పాటే జోహాన్స్‌బర్గ్ శివారు నగరాల్లో అల్లర్లు చెలరేగి 40 మంది ఆఫ్రికన్లు చచ్చిపోయారు. యథావిధిగానే ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు తిరస్కరించింది.

ఈ సాపేక్షిక స్వేచ్ఛా సమయంలో ఎ ఎన్ సి గ్రామీణ ప్రాంతాలతో సంబంధం పెట్టుకుంది. వెంటనే 1958 మార్చిలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఎ ఎన్ సి పనిని నిషేధించింది. ఇంతలో హఠాత్తుగా ప్రభుత్వం ఎ ఎన్ సి సీనియర్ నాయకులు లుతులి, టాంబోల మీద, మరి 59 మంది మీద కేసును ఉపసంహరించుకుంది. ఎ ఎన్ సి విభేదాలు, కీచులాటలు పెరిగిపోయాయి. పరిస్థితులను అందుకోలేని దాని అశక్తత పట్ల ప్రజల్లో నిస్పృహ మొదలైంది. 50 ఏళ్ళ చరిత్ర తర్వాత ఎ ఎన్ సి ఒక తీవ్ర ప్రతిష్టంభనకు, స్తబ్దతకు గురైంది. ఈ పరిస్థితిని తన పేరు ప్రతిష్టలతో, తన వ్యక్తిత్వంతో మార్చడానికి లుతులి ప్రయత్నిస్తుండగానే ప్రభుత్వం అన్ని సమావేశాల మీద నిషేధాన్ని ప్రకటించింది. విభేదాలు చర్చించుకునే అవకాశం కూడ లేకుండా పోయింది.

1958 ఆగస్టు 1న ప్రెటోరియంలో విచారణ మళ్ళీ మొదలైంది. 91 మంది నిందితుల మీద సప్రెషన్ ఆఫ్ కమ్యూనిజం చట్టం కింద వేర్వేరు ఆరోపణలు చేయబడ్డాయి. వాళ్ళ పక్షాన వాదించడానికి దక్షిణాఫ్రికాలోని నిపుణులైన న్యాయవాదులందరూ ముందుకొచ్చారు.

1958 సంవత్సరం ఎ ఎన్ సి నాయకులమీద బైటనుంచిఇలాంటి క్రూరమైన నిర్బంధాన్ని తేగా, లోపలి నుంచి లుకలుకలు దాన్ని నిర్వీర్యం చేశాయి. అంతర్జాతీయ వాదాన్ని అవలంబించింది ఎ ఎన్ సి ప్రజల నుంచి దూరమై పోతున్నదని ఆఫ్రికనిస్టులు భావిస్తే, ఆఫ్రికనిజమ్ అభివృద్ధి కర ఆలోచనలను గుర్తించ లేని వెనుకబాటు మన స్తత్వమని, వెనుకబడిన ప్రజల తోకపట్టుకు పోయే మనస్తత్వమని, వెనుకబడిన కమ్యూనిస్టులు భావించారు. లుతులి వ్యక్తిత్వం కూడ ఘర్షణను నివారించలేకపోయింది. సొబుక్వే తన అతివాద ఆఫ్రికనిస్టు పదజాలంతో యువకులను ఆకర్షించి కమ్యూనిజం నుంచి దూరంచేయ ప్రయత్నించాడు.

మేరీ బెన్సన్ రాసినట్టు "ప్రజా ఉద్యమాలలో విభేదాలు, చీలికలు ఎక్కడైనా సహజమే, కాని అవి దక్షిణాఫ్రికాలలో జరిగినంత హానికరంగా మరెక్కడా జరగలేదు. ఈచీలికలతో లాభపడ్డది కేవలం శ్వేతజాతి ఆధిపత్యాన్ని సమర్థించే శక్తులే.

అయినా 1959 ఎ ఎన్ సికి ఆశావహ సంవత్సరంగానే మొదలైంది. అనుమతి పత్రాల నిబంధనలకు వ్యతిరేకంగా మళ్ళీ ఒకసారి పోరాడాలని ఎ ఎన్ సి నిర్ణయించు కుంది. ఇంతలో మరొక 61 మంది నిందితుల మీద దేశద్రోహం కేసు కొట్టివేయ బడింది. అనుమతి ప్రతాల వ్యతిరేక ఉద్యమాన్ని ప్రచారం చేస్తూ లుతులి దేశ వ్యాప్తంగా తిరగడం మొదలెట్టాడు. పెరుగుతున్న ఆయన ప్రభావానికి ప్రభుత్వం భయపడింది. ఒకదాని వెనుక ఒకటిగా ఆయన మీద నిషేధపు ఉత్తర్వులు జారీ చేయడం మొదలెట్టింది. జోహాన్స్‌బర్గ్‌లో ఇళ్ళలో సమావేశాలతో సహా బహిరంగ సభల వరకు అన్నీ నిషేధించబడ్డాయి.

ఈలోగా 1959లో సొబుక్వే నాయకత్వాన ఎఎన్‌సి నుంచి చీలిన ఒక బృందం పాన్ ఆఫ్రికనిస్ట్ కాంగ్రెస్ (పి ఎసి)గా ఏర్పడింది. దక్షిణాఫ్రికా ఆఫ్రికన్లకే అనే నినాదాన్నిచ్చింది. ఎ ఎన్ సి బహుళజాతి ఉదారవాదానికి లొంగిపోయి, దోపిడీదారు లకూ, దోపిడీకి గురవుతున్న ప్రజలకూ స్థానమిచ్చే సంఘంగా మారిపోయిందని, నిజమైన జాతీయ, సోషలిస్టు, ప్రజాస్వామిక ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసిందని పి ఎసి ప్రకటించింది.

59 డిసెంబర్ 16న జరిగిన ఎ ఎన్ సి వార్షికసమావేశం విజయవంతంగా జరిగింది. ఎందరో రైతాంగ స్త్రీలు పాల్గొన్నారు. ఏదో ఒక కార్యాచరణకు దిగకి

తప్పదని సమావేశం నిర్ద్వంద్వంగా అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కనీసం ఐదు లక్షల మంది ఆఫ్రికన్లను శిక్షలపాలు చేస్తున్న అనుమతి పత్రాల నిబంధనలకు వ్యతిరేకంగా పోరాడ వలసిందేనని సమావేశం పిలుపిచ్చింది. 1960 మార్చి 6న పాస్‌ల వ్యతిరేక దినంగా పాటించాలని, మే, జూన్లలో పాసలకు వ్యతిరేకంగా ప్రజా ప్రదర్శనలు జరపాలని నిర్ణయంజరిగింది. తర్వాత వారానికి పి ఎ సి కూడా పాస్ వ్యతిరేక ఆందోళన నిర్ణయం తీసుకుంది. పాస్‌లను వ్యతిరేకించి అరెస్టు కావాలని, జైలుకు వెళ్ళాలని, జైళ్ళను, యజమానులను ఇబ్బందులపాలు చేయాలని, విడుదల చేస్తే మళ్ళీ అరెస్టు కావాలని, అహింసాయుతంగా జరిగే ఈ కార్యక్రమంలో బెయిల్, డిఫెన్స్, జరిమానా మూడింటినీ అంగీకరించవద్దనీ పి ఎ సి కోరింది.

ఒకవైపు పాసుల వ్యతిరేక ఉద్యమంలో ఎ ఎన్ సి ఇతర 14 సంస్థలతో కలిసి ఉద్యమం నడుపుతుండగా, ప్రభుత్వం పట్టణ ప్రాంతాల చట్టంలోని సెక్షన్ 10 ఉపయోగించి ప్రజలమీద విరుచుకు పడడం మొదలెట్టింది. దాని ప్రకారం 15 సంవత్సరాలుగా పట్టణంలో ఉండని, లేదా 10 సంవత్సరాలుగా ఒకే యజమాని దగ్గర పని చేయని ఏ వ్యక్తికైనా పట్టణంలో 72 గంటలకు మించి ఉండే అర్హతలేదు.

మూడు రోజుల్లో తాను పాసుల వ్యతిరేక కార్యక్రమాన్ని ప్రకటించబోతున్నానని, 1963 కల్లా దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందుతుందని, ఆమార్గంలో ఇది తొలిఅడుగనీ మార్చి 18న పి ఎసి ప్రకటించింది. మార్చి 21న పి ఎ సి పిలుపుకు స్పందించి అనేక నగరాల్లో వేలాది మంది ప్రదర్శన మీద కాల్పులు జరిపి 69 మందిని, లాంగా ప్రదర్శన మీద కాల్పులు జరిపి ఇద్దరిని పోలీసులు బలిగొన్నారు.

షార్ప్‌విల్లి లాంగా హత్యాకాండ ప్రపంచవాప్త్యంగా ప్రచారమైంది. వివిధ దేశాల నుంచి నిరసన వ్యక్తమయింది. చీఫ్ లుతులి, ప్రొఫెసర్ మాథ్యూస్ మార్చి 27ను జాతీయ సంస్మరణ దినంగా పాటించాలని పిలుపిచ్చారు. ఆరోజున లుతులి ప్రిటోరియాలో బహిరంగంగా తన పాస్ తగులబెట్టాడు. కొద్దిరోజులకే ప్రభుత్వం పాస్ నిబంధనలను ఉపసంహరించుకుంది, ఉద్యమం విజయం సాధించిందని అనుకునే లోగానే దేశ వ్యాప్తంగా ఎమర్జన్సీ విధించబడింది. పెద్ద ఎత్తున అరెస్టులు సాగాయి. నాయకు

అందరూ నిర్బంధించబడ్డారు. పాస్ నిబంధనలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించవలసిందని ఎ ఎన్ సి మళ్ళీ పిలుపిచ్చింది. ఏప్రిల్ 8న ప్రభుత్వం ఎఎన్‌సిని, పిఎసిని చట్టవ్యతిరేక సంస్థలుగా, ప్రజాభద్రతకు తీవ్ర అవరోధాలుగా ప్రకటించింది.

రెండు సంస్థలతోనూ సుమారంగా సంబంధాలున్నవారితో సహా అందరి మీదా వేట మొదలైంది. అయితే ఎ ఎన్ సి జైళ్ళలో ఉండగానే మళ్ళీ తాను బైట పని చేయవలసిన పద్ధతిని కనిపెట్టుకుంది. అజ్ఞాతంలో పని చెయ్యాలని నిర్ణయించుకుంది. ఎ ఎన్ సి ఆపద్ధర్మ కమిటీ ఒకటి దేశవ్యాప్తంగా సెల్స్‌ను ఏర్పరచింది. అనుమతి పత్రాలకు వ్యతిరేకంగా కరపత్రాలను ప్రచురించింది. పోస్టాఫీసు నేలమీదా, జైలు గోడ మీదా, జోహాన్స్‌బర్గ్‌లో ఉన్నత వర్గాల వీధుల్లో రోడ్లమీదా ఎ ఎన్ సి నినాదాలు రాయబడ్డాయి. ఎ ఎన్ సి ప్రయోజనాలను పరిరక్షించడం శిక్షార్హమైన నేరంగా ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రతిచోటా అపహాస్యం చేయబడింది. చివరికి ప్రభుత్వమే ట్రెజన్ ట్రయల్ నడిపి ఆ కాలంలో ఎ ఎన్ సికి ప్రచారాన్ని సమకూర్చిపెట్టి పరోక్షంగా ఎ ఎన్ సి ప్రయోజనాలకు తోడ్పడింది.

ట్రెజన్ ట్రయల్‌లో భాగంగా లుతులి, మాండెలా తమ శాసనోల్లంఘనను సమర్థించుకుంటూ ప్రకటనలు చేశారు. చిట్టచివరికి 1961 మార్చి 29న జస్టిస్ రాంప్ఫ్ కేసు కొట్టేశాడు. 31 మంది నిందితులు విడుదలయ్యారు కాని వాళ్ళు అప్పటికీ చట్ట వ్యతిరేక సంఘ సభ్యులు ! అందుకే మాండెలా, మరొక సమరశీల నాయకుడు వాల్టర్ సిసులుతో కలిసి మార్చి నుంచి మే వరకు రహస్యంగా దేశమంతా తిరిగి ఒకమూడు రోజుల సమ్మెకు రంగం సిద్ధం చేశాడు. ప్రభుత్వం మాండెలా అరెస్టుకు ఉత్తర్వులిచ్చింది. అలా మే 29 న సమ్మె మొదలైంది. భయంకర నిర్బంధం మధ్య కూడ సమ్మె కొన్ని చోట్ల జయప్రదమైంది. అయితే ప్రజలనుంచి ఆశించినంత స్పందన రాలేదు. అందుకే రెండో రోజు మాండెలా సమ్మె విరమించాడు. తాము పాక్షికంగా విఫలమయ్యామని, అయితే సమ్మెను భగ్నం చేయడానికి ప్రభుత్వం ఎంత పెద్ద ఎత్తున శక్తుల్ని సమకూర్చుకున్నదో చూస్తే తమ బలం ఎంత ఎక్కువో అర్థమవుతుందని మాండెలా అన్నాడు.

శాంతి యుత ప్రదర్శనలను ఒక నగ్నమైన రాక్షసత్వం అణిచివేస్తున్నప్పుడు ప్రజలు అహింసాయుతంగానే ఉండాలనే నిజం నిష్ప్రయోజనకరం అని గుర్తించిన

మండేలా జూన్ 61లో కొందరు ఆఫ్రికన్ నాయకులతో సమావేశం జరిపి తమ ప్రతిహింస ఏ మార్గం తీసుకోవాలో చర్చించాడు. అలా ఆఫ్రికన్లు, భారతీయులు, కొందరు శ్వేతజాతీయులు కూడ కలిసి సంయుక్తంగా ఉంకొంటో వి సిజ్వె (జాతి చేతిలో ఈటె)ను స్థాపించారు. ప్రభుత్వ సంస్థల మీద దాడి చేసి ధ్వంసం చేయడం దీని లక్ష్యం. దాడుల సందర్భంగా ప్రజలకు ఎలాంటి హానీ జరగగూడదనేది దాని నియమం. డిసెంబర్ 16న ఉంకొంటో వి సిజ్వె-దాని మొదటి పదంలోని మొదటి రెండక్షరాలతో ప్రాచుర్యంలో కొచ్చిన ఎం కె-విద్యుచ్ఛక్తి కేంద్రాల మీద, బంటూ వ్యవహారాల కార్యాలయాల మీద దాడి చేసి పేలుళ్ళతో తననుతాను ఆవిష్కరించుకుంది.

ఎం కె పుట్టే నాటికి బెంగమిన్ మొలైసేకు ఐదు సంవత్సరాలు ఆయనకు 29 ఏళ్ళు వచ్చేనాటికీ శ్వేతజాతి దురహంకారం పెరిగిపోయింది, ప్రజల్ని అణిచిపెట్టే నల్ల చట్టాలు మరికొన్ని డజన్లు అమల్లోకివచ్చాయి. మండేలా, సిసులు యావజ్జీవ శిక్షలు పడి రాబెన్ ద్వీపంలో నిర్బంధించబడ్డారు. ఆలివర్ టాంబో ప్రవాసం నుంచి ఎ ఎన్ సిని నడపడం మొదలెట్టాడు. ఎంకె రాశిలోనూ, వాసిలోనూ ఎదిగి అనుకూల దేశాలలో సైనిక, రాజకీయ శిక్షణను పొందడం మొదలుపెట్టింది. ప్రజలను మరింతగా లొంగదీసి, వారి అవకాశాలను నిరాకరించేందుకు ప్రభుత్వం బంటూస్తాన్‌లను ఏర్పరిచింది. బ్రిటన్, అమెరికాల మద్దతుతో, ప్రపంచమంతా అసహ్యించుకుంటున్నప్పటికీ, నిస్సిగ్గుగా దేశంలో అతి క్రూరమైన దమననీతిని చలాయిస్తూవచ్చింది. కొత్త రాజ్యాంగాన్ని ప్రకటించి వోటు హక్కును పరిమితం చేసింది. పెరుగుతున్న అణచివేతకు ప్రజలు మరింతగా ప్రతిఘటనలో సంఘటితమవుతూ జవాబు చెప్పడం మొదాలెట్టారు మరింతస్పష్టంగా పాలకవర్గానికీ, శ్వేతజాతి దురహంకార బోధా ప్రభుత్వానికీ వ్యతిరేకంగా వివిధ అణగారిన వర్గాల ప్రజల ఐక్యతను సాధించేందుకు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పుట్టింది.

ఈ పరిణామాలన్నీ మొలైసే చైతన్యంలో, ఆవరణలో భాగమయ్యాయి. ఆయన మార్కస్ తాచోమోటాంగ్ అనే ఎ ఎన్ సి-ఎంకె కమాండర్‌తో కలిసి పెరిగాడు, కలిసి ఆడుకున్నాడు. ఒకేగదిలో కలిసి జీవితం గడిపాడు. భయంకర

మైన వింటర్‌వెల్డ్ రిసెటిల్‌మెంట్ క్యాంప్‌లో మురికినీళ్ళ కంపుకొట్టే గదుల్లో కలిసి కష్టాలు పంచుకున్నాడు, కలిసిజీవితం గడిపిన ఈఇద్దరు మిత్రులు కలిసి రాకపోయినా మొత్తానికి బోథా ప్రభుత్వ ఉరికంబం మీదనే ప్రాణాలు విడిచారు.

మోటాంగ్, ఆయన దళంలో సభ్యులైన మొగరెనె, మోసలోలి దేశద్రోహానికి పాల్పడ్డారని, ఆగ్లాండో, మొరొకా, వాండర్ బూమ్‌ఫర్ట్ పోలీసుస్టేషన్ల మీద దాడి చేశారని 1982 మేలో ప్రభుత్వం కేసు పెట్టింది. ఆ కేసులో మోటింగ్ బాల్యమిత్రుడైన మొలైసేతో సాక్ష్యం చెప్పించడానికి పోలీసులు ప్రయత్నించారు. వింటర్‌వెల్డ్ క్యాంపు నుంచి చిత్రహింసాశిబిరాల్లోకి మొలైసేను తోలుకుపోయారు. అక్కడ ఆయనను చిత్రహింసలకు గురిచేసి, ఆ ముగ్గురు యోధులకు వ్యతిరేకంగా బలవంతంగా ప్రకటన తీసుకున్నారు. వారంట్ ఆఫీసర్ ఫిలిప్పస సెలిపీ అనే ఆఫ్రికన్ విద్రోహి మొలైసే మీద నిరంతరం ఒత్తిడి తెచ్చి ప్రజాయోధులకు వ్యతిరేక సాక్ష్యం తయారు చేశాడు. ఆ కేసులో సెలిపీ కూడ ఒక సాక్షి.

కాని కోర్టుగదిలో మొలైసే బోనెక్కి తనను నిర్బంధంలో ఉంచిన వాళ్ళను ఖండించాడు. తన నుంచి బలవంతాన వాళ్ళు తీసుకున్న ప్రకటనను తనదిగా ఒప్పుకోవడానికి నిరాకరించాడు. ముగ్గురు యోధులకు వ్యతిరేకంగా తాను ఒక్కమాట కూడ చెప్పనన్నాడు. ప్రభుత్వం ఆయన మీద తమకు నమ్మకం పోయిందని చెప్పి సాక్షిగా తొలగించింది. నిజానికి దక్షిణాఫ్రికాలో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం అది శిక్షార్హమైన నేరమే కాని ప్రభుత్వం ఆయనను అప్పటికి విడుదల చేసింది. సెలిపీ సాక్ష్యం చెప్పాడు. ఆ ముగ్గురికి ఉరిశిక్ష పడింది. 1983 జూన్ 9న వాళ్ళను ఉరి తీశారు.

సెలిపీ ప్రజలకు వ్యతిరేకంగా చెప్పిన చివరిసాక్ష్యం అదే. 3 ఏళ్ళుగా ప్రజలకు వ్యతిరేకంగా, వర్ణ వివక్షతకు అనుకూలంగా ఇష్టపూర్తిగా సాక్ష్యం చెపుతున్న సెలిపీ వల్ల ఆ ముగ్గురు యోధులకు చెయ్యని దేశద్రోహానికి పడిన శిక్షకు జవాబుగా సెలిపీకి ప్రజలు మరణ శిక్ష విధించారు. 1982 నవంబర్‌లో ప్రిటోరియాలోని మామెలుడిలో ఎం కె యోధుల తుపాకి గుళ్ళకు సెలిపీ కుప్పకూలిపోయాడు. ఇంట్లో పడుకోవడానికి భయంతో కారు గారేజీల్లో రహస్యంగా నిద్రపోయే వారంట్ ఆఫీసర్ తన ఇంటి ముందే నడివీధిలో హతమైపోయాడు. తన నమ్మిన బంట్లలో ఒకడు పడిపోవడం

ప్రిటోరియా ప్రభుత్వానికి తీరని అవమానమయింది. 1983 ఫిబ్రవరిలో మొలైసేను అరెస్టు చేసి మళ్ళీ చిత్రహింసలు పెట్టారు. మళ్ళీ ఆయన ఒక సాక్ష్యం చెప్పాలి. ఈ సారి తనకు వ్యతిరేకంగానే! మళ్ళీ బలవంతాన పోలీసులు అయన నుంచి సెలిపీని తానే చంపాననే ప్రకటన రాబట్టారు. ఆ ప్రకటన తప్ప మొలైసే మీద నేరం ఆరోపించడానికి పోలీసుల దగ్గర మరే ఆధారమూలేదు. మళ్ళీ కోర్టులో మొలైసే తన తన ప్రకటన తన నుంచి బలవంతాన తీసుకున్నారని, దానిని తాను నిరాకరిస్తున్నానని చెప్పాడు. ప్రభుత్వం దగ్గర, ప్రాసిక్యూషన్ దగ్గర ఆ ప్రకటన తప్ప మరే ఆధారమూ లేదు గనుక మొలైసే నిరాకరణను కోర్టు అంగీకరించలేదు. మొలైసే తనది కాదని చెపుతున్న ప్రకటననే అధారంగా తీసుకుని ఆయనకు మరణశిక్ష వేశారు. ప్రపంచ వ్యాప్తంగా వెల్లువికిన నిరసనను కూడ కాదని ప్రభుత్వం ఆయనను 1985 అక్టోబర్ 17న ఉరి తీసింది.

మొలైసే జీవితమూ, మరణమూ దక్షిణాఫ్రికాలో జరుగుతున్న వేర్వేరు పరిణామాల న్నిటికీ ఉమ్మడిగా అద్భుతమైన సూచికలవుతాయి. పరాయి పాలన, దుర్భరమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ నిర్బంధాలు, దుస్సహమైన అణచివేత, ఎదిరించగల ప్రజల చైతన్యం, నాయకత్వం వహించగల ఎ ఎన్ సి, పి ఎ సి, తదితర సంస్థలు ఉండి కూడ స్వేచ్ఛ ఒక ఆశనిరాశల స్వప్నంగా ఊగిసలాడిన ఐదు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు శిశువు ఎంకె. ఆ ఐదు దశాబ్దాల ఆకాంక్షలకు, నిర్ణయాలకు, విజయాలకు వైఫల్యాలకు వారసుడు మొలైసే, మరింతగా పెరిగిన నిర్బంధం సమరశీల కార్యాచరణకు నాయకత్వం వహించగల ఎంకె మొలైసే జీవితంతో పాటె కలిసి సాగాయి. వింటర్‌వెల్డ్ క్యాంపులో ఆయన గడిపిన జీవితం ఆఫ్రికన్ యువతరం గురిచేయ బడుతున్న అమానుషహింసకు సూచిక, మోటాంగ్ కేసులో అయనతో ఇప్పించిన తప్పుడు సాక్ష్యం, స్వయంగా తన కేసులో అన్యాయంగా అమలయిన న్యాయం దక్షిణాఫ్రికాలో అమలవుతున్న దుర్మార్గన్యాయవ్యవస్థకు ప్రతీక. అలా ఆయన జీవితమూ మరణమూ దక్షిణాఫ్రికాతో, దక్షిణాఫ్రికా నేపథ్యంతో, దక్షిణాఫ్రికా పరిణామాలతో పెనవేసుకుని ఉన్నాయి. దక్షిణాఫ్రికా లేకపోతే మొలైసే లేడు ఏ పరిణామాల పునాదిగా మొలైసే జన్మించి, జీవించి, మరణించాడో ఆ పరిణామాలే దక్షిణాఫ్రికాను విజయం

పోరుబాటల్లో

—కార్మిక

రామలింగు జావి కాంపౌండులోకి వచ్చేటాల్లకె మధ్యాహ్నం మూడు గంటల చీటి విన్పించింది. ఇకదాంతో అంతవరదాక వడి వడి నడక కాస్త పరుగ్గా మారి మ్యాన్ వే రూమ్ కాడికి చేరుకున్నడు.

అప్పడికె మ్యాన్ వే రూమ్ కాడ గుమికూడిన కార్మికుల గుంపులో ముందు నుంచున్న కార్మికుడెవడో మ్యాన్‌వే గుమస్తాతో ఘర్షణ పడుతున్నాడు. రామలింగుకు ఆ మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

"నన్ను అడుగుతే నేనేం చెపుతా పోయి ఆ మేనేజర్ని కలుపు. ఆయన చెపుతడు ఎందుకు కలువమన్నడో.... ఆయన నాకు చెప్పింది నీకు చెపుతున్న,"అన్నాడు విసుగ్గా

"సరె అట్లనె పోతా నాకెమన్న భయమా ముందు మీరు బైముకు వచ్చినట్టు రాసుకోండి. ఆ తర్వాత ఆలస్యమైంది మళ్ళి మస్టరు లేదంటే బాగుండదు, అన్నాడు. ఆ కార్మికుడు కిటికి వద్ద నుండి బయటికి వచ్చిండు. రామలింగు అతన్నిచూసి "మళ్ళేమి ముంచుకొచ్చిందటనె చందర్రన్నా" అన్నడు.

వేపు పురోగమింపజేస్తున్నాయి. మొలైసే రేపటి దక్షిణాఫ్రికా ఫలదీకరణ కోసం ఇవాళ రాలిపోయిన 250 నొక పూరేకు.



(మేరీ బెన్సన్-స్ట్రగుల్ ఫర్ ఎ బర్త్ రైట్‌కు కృతజ్ఞతలతో)

డిసెంబర్ ఒకటవతేదికి భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరితీసి దశాబ్దం పూర్తయింది. ఉరిశిక్షలను రద్దుచేయాలని మరొకసారి నినదిస్తూ ఇటీవల దక్షిణాఫ్రికాలో ఉరి తీయబడ్డ కవి బెంజిమెన్ మొలెసె సంస్మరణలో ఈ వ్యాసం.

"ఏమో....ఎందుకో....తెల్సుకొని వస్తా" అంటూనె చంద్రయ్య మేనేజరు రూమ్‌కు గబగబ నడిచిండు.

"మరి చెల్లించు కుంటాండ్లు", మందిలో నుండి ఎవడో గణిశిండు.

"ఆఫీసు ముందు చూపినా పోలీసోల్ల వ్యాలుంది"

"అంతేనా C. P. I. లీడరు భాస్కరరావు కూడా వచ్చిండు"

"అయితే మళ్ళేదో కుట్ర చేస్తానంటె వుంది," ఎవడో వ్యంగ్యంగా దీర్ఘం తీ సి ం డు.

"చేసుకొనీ నా లంజెపియ్యి... ఎవడేం పీక్కుంటడో."
అలా తలోమాట మాట్లాడుకుంటనె మ్యాస్‌వేలో మస్టరు చెప్పి ముందుకు కదులు తున్నారు.

అప్పటికె కార్మికులు, అలస్యమౌతుందని తొందర పడుతున్నారు. ఈ మధ్య బావులమీద ఎక్కడలేని చెక్కింగు నడుస్తాంది. మూడు గంటలకు ఒక నిముషం ఆలస్యమైతే చాలు మస్టరు బుక్ క్లోజ్ చేస్తాండు....అ తర్వాత ఎంత బ్రతిమిలాడినా బామాడిన ఏం లాభముండదు. ఇక ఆ రోజుకు మస్టరు సున్నె.

రామలింగు మస్టరు చెప్పి అటునుంచి అటే ల్యాంపు రూమ్‌కు వెళ్ళి ల్యాంపు తీసుకొని అటువైపున్న దారిగుండా కొత్తగా కట్టించిన బ్యారక్స్‌లోకి వచ్చిండు.

అప్పటికె అక్కడ వోవరుమెన్లు, సర్దార్లు, అండర్ మేనేజర్లు హాజరుగున్నారు. ఇదివరలో అయితే వోవరుమెన్లు తీరిపాలివచ్చి వర్కు డిస్ట్రిబూషన్ చేసెటోళ్ళు ఇప్పుడా పద్ధతేలేదు మస్టరు పడ్డ మరుక్షణంలోనే వోవరుమెన్లు వర్కు డిస్ట్రిబూషన్ చేస్తున్నారు. మస్టరు పడ్డ మరో పావుగంటలోనే బాయిమీద ఒక్కరు కన్పించకుండా బాయిలోకి దిగిపోతున్నరు.

అందరు దిగినంక నెమ్మదిగా మరోగంట అలస్యంగా దిగే సర్దార్లు, కార్మికులు డిస్టిల్‌లోకి చేరుకునేటాల్లకు హాజరుగుంటాండ్లు ఇక వోవరుమెన్లు కూడా అంతే.

కొత్త మేనేజింగ్ డైరక్టరు వచ్చిన కానుంచి, అన్ని కొత్త కొత్త రూల్సు పెట్టిండు. అంతా స్ట్రిక్టు అయిపోయిందంటాండ్లు ఏది ఏం అయితేనేం సర్దార్లు, వోవర్‌మెన్లు, అండర్ మేనేజర్లు కూడా కార్మికులతో పాటేదిగి, చేతిలోని పొన్నుకర్రలను తాడించుకుంటూ "ఏమైందింకా వర్కు స్టార్టు చెయ్యలేదా ? ఫస్టు షిఫ్టులో వచ్చిన రెజింగ్‌ను మించిపోవాలి" అంటూ హెచ్చరిస్తున్నారు.

స్వయంగా కళ్ళముందు అండర్ మేనేజరు కనిపించి పురమాయిస్తుంటే ఇక సర్దార్ల, వోవరుమెన్ల హడావిడి చూడాల్సిందేమరి.

సర్దార్లు, లాడిసోల్ల దగ్గరికి పోయి "పని మొదలుపెట్టండి ..లాడీసులు రాలేదా ట్రామరోల్లేం చేస్తాండ్లు, బర్తీలు పైకి పోవాలి..... ట్రామరు డ్రైవర్ నిదరపోతుండా ? అంటూ చిర్రుబుర్రు లాడుతు కమానోల్లను సమీపించి "ఇంకా ఇక్కడే ఉన్నారేందిపోయి జీపుల దగాయించుండ్లి పేసులు వెడల్పు కానివ్వద్దు పేసులు వెడల్పు అయ్యేదుంటె ఒక్కొక్కరికి లెటర్సు ఇస్తా" అంటు హడావిడిగా అటు ఇటు తిరుగుతు, మళ్ళీ లాడీసోల్ల దగ్గరికి వచ్చి "లాడీసులు వచ్చినయి తొందర తొందరగా నింపుకోండ్లి ఎన్ని టబ్బులు నింపుకుంటే అన్ని పైసలు మీయెవాయె, అంటు తొందర పెడుతున్నారు.

రామలింగుకు ఇదంతా వింతగానే ఉంది. ఇదివరలో అయితే టబ్బులసప్లయిలు సరిగా ఉండక ఇబ్బంది పడెడోళ్ళు ఇప్పుడట్లాలేదు. ఇదివరలో ఆవరేజ్‌గా టబ్బు టబ్బున్నర నింపెకాడ ఒక్కొక్కరు రెండు రెండున్నర టబ్బులు నింపుతాండ్లు. ఇక దాంతో పెసుల్ల పనివొత్తిడి పెరిగి ముసలిముతకోళ్ళు పనిచేయలేక పోతండ్లు క్షణం ఇరాంలేకుండా ఎనిమిది గంటలు గర్మిపెసుల్ల గాలి లేక దగ్గుతు, దమ్ముతు పని చెయ్యలంటె వాళ్ళతో అయ్యేపనా ? మంచి కండ పుష్టి గల యువకులకె ఎనిమిది గంటలు పన్జెసిపైకి రావాలంటె ప్రాణమంత సొడసొడలు పోబట్టె...నల్గురు పట్టుకొని తన్ని తగలేసినట్టు వొళ్ళంతా ఒక్కటి నొప్పులు....

ఇక కమానోల్లు మేం ఎక్కడని చావాలి ? ఒక్కసారి రెసులంటె మరోసారి జీపులని, మరికాసేపట్లో [illegible]టికి అనిరి. క్షణం సేపు మిషనుకు ఇరాం లేకుంటే

షొక్కలు కొడ్తానెడున్నర? షాట్ ఫైరర్సు వచ్చి మందుదటాయించి బొగ్గుకూల్చిడ్లోం, లేదో, పొగ ఇంకా పోకాముందె లాడీసోల్లు బొగ్గు నింపెందుకు పెసులకు పోతండ్లు.

ఇక టింబరింగ్ వాళ్ళు, మిషనిస్టులు, పిట్టర్లు, హెల్పర్లు, లాటికమ్మరోల్లు ఎవర్నిచూసినా ఏముంది ఎదురుగానే సూపర్‌వైజర్లు ధగ్గరుండి "కానియ్ కానియ్" అని తొందర పెడ్తున్నరు. మొత్తానికైతె ఎనిమిదిగంటలు కారిక్ములు ఇరాంలేకుంద పన్జెయిస్తాండ్లు.

ఇదంతా ఎట్లా ఉందంటే చాట్ల తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టిగా తంతుగా ఉంది. కంపినోడు వొయ్యకుంటా ముయ్యకుంటా ఎక్కడ నొక్కాల్నో అక్కడ నొక్కిండు. ఇక అంతె మొత్తం యంత్రమంతా గిరగిర లాడినట్లు ఆడుతున్నారు.

క్షణం ఆలస్యంగా లాడీసులు వస్తె ఫిల్లరోళ్ళు ట్రామరోల్లమీద, ట్రామరోల్లు హాలర్ డ్రైవర్ల మీద ఎగురతాండ్లు. కమానోల్లు లాడేసోల్ల మీద కోపంగ ఉన్నారు. ఇట్లా కార్మికులు ఒకరిమీద ఒకరికి తెలియకుండానే కోపాలుకల్గి ఈనిన కుక్కల తీర్న పన్జెసే పెసుల్లా కొట్లాడు కుంటాండ్లు.

అగ్గో అటువంటి సమయంలో-

రామలింగు ఆరోజు బాయిలో నుండి పైకి ఎక్కేసరికీ ఆ గ్యాంగోల్లకు రోజు వారికంటె మరోగంట ఆలస్యమైంది. రామలింగు వెంట వెంకటస్వామి ఉన్నడు. అతనికి కోపంతోని పెదవులు వనికినయి. ప్రాణమంతా సొడసొడలు పోతాంటె నోటికొచ్చినట్లల్లా ఏదోఏదో వాగుతాండు. అదివిని వినసట్టు రామలింగు నడుస్తున్నాడు.

అర్ధరాత్రి పన్నెండు దాటింది. రాత్రి ఆకాశంల చుక్కలు తేటగా కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. కొద్దిగా చల్లగాలి వీస్తుంది బంకర మీదున్న కార్మికుడు అస్పష్టంగా అటు ఇటు కదులుతు కన్పించాడు. బంకరు క్రింద లారిలో బొగ్గు తోదేరు బడ బడ కూలిన బొగ్గు చప్పుడు విన్పిస్తూంది. అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని ఛేదిస్తుంది.

వెంకటస్వామి ఇంకా వదురుతూనె ఉన్నడు. కుక్కలు పొడవ..లేబరోడు మనిషి కాదు...గొడ్డు...గొడ్డేంది...అంతకంటె హీనాతి హీనం సంపుక తింటాండ్లు

తిననీ... ఏం తింటరు నా లంజె పియ్య", అని గుణిశిండు. మళ్ళీ కాసేపు ఏం మాట్లాడ కుండానే పోయి పంపు కింద నడుం పెట్టి సల్లగా వొళ్ళంతా పట్టిన బురదంతా కడుక్కున్నరు, ఇద్దరూ.

"రైటర్ అపుట్ మస్టర్ ఏస్తడోతేదో" రామలింగు గుణిసిండు.

"ఎందుకెయ్యడు..ఇదేమన్నా మన ఇంట్ల పెండ్లి ఉండి ఆగిపోయినమా ఏందీ.. అందరి లెక్క మనం బరాబరీ లాడీసులు నింపితి౦. మేనేజుమెంటోడు ట్రాక్ లైన్ సరిగా వెయ్యకపాయె ఇక నిండిన లాడీసులు గులాయిదాక దొబ్బుకొస్తాంటే అది పట్టీలు ఏడె. ఇక అది లేపి మళ్ళీ నింపి వచ్చేసరికి గీయాల్లయిందా ? అంటూ ఈపును బనీనుతో తుడుచుకున్నడు.

రామలింగు ఏం మాట్లాడలేదు మాట్లేడేందు అంద్ల కొత్తదనమేది కన్పించలేదు. అతనికి మాట్లేడెందుకు ఓపిక కూడ లేదు. మౌనంగా తలపంకించి వాటరు ట్యాప్ కింది వీపు పెట్టిండు నల్లటి బొగ్గు బురద సంకల కిందుగా జారింది. ఒళ్ళు కంటిన బురదంత పోయెసరికి కాస్త హాయనిపించింది. అట్లాగె దోసెట్ల నీళ్ళు పట్టి రెండు గుక్కలైతె నోట్లో పోసుకున్నడు. కడుపంత దేవినట్లయింది.

వెంకటస్వామి ఇంకా వాగుతూనె ఉన్నాడు ఇక ఆ రైటరోని పెద్ద నిక్కుడు వాడు, అపుట్ మస్టర్ వేయంటే, కింద మీదగా చూసి, యాంకు రాక పోయిన వంటు నీల్గుతడు వాని లెక్కన ఏంక కింద కూసొని మూడు ఏడు ఏస్తె మనకు జీతం వస్తె బాగానె ఉండు.

అనుకున్నట్టుగానె మ్యాన్ వే రూమ్ల రైటర్ వొంటినిండా ముసుగుతున్ని కుర్చీలో పడిజోగుతున్నడు. మస్టర్ వేసె కిటికి ముందు అలికిడయ్యేసరికి కళ్ళుతెరిచి ఏంకావాలన్నట్టు చూసిండు.

"అపుట్ మస్టర్ సారో" రాములింగు.

"ఎప్పుడూ పడ్తె అప్పుడొచ్చి మస్టరంటే ఎయ్యటానికి నాకేం పనిలేదా ఇక్కడ మస్టర్ క్లోజ్ చేసినా, పోయి మేనేజరుతో చిట్టి రాయించుకొచ్చుకో, పో".

"వాడెక్కడుంటడు పోయి పక్కల పచ్చగ పండుకొని ఉంటడు" వెంకటస్వామి నసిగిండు.

రైటర్, ఎవరది అన్నట్టుగా రామలింగు వెనక్కి చూసిండు కోపంగా కండ్లకు ఎదురుగా లైట్ కాంతి పడి చీకట్లో ఉన్న వెంకటస్వామి కనిపించలేదు. అలవాటు ప్రకారం కోపంగా అరిచేవాడల్లా ఎందుకో నోరు దగ్గరపడ్డది. అసలైతె వాతావరణం ఏం బాగాలేదు. లేబరోడెవడూ మునుపటి తీర్గ ఉంటలేడు. వీళ్ళకేదో మాయిన గాలం వచ్చినట్టుంది. ఓ దొర లేదు, ఓ రైటర్ అన్న గౌరవంలేదు. పెట్రేగి పోతాండ్రు ఇదంత ఏదో నాశన గాలానికి వచ్చినట్టె ఉంది నాకెందుకొచ్చిన తంటా" అనుకున్నడు, మనసులోనె.

"ఇంత సేపటి దాక అవుట్ మస్టర్ పడకుండా ఏం చేసిండ్లు" కాస్త శాంతంగా నోరుకాస్త తొస్సు పోతాంటే గుణిశిండు.

రామలింగు నెమ్మదిగా బదులు పలికిండు. "బర్తీలు పల్టీ పడ్డయి అది నింపి వచ్చేటాల్లకు గీయాలయింది సార్".

ముసలి రైటరింకేమి మాట్లాడకుండానే మస్టరు బుక్ తీసి మస్టరేసిండు.

ఇద్దరు బయిటికి నడిచార. బావి కాంపౌండు దాటి వస్తుంటె కొత్తగా తీసిన కంతకాలు కానక వెంకటస్వామి ముందుకు మొగ్గిపోయేవాడల్లా నిలదొక్కుకొని", నీ యవ్వగిక్కడ గీ పొక్కలెందుకు తీసినట్టు ?"

రామలింగు, వెంకటస్వామి కేసి "ఏమన్నా దెబ్బ తాకిందా " ? అని అడిగి "బాయి మీద కాంపౌండు కడ్తండ్లు ఎందుకో ?" అన్నడు.

"ఏమో ఎవని కెరుక. రోజుకో కొత్త రూల్ రాబట్టె ఇదివరకు గీ బాయిల మీద గింతస్ట్రిక్ట్ ఉండెదా ? ఇన్ మస్టర్, అవుట్ మస్టర్ తప్పకుండా వేయించు కోవాలట ఇక అంత ముందు బాయి మీదనే వోవరు మెన్లు, సర్దార్, పని డిస్ట్రిబూషన్ చేసెటోల్లు ఇపుడివన్ని బాయిల చేస్తుండబట్టిరి. పన్ల కూడ ఎంత ఒత్తిడి పెరిగిందని నల్లుదు మనుషులు పట్టుకొని చితక తన్నినట్టు కాబట్టె ఇక గట్లనె బాయి మీద కొచ్చిన లేబరో

డెవడో తిర్గిపోకుండా బాయిల చుట్టూ గోడలు కట్టి గేట్లు పెడ్త రేమో" అన్నడు. వెంకట స్వామి రామలింగు ఏం మాట్లాడకుండా ముందుకు సాగిండు.

"గిల్ల పెట్టుడె కాదు, ఆ గేట్లకాడ పోలీసులను పెట్టి, బిడ్డా చేస్తరా పని చేయండ్లి, లేకుంటె తుపాకులుతోని కాల్చేస్తె వంటరేమో, అన్నడు వెంకటస్వామి, మళ్ళీ మాటలను పొడిగిస్తూ "ఇప్పుడేమన్నా తక్కువ చెలాయించుకుంటాండ్లా రేపు నువ్వన్నట్లు చేసినా ఆశ్చర్యపొయ్యేదేమిలేదు"-రామలింగు.

వాళ్ళు అట్లా నడుచుకుంటూ-విఠల్ బస్తీకి పోయే దారి రైల్వేటాక్ పక్క నుండి పోయే కాలిబాటకాడికి వచ్చినంక వెంకటస్వామి సెలవు తీసుకొని ఝూడిద బస్తీకేసి నడిచిండు. రామలింగు ఒక్కడె అడ్డదిడ్డంగా ఎత్తు పల్లాలున్న ఆ కాలిబాట వెంట పడి వడివడిగా కాళ్ళు జాపుకుంటు నడక సాగించాడు.

అలవాటయిన ఆ దారి గుండా అతను చకచకా నడిచి పోతున్నాడు. మరొక రెవరన్నా కొత్త వారయితే ఆ దారి గుండా ఆ చీకట్లో నడవాలంటే కష్టమే మరి. అప్పుడప్పుడు 2 ఇంక్లన్ కాడున్న C. S. P. నుండి బడబడలాడుతున్న చప్పుడు విన్పిస్తుంది. మధ్య మధ్య రోడ్డుమీద పోయే లారీల చప్పుడు తప్ప, కనుచూపు మేరలో నిశ్శబ్దంగా చీకటిగా ఉంధి. దూరంగా ఫెర్టిలైజర్ సిటీ ఆ చీకట్లో మెర్క్యూరి దీపాల మధ్య వెలిగి పోతుంది. మరో ప్రక్క గోదావరి ఖని టౌన్ లైట్లకాంతిలో నిద్దురపోతుంది.

ఎత్తుగా వున్న మట్టిదిబ్బను ఎక్కి అటు వైపుగా ఉన్న వంపులోకి కాలిబాట వెంట దిగాడు. ఆ వంపులో పారే మురికీ కాలువలను దాటి మళ్ళి పైకి ఎక్కాడు. మరోఫర్లాంగు దూరమైతే బస్తి ఉందనగా, అతను కాలిబాటను వీడి మళ్ళి రోడ్డెక్కాడు ఆ రోడ్డుమీదంతా చీకటిగా ఉంది. రోడ్డు కిరువైపులా ఉన్న చిలుకొంచ డెట్లు చీకటిలో జడలు విరబోసుకున్న దయ్యం తీర్గ నిలుచున్నాయి.

అకలి, నీరసం, అలసటతోని పాదాలు తడబడుతున్నాయి. నెత్తిమీద టోపీయే బరువుగా తోచింది. చెట్టు నీడలోకి వచ్చాడు.

ఆ చీకట్లో టపటప పాదాలను చప్పుడు చేస్తూ ఎదురుగా ఎవరో ఉరికి వచ్చారు. లంగో ? దొంగో ? ఆ చీకట్లో ఎవరైంది కనిపెట్టలేక పోయాడు.

ఎదురుగా తన వైపే వస్తున్నది చూసి భయంతో ప్రక్కకు తప్పుకోవటం కోసం రోడ్డుకు కుడివైపున్న ఖాళీ జాగలోకి పరుగు పెట్టారు.

అంతలోకె పీమ్ పీమ్ మంటు విజిల్ విన్పించింది. అటు నుంచి బూట్లచప్పుడు విన్పించింది.

రామలింగు పై ప్రాణం పైనే పోయింది. అంతకు ముందెప్పుడో ఆర్నెల్ల క్రింద అదేదో బందిపోటు దొంగలు ఇట్లాగె చీకట్లో ఒంటరిగా వచ్చెపోయెవారి మీద దాడి చేసి కర్రలతో కొట్టి చంపిన సంగతి గుర్తుకొచ్చి కాళ్ళు వనికినయి.

ఒక క్షణం గాబరాపడిపోయి ఎటుకదల లేదు. మరుక్షణంలో వెనక్కి తిర్గి పరుగుబెట్ట సాగిండు.

విజిల్ చప్పుడెక్కువైంది.

ఎవడో బలం గల్లోడు బూట్లు టప టప లాడించుకుంటు పరుగుపెట్టి ముందుకు పోతున్న వాడ్ని అందుకోలేక చేతిలోని లాటీని విసురుగా విసిరిండు. అది టప్పుమని వీపులో తాసి ఆ ఊపుకు కూలబడి పోయిండు.

కోపంతో ఉరికి వచ్చినవాడు పెక్కుమని వెన్నులో తన్నిండు. ఫుట్ బాల్ లా మెలికలు తిర్గిపోయిండు. అంతలోనె అక్కడికి పరుగెత్తు కొనివచ్చిన మరి ఇద్దరు పోలీసు జవాన్లు చేతిలో కర్రలతో బాదటం మొదలు పెట్టారు.

దెబ్బలకు కాచకునె ఓపిక కూడా లేక ఈ హఠాత్తు సంఘటన దిగ్భ్రాంతిచెంది, కర్రదెబ్బలను తట్టుకునేందుకు చేతుండ్డంగా పెట్టిండు.

అప్పుడు రామలింగు వాళ్ళను చూసి గుర్తుపట్టిండు కాకి బట్టల పోలీసులు. "ఎందుకు బాంచెను నన్ను ఈ తీర్గ కొడుతాండ్లు", అన్నాడు.

చుట్టు గుమికూడిన పోలీసులు ఒక్క క్షణం ఆగిపోయిండు. అందులో ఒకడు "ఏంరా మమ్మల్ని చూసి ఎందుకు పరుగుబెట్టావురా" అన్నాడు గుర్రుగా.

"మీరనుకోలేదు బాంచెను ఎవరో దొంగలను కొని భయమేసి పరుగుబెట్టిన" అన్నాడు. అంటునే అంతవరదాకా పడిపోయిన వాడల్లా లేచి కూచున్నడు.

"అరె లంజకొడుకా, అర్ధరాత్రిదాక దొంగలెక్క చీకట్ల తిర్గెటోడివి. మమ్మల్ని దొంగలను కొని పారిపోయినావురా" అంటు కర్రతో మోకాలు మీద పొడిచిండు.

"ఏదెవడో సక్కలెటు నా కొడుకె" అన్నాడింకొకడు దర్వంతీస్తూ.

"లేకుంటె గీ అర్ధరాత్రి పూట గీ చీకట్ల ఎందుకు తిర్గుతున్నావురా" మరొకడు.

"లేదు బాంచెను సిన్మాటేసునుంచి తిర్గివస్తున్న ఇగ్గో అంతలావైతే నా నెంబర్ బిల్లా చూడుండ్రి కాకుంటే బాయి మీదకు పోయి అడుగుండ్రి" అన్నాడు బతిమాలె ధోరణిలో. నడుం కింద చెయ్యివేసి కూసుండ బెట్టాలొకడు. దాహంతో గొంతు పిడుచ కట్టుక పోయింది. మారు మాటలేక నీళ్ళు కావాలన్నట్టుగా సైగ చేసిండు. వొళ్ళంత పచ్చిపుండు తీర్గ ఉంది. శరీరంలో ఏ అవయవంకా అవయవం ఊడిపోతున్నట్టుగా తోచింది.

మూలకున్న కుండలోనుండి ప్లాస్టిక్ గ్లాసుతో నీళ్ళు తెచ్చి నోటికాడ పెట్టాడొకడు. రెండుగుక్కల నీళ్ళు కడుపులో పడేసరికి కొంతసోయికొచ్చిండు. "నేను ఎక్కడున్నా" అంటూ గాబరాపడిపోయి అటు ఇటు చూసిండు కుడివైపున్న బ్యారక్స్ లోనుండి సెంట్రీడ్యూటిలో ఉన్న పోలీసువాడు కనిపించిండు.

భయం, బాధతో అతనికి కళ్ళవెంటి నీళ్ళు కారినయి.

చంద్రయ్య ఓదార్పుగా తలమీద చెయ్యేసి, "ఏడ్వకన్నా ఎందుకేడుస్తావు. మేమంతాఉన్నాంకదా. నువ్వేమి భయపడకు" అన్నాడు, అతని కళ్ళు ప్రశాంతంగా ఉన్నాయి. ఆ కళ్ళలో ఎటువంటి క్రోధం, ద్వేషంలేదు. నెమ్మదితనం ఉంది. మనిషి మునుపటికంటె చాల తీసిండు. కోల మొఖంలో కండ్లు లోతుకు పోయిఉన్నాయి.

చంద్రయ్య చేతిలో మొఖం పెట్టి ఏడ్చిండు రామలింగు. ఆ ఏడుపులోకి తనను ఎలా పట్టుకొచ్చింది చెప్పుకొచ్చిండు. పట్టుకొచ్చిన తర్వాత అదేరాత్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఇంపరాగేషన్ పేరిట సోయి సోయి తప్పేంతవరకు వొళ్ళును హూనం చేసింది. లీలగా గుర్తున్నదంత చెప్పుకొచ్చిండు.

"ఏడ్వకు. ఏడ్చి ఏం లాభం. దెబ్బలు కొట్టిండ్లనా, మనం రోజు బాయి పనిల ఇంతకంటె ఎక్కువ దెబ్బలు తింటన్నం. కాళ్ళు చేతులు తెగిపోలు మనతోని

గ్యాస్‌సెటోళ్ళు ఎంతోమంది, తొంటోళ్ళు కుంటోళ్ళు కాలేదు. ఎంతమందిని బొగ్గు బాయి మింగేయలేదు. జండల క్రింద బొగ్గు పెల్లల క్రింద కాళ్ళు చేతులు తెగిపోయి తలలు పగిలి ముక్కలు ముక్కలైన ఎంతమంది మానతోటి కార్మికులను తట్టల్లో ఎత్తుకొని బయిటికి తీసుకరాలేదు. అట్లా సచ్చినా మనం భయం పడ్తున్నామా.

మళ్ళీ పోయి పన్జేస్తనే ఉన్నం. ఇట్లా చావు బ్రతుకు ఎరగకుండా పన్జేస్తే మనం సంపాదించు కున్నదేమున్నదీ. అప్పులు, రోగాలు, అర్ధాంతర చావులేనా. ఎందుకు మన బ్రతుకు - ఇట్లున్నయని మనం ఆలోచన చేసాన్నం. మన మీద జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తున్నాం. అగ్గో అదె మనతప్పయిపోతాంది. ఇంత రదాక చాటుమాటున దెబ్బకొట్టెటోడు ఇప్పుడు నేరుగానే కొడ్తాండు. పోలీసులను దిద్చిండ్లు. పిచ్చికుక్కల తీర్గ వాళ్ళు మన బావులమీదికి సచ్చి మన ఇండ్లల్లకు వచ్చి నానా హంగామా చేస్తాండ్ల. ముసలి ముతక లేకుండా పట్టుకొచ్చి, గొడ్లను బాదినట్లే బాదుతాండ్లు మన ఆడోళ్లమీద చెయ్యి చేసుకుంటాండ్లు. మన గుడిసెలు పీకి కాలబెడ్తాండ్లు మన పొల్లగాల్లను పట్టుకొచ్చి చిత్రహింసలు పెడ్తాండ్లు," కోపంతో అతని గొంతు వణికింది. అతని మాటలు తడబడ్డయి అయినా అతనింకా మాట్లాడసాగిండు. "వాళ్ళ చేతుల్ల తుపాకులున్నయి. వాళ్ళ చేతుల అధికారమున్నది. వాళ్ళ ఇష్టారాజ్యం నడిపిస్తాండ్లు, కష్టం చేసే మనలాంటి వేలాది కార్మికులను కర్షకులను అణచటం కోసం, తిసమర్గి కొవ్వపించిన దోపిడీ దారులు మన గుండెలకు తుపాకులు ఎక్కుపెట్టి మనల్ని అణచాలని చూస్తాండ్లు మనం న్యాయంకోసం పోరాడు తున్నాం. వాళ్ళు మనపై అన్యాయం, దురాక్రమణ, దుర్మార్గం చేస్తాండ్లు, దాన్నింక మనం ఎంత మాత్రం సహించం" సెంట్రిప్యాటీలో ఉన్న ముసలి పోలీసువాడు కాళ్ళు తాడించుకుంటు, లాఠపు ముందుకొచ్చి, "క్యారేలాకపు రూమ్‌లోకుడా మీటింగ్ పెట్టిండ్లా సర్కిల్ వచ్చె వేళయింది. కామూష్‌గా కూచోండ్లిలేకుంటే వాడు నా మీద కస్సుబుస్సు లాడతడు మీ తపులుసాపు చేస్తడు", అన్నాడు ఎడమ చేత్తో తుపాకి పట్టుకొని కుడిచెయ్యిని గాల్లోకి ఆడించుకుంటు హెచ్చరిక చేసిండు.

"ఏం ఎందుకు ఊకోవాలె మేం ఏ నేరం చేసినమని మమ్మల్ని ఈ తీర్గ గోసపెడ్తాండు".

"ఇక వాదొచ్చి పీక్కునేదేంది", గుబేశిడు మరొకడు ఇంకొకడు మళ్ళేదో అన్నడు.

చంద్రియ్య వాళ్ళను వారించి, సెంట్రి నుద్దేశించి, "నువ్వెందుకు భయపడ్తవు మేం మాట్లాడినా మాట్లాడకున్నా మీ సర్కిల్ చేసేది చేస్తడు. ఈ తన్నులు, గుద్దులు, కేసులు మాకెట్లాగు తప్పవు. ఇక మేం దానికీ భయపడాలె మేం ఏం తప్పు చెయ్యలేదని మాకెకాదు నీకు తెల్సు బహుశా మీ అధికారికీ కూడా తెల్సేఉంటుంది. కానుంటే అధికారం కోసం, ప్రమోషన్లకోసం పాకులాడుతు దొంగలకు, మనిషి రక్తాన్ని రుచిమరిగిన దోపిడి దార్లకు కక్కకాపలా కాస్తున్నాడు", అన్నాడు.

"కుక్కలక్షణం అంతె కదాదురి" మధ్యలో ఒకడు కల్గజేసుకొని.

సెంట్రి ఇబ్బందిగా కదిలిండు ఏదో అందామని నోరు తెరిచిన వాదల్లా, చంద్రియ్య మాటలు మళ్ళీ వినబడేసరికి నోరు మూసుకున్నడు.

మేం ఆ దోపిడీదారులకు వ్యతిరేకంగా ఆ దొంగలకు వ్యతిరేకంగా న్యాయం కోసం పోరాడుతున్నాం. మాకు తెలుసు దోపిడిని అంతం చేయాలన్న దోపిడిదారులను లేకుండా చేయాలన్నా, మేం పోరాడకతప్పదు. మా పోరాటంలో ఇలాగె ఈ దోపిడి దారుల పెంపుడు కుక్కలు మొరగటం సహజమె, కరవటం సహజమె. మేము దోపిడి దారులను అంతం చేయాలను కున్నప్పుడు ఈ పెంపుడు కుక్కల సంగతి కూడా చూడాల్సిందే మరి.

సెంట్రి ఎందుకో యిబ్బందిగా కదిలి ఏదో మాట్లాడిండు ఆ మాటలేవి పెదవులను దాటి బయిటికి రాలదు. అతను మారు మాట్లాడకుండా తిర్గి తన యధా స్థానంలోకి పోయి నిలుచున్నడు.

లాకపు రూంలో కాసేపు ఎవరు ఏం మాట్లాడలేదు.

ఆ మౌనాన్ని భంగపరుస్తూ రామలింగు, "చంద్రిన్నా, నిన్నా బాయికాడి నుంచి, ఇటునుంచి ఇటె తీసుకొచ్చిండ్లా" అంటూ అడిగిండు.

చంద్రయ్యకు శాంతంగా నిన్న తనను అరెస్టు చేసిన సంగతి గురించి చెప్పుకొచ్చింది.

మ్యాన్‌పవర్ మేనేజర్ని కలువుమని చెప్పిండు కదా, ఇక అక్కడనుండి కాలరీ మేనేజరు రూమ్‌కు పోయిన. నేను పోయేటాల్కె కాలరీ మేనేజరు దగ్గర సర్కిల్ ఇన్‌స్పెక్టరు వెంకట్ రెడ్డి, రివిజనిస్టు లీడరు భాస్కర్‌రావు కూడ ఉన్నరు. అంతవరదాక ఏదో గుసగుస లాడుతున్న వాళ్ళు, నేను పోయేసరికి తేలుకుట్టిన దొంగలతీర్గ చడిచప్పుడు చేయకుండా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంట కూచున్నరు. లోపలికి పోయిన నన్ను చూసి కాలరీ మేనేజరు బెల్ కొట్టి పియ్యేగార్ని పిల్చిండు. ముసలి పియ్యే ఏదో కాగితాలు తెచ్చి ఇచ్చిండు. అవేంటో నాకు అర్థం కాలె. కాలరీ మేనేజరు ఆ కాగితాలను క్రింది మీదికి ఒకసారి చూసి, "ఇగో ఇవి తీసుకో" అని నా చేతికియ్య వచ్చిండు. అధికారికంగా "ఏంటది ?" అన్న అడిక్కి,

"నన్ను సర్వీసునుండి డిస్మిస్ చేస్తున్నాం. అదే లెటరు," అన్నాడు నిర్లక్ష్యంగా

ఇకనాకు మాతిపోయింది. తీసుకుంటామా వద్ద అని గుంజాటన పడ్తాంటనె సర్కిల్ ఇన్‌స్పెక్టరు నావైపు కోపంగా చూసి, "మేనేకరుగారు చెపుతుండు తీస్కోరా" అంటూ గుడ్లెర్ర జేసిండు.

ఆ ముసలి బెదిరింపునకు భయపడేందుకు ఇక్కడ ఎవరులేరనుకొని "కారణం లేకుండా మీ ఇష్టమొచ్చినట్లు డిస్మిస్‌చేస్తె నేనెట్లా తీసుకుంటా" అన్నను.

"కారణాలన్ని అందులో ఉన్నాయి. తీరిగ్గా ఇంటికిపోయి చదువుకో" అంటూ సర్కిల్ మళ్ళీ జోక్యం చేసుకున్నడు.

నాకిక కోపం ఆగలె. "మేనేజుమెంటుకు వర్కరుకు సంబంధించిన విషయంలో మీ జోక్యమేమిటో నా కర్థం కావటం లేదు," అన్నాను.

"అర్థం చేయిస్త బిడ్డా తొందరపడకు,"

అంటు గుర్రుగా నాకేసి చూసి కుర్చీలో అటు ఇటు కదిలిండు.

తీరా ఆ లెటరు తీసుకొని చూస్తె ఏముంది. ఆర్నెల్ల కింద ఎప్పుడో బాపుల గురించి మనం సమ్మెచేస్తె ఆ సమ్మె జరగటానికి ప్రధాన కారణం, ప్రోత్సాహం నేనేనని ఆ సమ్మె మూలంగా ఏర్పడ్డ ఉత్పత్తి కష్టానికి నేనే కారణమని ఇంకా ఏదో

ఏదో నలభై సేజీల భాగోతం రాసి పై కారణాలవల్ల ఫలానా సెక్షన్ క్రింద డిస్మిస్ చేయనైనది అని ఉంది," అన్నాడు.

"ఆ సమ్మెకు నీవొక్కనివి ఎట్లా కారణమైతావు. అందరం అనుకొని చేసిందైనాయె." రావలింగు, చంద్రయ్య మాటలకు అడ్డపోయిండు.

అక్కడ వింటున్న మిగతావారంతా "నిజమేకదా" అన్నట్టు తలలు తలలు ఆడించిండ్లు.

"అదె నేనన్నా. సరె సమ్మె చేయటానికి నేనే కారణమని మీరంటె కాదు. ఆ సమ్మెలో పాల్గొన్న ఏ కార్మికున్ని అయినా పిల్చి సాక్ష్యం ఇప్పించండి నేను చెప్పితే సమ్మె చేసిండ్లో లేక అందరు కార్మికులు అనుకొని చేసిండ్లో మీకే తెలుస్తుంది. ఒకవేళ ఏ కార్మికుడైనా సమ్మెకు నేనె కారణమని చెప్తె, మీరు చెప్పినట్టు చేయటానికి నేను సిద్ధం," అన్నాను.

నా మాటలిని, ఎర్రటి మచ్చలున్న మొఖమంత మరింత ఎర్రబడి పోంగా పెద్దగా గొంతు చించుకొని అరవసాగిండు. "మాకు కావల్సినంత సాక్ష్యం ఉంది. ఏమండి పీడరుగారు ఆ రోజు సమ్మె, యూనియన్ నాయకులు మీరు చెయ్యలేదు మరి అటువంటప్పుడు ఎవరు చేయించిండ్లంటరు"? అన్నట్టు లీడరు మొఖంలోకి చూసిండు.

అంతవరదాకా ఒక్క మాటయినా మాట్లాడని లీడరు నాకేసి చూడకుండానే ఏదో జ్ఞాపకానికి వచ్చినట్టు, "ఆ... ఆ... అప్పుడు సమ్మెకి మేమేమి సమ్మె నోటీసులు ఇవ్వలేదు మేం ఎప్పుడన్న సమ్మె చేస్తె బాహాటంగా, లీగల్‌గా, సమ్మె నోటీసులు ఇచ్చి మరి చేస్తమండి మాకు ఇటువంటి చాటుమాటు పనులు చేతకాదండి" అన్నాడు, కుడిచేత్తో మెడ మీద నరాలను తీరుకుంటు,

"విన్నావుకదా యూనియన్ వాళ్ళు చేయనప్పుడు ఇక సమ్మె చేయించిందెవరు, అంటె మీరె, రాడికల్స్" ఆఖరి మాట కోపంతో వొత్తి పలుకుడు.

సర్కిల్, లీడర్, ఇద్దరు అవునన్నట్టుగా తలాడించిండ్లు.

నాకిక వొళ్ళు మండి పోయి, "అవును మేం రాడికల్సమే మాకు అప్పుడు అన్యాయం జరిగింది. దాన్ని వ్యతిరేకించటానికి కార్మికులంత సిద్ధమయ్యి సమ్మె చేద్దామన్నరు, అందరం బాగా ఆలోచించి సరే అంటె సరే అనుకున్నం అందరితో

పాటు నేను పాల్గొన్నాను. ఆ సమ్మెకు నేనే కారణం అనటంలో అర్థంలేదు అసలు కారణం మీరు, అంటే మేనేజిమెంటు కార్మికులకు "జామ్"లు సప్లయి చేయాల్సిన బాధ్యత మీది. మీ పని మీరు సక్రమంగా చేయలేదు. అదెపాయెనని మేమే అక్కడిక్కడ తుంటలు ఏరుకొని పని చెలాయిస్తుంటె, ఆలస్యమైందని మాతోటి పన్జేసె కార్మికునికి డిస్మిసల్ చార్జిషీట్ ఇవ్వటానికి సిద్ధపడ్డరు. తప్పు చేసేది మేనేజిమెంటు, శిక్ష ఏమో కార్మికునికి ఇదేం అన్యాయమని మేమంత వ్యతిరేకించి సమ్మె చేసినం. అందరితో పాటు నేను కల్సినా ఇందులో నా ఒక్కని ప్రమేయమేముందీ ఆ రోజు సమ్మె చేసినందుకె డిస్మిస్ చేయదల్చుకుంటె ఆ రోజు సమ్మెలో పాల్గొన్న కార్మికులందర్ని డిస్మిస్ చేయండి. మీరు అధికారులు కదా అని ఇష్టమొచ్చినట్టు ఎవర్నిపడ్తె వారిని ఏదో కాగితం ముక్క చేతికిచ్చి డిస్మిస్ చేస్తాసం. ఇక పన్లోనుండి ఎల్లిపొమ్మంటే ఎల్లిపోవటానికి నేను సిద్ధంగాలేను", అంటు కోపంగా కాగితాన్ని టేబుల్ మీద విసిరి వెనక్కి తిర్గి వచ్చేందుకు సిద్ధపడ్డా.

"సిద్ధంగా లేకుంటే నువ్వు ఏం చేసుకుంటవో పోయి చేసుకో, కోర్టులో కేసుపెట్టుకుంటవో, సమ్మెలే చేసుకుంటవో పోయి చేసుకో ముందైతే ఆ కాగితం తీసుకొని బయటికి నడువు" అన్నాడు, కోపంగా కుర్చీ లోంచి లేచి.

ఇక అక్కడ ఏం లాభంలేదనుకొని బయట పడేందుకు వెనక్కితిర్గి ఒక్క అడుగు, వేసానోలేదో, సర్కిల్ కుర్చీలోంచి లేచి వచ్చి హఠాత్తుగా నారెక్క పట్టుకోని, అటు ఎటు పోతనవు, ముందు స్టేషన్‌కు పద, అంటు గుంజేసి పోలీసులను పిలిచి లాక్కొచ్చి వ్యాన్‌లో కూసుండ బెట్టుకొని ఇగ్గో ఇక్కడికి తీస్కవచ్చిండ్లు, అంటు ముగించిండు.

"ఇక ఆ తర్వాత" అంటు రామలింగు చీలి పోయిండు.

చంద్రయ్య ఏం బదులు పలకలేదు.

"అంతా మామూలె మా అందరికంటె దెబ్బలు ఎక్కువనె కొట్టిండ్లు అయనైతే ఎట్ల భరించిండోకాని, నేనైతే ఆ దెబ్బలకు పిడాతపాణం వదలబొయ్న". అన్నాడు పక్కన కూచున్న బర్రి ఐక్కని యువకుడు.

రామలింగు బాధగా నిట్టూర్చి, "మాకు నిన్ను అరెస్టు చేసిన సంగతి తెల్వక

పాపమే ఏమో ఎందుకు పిల్చాడో ఏమో అనుకుంటిమి బాయి దొరలు మరి చెల్లింపు కుంటాండ్లు "నిజమె" అన్నారెవరో.

అర్ధం ఆరు అడుగులు నిలువు పన్నెండు అడుగులున్న ఆ యిరుకు లాకప్‌లో మొత్తం పదహారు మంది ఉన్నారు.

దాదాపుగా కొద్ది హెచ్చు తగ్గులతో అందరి పరిస్థితి ఒక్కలాగే ఉంది పన్నెండు సంవత్సరాల ,శీను నుండి తలంతా నెరిసిన ముసల పోషాలు వరకున్నరు.

పోలీసులు కొందరికి రాడికల్స్ అని ముద్ర వేస్తే మరి కొందర్ని వారిని ఆశ్రియమిస్తున్నారని, అన్నం పెడుతున్నారని తీసుకవచ్చిండ్లు ముసలి పోషాలు కొడుకు నక్సలైటని ఇంటి మీద దాడి చేస్తేవాడు దొరకలేదని కండ్లు కూడా సరిగా కనిపించని పోషాలును తీసుకొచ్చి లాకప్పులో వేసిండు. అతనికిదంతా ఏం తెలియదు పాపం నాల్గురోజులనుండి పోలీసులు పెట్టిన ఉడికీ ఉడకని నీళ్ళచారు కలిపిన బోజనం పడక రెండు సార్లు వాంతి చేసుకున్నాడు. అసలుకె ముసలి ప్రాణం దాంతో మరింత నీరసించిపోయాడు. ఎన్నో ఏండ్లుగా మొద్దుబారి పోయిన అతని శరీరంలాగే అతని అలోచనలు కూడా మందగించినయి. ఈ పరిస్థితిని అతను అర్థం చేసుకోలేకపోయడు అతనింత ఆలోచించినా తన కొడుకేం తప్పు చేసాడో అర్థంకాలేదు. చివఃకి పోలీసు లెందుకు తన్నిలా ఇబ్బంది పెడుతున్నది అర్ధంకాలె అతనికి అలలు అలలుగా తను బ్రికిన బ్రితుకు గుర్తుకొచ్చింది. ఎక్కడో పచ్చపొలాలు అరక ఊరు ధొం ఎట్టి మాదిగ బ్రితుకు చాలిచాలని గడకముద్దలు కలగాపుల్గగంగా కన్పించసాగినయి. మళ్ళి అంతలోనే ఏదో అందోళన సమ్మెలు కొట్లాటలు పోలీసులు గుర్తుకొచ్చిండు జీవితంలో ఎన్ని ఆటు పాట్లు తిన్నాడని వెనక్కితిర్గి చూసుకుంటె అదంతా ఒక పీడకలలా గుర్తుకు రాసాగింది. చివరికి ఎట్టి బతుకు బతక లేక కొడుకు కాలనీలో పన్చేస్తాం దని తెల్సినా బ్రితుకిల్లకున్నా అతను ఊరు విడిచి కాలు బయట పెట్టలేదు. పుట్టి పెరిగిన ఊరి మీద మమకారం కాప్కు చేతులు అడినంత వరకు చావలేదు. కండ్లు సరిగా కానరాకున్నా కట్టె చేత పట్టుకుని దొర పశువులను కాసిండు. ఓః రోజు అడిపిలోకి పశువులను తోలుకపోతే కండ్ల సరిగా కానరాని పోషాలు కండ్ల కప్పి మంచి వయసులో ఉన్న లేగ దూడ, పులి కొట్టింది దాంతో దొర మండిపడి ఫన్లొంచి

సేసుదేకాదు సచ్చిన లేగదూడ క్రింద ఏడుకు ఇవ్వాల్సిన కూలి కూడ ఇవ్వలేదు. ఇక దాంతో తిండికి కటకట అయి బుక్కెడు కూడు కోసం పుట్టిపెర్గిన ఊరి మీద మమకారం చంపుకొని కాలనీలో పన్జేస్తున్న కొడుకు దగ్గరికొచ్చింది గుర్తుకొచ్చింది. ఆ తర్వాత ముసలి పోషాలుకు ఏం జ్ఞాపకం రాలేదు. ఎదురుగా ఉన్న రామలింగును చూసేసరికి ఎందుకో అతని కొడుకు రాజం గుర్తుకొచ్చిండు. మాట పలుకు లేకుంద వచ్చి దగ్గరగా కూసున్నడు పులుకు పులుకున చూస్తూఉండి పోయిండు. ఉండి ఉండి అతను తన బొక్కెనోరు తెరచిండు.

అంత వరదాక వాళ్ళల్లో వాళ్ళ ఏదో మాట్లాడుకుంటున్న వాళ్ళల్లా ముసలాయన నోరు తెరిచేసరికి వాళ్ళంత ఆశ్చర్యపోయారు, ఎందుకంటే ఈ నాల్గురోజుల్లో ముసలి పోషాలు మాట్లాడిందేమీలేదు ఎవరన్నా ఏదన్నా అడుగుతే అవునోకాదో అనేందుకు అ....హా......అనటం తప్ప మరో మాట మాట్లాడి ఎరగడు. చివరికి పోలీసాల్ల ప్రశ్నలకు కూడా అవే జవాబు ఇక దాంతో వాళ్ళు విసిగిపోయి. తీసుకొచ్చి లాకప్పులో వేసిండ్లు అప్పటి నుంచి ఓ మాట లేదు. ఇక ఆ ముసలోన్ని గురించి పోలీసాల్లు పట్టించుకున్నాడులేదు.

పోషాలు మాట్లాడసాగిండు ఒక్కొక్కమాటే అదీ కూచినట్టు “ఊరిమీద మహమ్మారి పెద్దతల్లి అయింది. బిడ్డా దానికంట్ల నజరుగా ఏమల్లందర్ని మింగేస్తాంది. ఇండ్లకు ఇండ్లనెకా లేచి యిస్తాంది. ఊళ్ళకు ఊళ్ళే పోతనయి. అంత ఆసం అగన అయిపోకండ్లు పెద్దతల్లి పోవాలంటే పెదదేవరకు కొలువాలె. పెద్ద దేవరను కొలువా లంటే బలికావాలె బిడ్డా “బలి” అన్నాడు. ఎటు చూసుకుంటూ ఆ మాటలను వాళ్ళకు అర్థమైయిందో ఏదో కూడా అతను పట్టిరాసుకోతె.

ముసలోడు ఏదో అన్నడనుకున్నరు వాళ్ళంతా ఒక్క చంద్రియ్య “నిజమే పెద్దయ్యా” అంటూ తలాడించి గునిశిండు.

అంతలోకి జీబు చప్పుడైంది ఆ చప్పుడిని సర్కిల్ ఇన్స్పెక్టర్ వస్తున్నాడని గ్రహించారంత ఎవరేం మాట్లాడలేదు. ఎవరి ఒళ్ళే మళ్ళీ హునం కాపడం స్పృహలేని పరిస్థితిలో తీసుకొచ్చి లాకప్పులో పడేయటం ఇదేం కొత్త కాదు. అందుకే వాళ్ళంతా ఒక విధమైన భయంతో చీరిపోయిండ్లు. రామలింగుకు పట్టకపోయిన రాత్రి ఇంటి

కొడ రామలింగు భార్య రాజమ్మ ఇద్దరు పొల్లగాండ్లతోని ఒక్కతే ఉంది. చిన్న గుడిసె ముందు కాస్త ఖాళీ స్థలంలోనే వాకిలి... వాకిట్లో అంటేనే బొగ్గుపొయ్యి ఉంది. చీకట్లో బొగ్గుపొయ్యిలోని నిప్పుగల్లలు ఎర్రగా నిగనిగలాడుతున్నాయి. పొయ్యి మీదున్న కుండలో నీళ్ళు సలసలకాగుతు ఆవిర్లు చిమ్ముతావుంది. ఆయన వచ్చేటాల్లకు ఎట్లాగు అర్ధరాత్రి వుతుందని గుడిసెతన్న రేకు తలుపుగొళ్ళెం వేసి నేలమీద చాపపరుచుకుని దానిమీదో పాత చీర వేసుకుని నిదురపోయింది. అలా నిదురపోయిన రాజమ్మకు హఠాత్తుగా ఓ అర్ధరాత్రి తెలివి వచ్చింది. గుడిసెలో దీపపు గుడ్డి దీపం గాలికి రెపరెపలాడుతు గుడిసంత మసక వెలుతురు చిమ్ముతూ ఉంది ఒక వైపు నులక మంచంలో అడ్డందిడ్డంగా నిదురపోతూ ఇద్దరు పిల్లలు కనిపించిండు ఆయనింకారాలేదు. అంటే వచ్చి యాల్ల కాలేదేమో అనుకుని మళ్ళీ నిదుర కుపక్రమించేదల్లా ఎందుకో అనుమానం లేచి యాల ఎంతయిందో ఏమో అనుకుంటూ గుడిసి తలుపు తీసి బయటకు వచ్చింది. ఊరంతా సద్దుమనిగి చాలసేపయినట్టుంది. ఏ అలికిడి లేదు. ఆకాశంలోకి చూసింది తూర్పున గోరుకొయ్యలు కనిపించినయి. వాటిని చూసేసరికి ఆమె భయంతో వణికింది. గొరుకొయ్యలు పొడిచినయంటే ఇం జామైతే తెల్లారుతది ఇంత రాత్రి దాక ఆయన రాలేదంటే ఆమె మనసు కీడు శంకించింది. కళ్ళ పొంటి నీళ్ళు కారినయి. ఆమె గుండెలో హఠాత్తుగా రాయిపడ్డట్టయింది. ఏమయింది ? ఆయనెందుకు ఇంత రాత్రిదాకరాలేదు. ఎప్పుడు ఇంత రాత్రిదాక రాకుండా ఉన్నది లేదు. ఎందుకురాలేదు ఇంత రాత్రి ఎవర్ని అడగాలి అని ఆమె గాభరాపడిపోయి కాసేపు ఇంట్లకు వాకిట్లకు తిర్గింది, పక్కింటి మల్లన్నది ఆయనది ఒక్కటి షిఫ్టు మల్లన్న వచ్చిండోలేదో. ఆయన్ను అడుగుత ఏ సంగతి తెల్వవచ్చు ఇంత రాత్రిపోయి లేపాల్నా వద్దా ? గుంజాట పడ్తానే వాకిట్ల దడి లేసుకొని పోయి పక్కింటి వాళ్ళ తలుపు తట్టింది "మల్లన్నా ఓ మల్లన్నా పిలిచింది మంచి నిదుర ఉన్నారేమో ఎవరు పలుకుతలేదు." "ఈ రమ్మ వదినా ఈ రమ్మ వదినా" అంటూ మల్లయ్య భార్య పిలిచింది.

"ఎవరు" అంటునే మల్లన్న తలుపు తీసి వాకిట్లోకి వచ్చిండు.

"నేనె అన్నా" అంది దాదాపుగా ఏడుపు గొంతుకతో

"రాజక్క నువ్వు చెల్లె ఎమైంది" అన్నాడు అతను కంగారుపడతు.

"సెకండ్ షిఫ్టుకు పోయినాయన ఇంకారాలేదు. ఎందుకో ఏమో నాకు భయంగా ఉంది" అంది.

మల్లయ్య తేలిగ్గా నిట్టూర్చి "ఎందురాలెదో ఏమో చెల్లె బాయి మీద అయితే అంత బరాబరి ఉంది. బహుశా అలస కొచ్చి అక్కడే పన్నడో ఏమో" ఇంత దూరం ఎం నడిచి పోవాలని అన్నాడ్. అవో అన్నాడె కాని అతనికి అనుమానంగానే ఉంది. ఎందుకరాలెదప్పా అని ఈరమ్మ వచ్చి గల యల్ల నిలుచున్నది.

"ఇదివరకెప్పుడు పనిపోయినోడు రాకుండాలేదన్నా మరిప్పుడు ఎందుకు రాలేదో ఏమో ఆమె గొంతులో సన్నగా ఏడ్పు వినిపించింది.

"నువ్వేమి ఫికరు పడకు రాజక్కా ఇంకో గంటా రెండు గంటలో అయితే తెల్లారతది నేను బాయి మీదికి తెల్సుకున్నగాని నీవు పోయిపండుకో !! అన్నడు.

రాజమ్మ అక్కడి నుంచి ఇంట్లకి వచ్చింది ఆమె కంటి మీద రెప్పపడలేదు, ఆమె ఎప్పుడు తెల్లారుతదా అని గడియలు లెక్కపెట్టు కూచుంది. మాటి మాటికి బయటికొచ్చి వెలుగు వచ్చిందో లేదోనని చూస్తుంది.

ఉదయం ఐదుగంటలకు ఎందరో పెద్దగా శోకం పెట్టినట్టు మొదటి విజిల్ వినిపించింది అప్పుడు మల్లయ్య రామలింగును వెతకటం కోసం బయలుదేరి మొట మొదట రామలింగు గాంగులో పన్జేసె పకీరయ్య ఇంటికి పొయిండు. అప్పటి ఫకీరు లేవలేదు. ఆయన్ను లేపి అసలు సంగతి ప్రస్తావించేసరికి ఫకీరు నిదరమొ ఆవలించి చిన్న పెసల్లాంటిగడ్డాన్ని తేరుకొని "అదే ఎందుకురాలే అని ఆశ్చర్య రాత్రి ఇక పైకి ఎక్కుతమనకునెటాల్లకు టాక్రిక్రైన్ సరిగాలేక బర్తీలు ప కొట్టినయి. వాట్ని మళ్ళి నింపే సరికి కాస్త ఆలస్యమైంది. అందరం పూగ ఎక్కినం వెంకటస్వామి రామలింగు ఇద్దరు కల్సి ఇంటి దారిపట్టంగ నేను చూ మరి ఇంటికెందుకు రాలేదు.." అన్నాడు.

"వెంకటస్వామి అంటే" మల్లయ్య అడిగాడు "రామలింగు పైలుదారు ఇద్దరు కల్సి బయలుదేరిండ్లు ఆయన్ని అడుగుత ఏ సంగతి తెలుస్తది" పకీరు

"ఎక్కడుంటడ" మల్లయ్య బూడిదగడ్డ బస్తీలని తెలుసుకొని వాని గుడిసె ఎక్కడుంటదో నాకైతే పూరాగ తెల్వది" అన్నాడు పకీరు చేతు వెల్లెలు కంవే

అక్కడ నుంచి మల్లయ్య బూడిదగడ్డ బస్తీ కి పోయిండు. ఆ యిల్లు ఈ ఇల్లు అడుక్కుంటు మొత్తానికైతే వెంకటస్వామి ఇల్లు దొరకబట్టిండు.

మల్లయ్య చెప్పిన మాట విని వెంకటస్వామి అరె మేం ఇద్దరం కల్సి రోడ్డుదాక వస్తిమి అక్కడ నుండి నేను మా బస్తీ కొచ్చిన రామలింగు ట్రాకలైను ప్రక్క నుంచి కాలిబాటన పోయిండు. ఎటు పోయిండబ్బా పోయి ఎతుకతం పా" అంటు అతను కూడ మల్లయ్యతోని బయలుదేరిండు బస్తీ కి వచ్చె కాలబాట వెంబడి వెల్‌కుంట బయలు దేరిండు మొదటి షిప్టులకు పోయే కార్మికులు అప్పడికె బాయిలమీదికి దారి పట్టిండు. తూర్పున వెలుగు రేఖలు పొడుచుకొస్తున్నయి. తిర్గి తిర్గి వాళ్ళు అండర్ బ్రిడ్జ్ కాడికి వచ్చిండు. ఒకరి మొఖాలు ఒకరు చూసికుంటూ ఎవరేం మాట్లాడ్తలేదు. వెంకటస్వామికి నాయ్ హోటల్ ముందు హన్మంతరెడ్డి కనిపించిండు. ఆయన్ను చూసేసరికి పాణం లేచివచ్చినట్టయింది. ఆయన వాడ మీద పెద్ద మనిషిని కష్ట సుఖం తెల్సినవాడని వీలైతే నల్లురికి మేలు చేయాలని చూసి బాపతేగాని కీడు మాత్రం తలపెట్టడని ప్రతీతి ఆయన దగ్గరికి పోయి వెంకటస్వామికి రామలింగు కనిపించని విషయం ప్రస్తావించిండు.

మొదట స్వామి చెప్పింది సాంతంగా విని అతనికి ఎటు పాలుపోలె ఈ మధ్య రాత్రి పూట డ్యూటీ నుండి తిర్గి వచ్చె వాల్లను పోలీసు పట్టుకుపోతున్న సంగతులు అతనికి ఆ నోటా ఆ నోటా విన్పిస్తుంది. అదే యావతాని "బహుశా రాత్రిపూట వస్తాంటే పోలీసులు పట్టుక పాయారేమో ఎందుకైనా మంచింది పోలీసుస్టేషన్‌కు పోయి తెల్సుకొండ్లి ఉంటే అక్కడ ఉండవచ్చు లేకుంటే తప్పిపోయి నట్టయినా రిపోర్టు ఇవ్వవచ్చు "అంటూ సలహా చెప్పిండు.

ఆయన మాట నిజమే అన్పించింది. "సరె అక్కడికి పోయి వస్తాంరుద" అన్నడు వెంకటస్వామి మల్లయ్యతోని.

మల్లయ్య కొద్దిగా ఎనక ముందాడిండు పోలీసులతోని యవ్వారమంటె పాముతోని చెలగాటు ఆయన నలుబై ఎండ్ల బ్రతుకుల ఎప్పుడు పోలీసుస్టేషన్ పోయిన పాపాన పోలేదు. దాంతో తప్పించుకునెందుకన్నట్టుగా "సువ్వో పోలీసు

స్టేషన్‌కు పోయి పాపాన పోలేదు. దాంతో తప్పించుకునేందుకన్నట్టుగా "సువ్వాసారి పోలీసుస్టేషన్‌కు పోయి చూసిరా ఇంటికాడ రామలింగు భార్య ఎంత వైరాన పడిపోతుందో నా కోసం ఎదురు చూస్తాంది కావచ్చు పోయి ఏ సంగతి చెప్పాలి కదా" అన్నాడు.

వెంకటస్వామికా మాటలనే సరికి కోపం నొచ్చిందె "అంత పిరికోడివతై నువ్వేం బ్రితుకుతవు వాళ్ళేమన్నా చంపుక తింటరా" అన్నాడు.

అట్లయితే అన్నాడు కాని పోలీసుస్టేషనుకు పోవాలంటె ఆయనకు కూడా భయంగానె ఉంది. కాకిబట్టలోల్లు ఈ మధ్య మరి చెల్లించుకుంటాండు ఓ వరస వాయిలేదు న్యాయం అన్యాయం లేదు. ఊళ్ళకు ఊళ్ళను వాడలకు వాడలను తోలుక పోయి పందుల సంఖ్యల గొడ్డును బాదినట్టు బాదుతొండ్లు ఇదేం మని అడిగేటాడు కరువైల్లి మొన్నటికి మొన్న అదేదో బందు జరిపిండ్లని వాడమీదికొచ్చి వాడలోని మొగొల్లందర్నీ తీస్కపోయి వారం రోజులు చావు బతుకు ఎరుగక తన్నిన సంగతి గుర్తు కొచ్చింది. అప్పుడిదో అదృష్టం బాగుండి ఆ రోజున స్వంత ఊరుకుపొబట్టి తప్పిపోయిండు లేకుంటె తనకని అయ్యేది అనుకున్నాడు.

మల్లయ్యేం మాట్లాడక పోయేసరికి "వెంకటస్వామికి మళ్ళీ ఇలా అన్నడు" అంతగనం భయమైతే ఎవన్నన్న లీడర్ను వెంటబెట్టుకుని పోదాం. ఏ సంగతి తెల్సుకోక పోతే వాళ్ళ ఇంటికాడ ఎంత బాధపడిపోతరు. లీపు మనకి ఇంట్ల కా[illegible] అన్నాడు.

వెంకటస్వా మాటలు, మల్లయ్యకు కొంత సబబె అనిపించింది. కాని ఏ లీడ[illegible] దగ్గిరికి పోవాలి అని ఆలోచన్ల పడ్డ. "మరి నాకైతే ఏ లీడరు తెల్వదు. నీకు తెల్సి[illegible] లీడరెవరన్నా ఉంటే పద ఆయన్నికల్సి స్టేషనుకు పోదాం" అన్నాడు చివరికి.

"సరే ఎవడో ఒకరు దొరక్కపోడు.. నాతోరా" అంటూ మల్లయ్యను వెంట బెట్టుకొని బస్తి కొచ్చిండు.

బస్తితో ఉన్న RMP డాక్టరు సదాచారి ఇంటి దారి పట్టిండు. డాక్టరు సదాచారికి నలభై ఏండ్లుంటాయేమో మనిషి కండపట్టి దున్నపోతులా ఉంటాడు. వృత్తి బాగానే నడుస్తుంది, దానికితోడు చిట్టీలు నడిపిస్తడు. ఇక మిత్తిలకిచ్చిన

మొత్తానికైతే బాగానే సంపాదించిండు. యాడాది క్రింది వరకు కాంగ్రెస్‌లో ఉండె టోడు. ఈ మధ్య రాష్ట్రం మొత్తం తె గుదేశం గాలి వీస్తుంది. ఇక పాతదాన్లో పసలేదని తెలుగుదేశంలోకి పార్టీ ఫిరాయించిండు. మొత్తానికైతే బ్రతక నేర్చినవాడు వేడినీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్టు తన సంపాదనకు తోడుగా లీడరుగిరి ఉంది. దాని వల్ల ఆయన నష్టపోయిందేమీ లేదు. పైగా నాల్గు పైసలు ఆదాయమే ఉంది. పేరుకు పేరుంది. పోలీసోల్లతోని లావాదేవీలున్నాయి.

డాక్టరుగారి కొత్తగా కట్టించిన బంగ్లాకాడికి వచ్చిండ్లు. దాఖఖాన్ల అంతగా మందిలేరు. ఆయన కూర్చున్న కుర్చీకి తలమీద ఫ్రేం కట్టించిన అన్నగారి నిలువెత్తు ఫోటోఉంది. వీళ్ళ రాకచూసి ఎంతవేరదాక పేపరు చదువుతున్న వాడల్లా పేపరు మూసి ఏంటన్నట్టుగా చూసిండు.

వెంకటస్వామి మల్లయ్య ఇద్దరు ఒక్కసారే నమష్కారం పెట్టారు. డాక్టరు గారు ప్రతిగా చెయ్యెత్తి... కూచోమన్నట్టు ముందున్న బెంచిలేసి చెయ్యి చూపిండు,

వెంకటస్వామి మెల్లగా సంగతంతా. చెప్పుకొచ్చి దయచేసి మీరు ఎట్లయినా మా వాన్ని విడిపించుకు రావాలీ "అన్నాడు చివరగా"

"ఇంతకు అతను పోలీసు స్టేషన్లోనే ఉన్నాడని నమ్మకమెంటయ్యా. ఎటు పోయిండో ఏమో మనకెట్టా తెలుస్తది" అన్నాడు మాటవరసకు.

" దు సార్‌వాడు ఎటుపొయెటోడు కాదు రాత్రిపూట ఆలస్యంగా వస్తోంటే పోలీసులె పట్టుకపోయి ఉంటరు" అన్నాడు మల్లయ్య ఖచ్చితంగా.

వెంకటస్వామి కూడ "అంతె అయిఉంటుంది సార్ పెండ్లాం పిల్లలున్నాడు ఉన్న పళంగా ఎటు పోరాడు.

డాక్టరు చివరికి "సరే మీరు అంత గనం అంటాండ్లు కదా ఓ సారి పొయ్యి అయితే చూసి వస్తాను. అంత వంరాక మీరు ఇక్కడె ఉండండి". అని స్కూటర్ స్టార్టు చేసుకుని పోలీసు స్టేషనుకు పొయిండు. అలా వెళ్ళినవాడు అర్ధగంటకు కాని తిర్గిరాలేదు. వచ్చి రావటంతోనె హడావిడి పడిపోతు పోలీసు స్టేషన్లనె ఉన్నాడు కాని మీ వోడు రాడికలంటకోదా ? పైగా మీవోని దగ్గర కరపత్రాలు కూడా దొరికినవట.

పిశ్చత్త పుణ్యానికె వదిలిపెట్టతపోలేదు. చివరికి నేను పోయినా కూడా నీకు ఈ వాడకలోనికి ఏంటి సంబంధం అంటూ నిలదీసిండ్లు ఇది నావల్ల కాదయ్యఅన్నాడు

"ఆదేంటి సారు మీరు అట్లా అంటే ఎలా ? మా వానికి ఏ పాప పుణ్యం తెల్వదు ఉత్త అమాయకుడు వాని పనేందో వాడు తప్ప ఇతరుల జోలి పట్టించుకునె టోడుకాదు అటువంటోన్ని పట్టుకుని మీరు అట్లా అంటరసారు" అని మల్లయ్య బాధగా నిటూర్చిండు.

"నేను కాదయ్య అనేది పోలీసులంటాండ్లు ఇటువంటి కేసుల మాట్లాడటోన్ని కూడ లోపలేసి తంతరు తెల్సిందా" అన్నడు డాక్టరు కోపాన్ని ప్రదర్శిస్తూ.

"మీరె ఏదో ఒకటి చెయ్యండిసారు. పాపం పిల్లలు కలోడు వెంకటస్వామి బతిమిలాడిండు.

"ఏదో నీవు తెల్సినోడివి ఇంతగనం అంటానవు అని నెనైతే ఉత్తగానేపోయి వచ్చిన కాని పోలీసాల్లు మనలాగుంటరా ? అంతో ఇంతో ఆశపడెడంటరు. వాళ్ళకేదో ముట్టచెప్పకుంటె వదిలిపెట్టెది కష్టం లేకంటె ఏదో కేసు పెట్టి జేలుకు పంపిస్తరు అలా ఎంతమందిని పంపింశలేదు" అంటూ డాక్టరు నిర్లిప్తంగా మాట్లాడినా జవాబు కోసం ఆతృతగా ఎదురు చూసిండు.

"పైసలేమన్నా ఖర్చయితే పెట్టుకుంటరుసారు" వెంకటస్వామి.

"అట్లయితే ఏమన్న ప్రయత్నం చెయ్యవచ్చు" అన్నడు డాక్టరు తేలిగ్గానిట్టూర్చి "ఎంతయితది" మల్లయ్య ఆ ఎంత, ఎక్కడ, ఒక వెయ్యన్నా కావాలి లేకుంటె పోలీసాళ్ళు ఇయ్యల రేపు మన మాట వినరు" అన్నడు.

"వెయ్యంటే ఎట్లసారు చేసుకుంటె బ్రతికెటోడు ఉత్త పుణ్యానికి బట్ట కాల్చి మీదేసినట్టయింద ఎదో తమరె దయదలచి ఐదువందలకు చేసుకోండి" అన్నడు మల్లయ్య ప్రాధేయపడుతు.

"అరె నాకిస్తానవయ్యా పోలీసాళ్ళ వ్యవహారమంటె అంతె మరి" అంతకు తగ్గేది లెదన్నట్లుగా అన్నడు.

చివరికి వెంకటస్వామి అట్లయిట్లా చేసి ఆరువందలకు కుదిర్చిండు.

ఇక అక్కడ నుంచి మల్లయ్య ఇంటికొచ్చి రాజక్కతోని సంగతంత చెప్పిండు.

దాంతో ఏం చెయ్యాలో తోచక రాజక్క శోకాలు తీసింది. ఏడుస్తూనే కాసేపు ఊరుపేరు లేకుంటా దేవునింట్ల మన్నుపొయ్య అష్టమ్మ కష్టాలు తెచ్చిపెట్టిండు వాడినేమి అన్యాయం చేసినం శోకం తీసింది మరికాసేపు పొలీసోల్లను తిట్టింది. కాసేపు ఎర్రిపాపులు చూసి నెత్తి నోరు బాదుకుంది ఎంత ఏడ్చినా అర్చినా ఇంట్ల ఒక్క చిన్న కోత్త కూడా లేదు. ఉన్న పళంగా ఆరువందలు తేవాలంటే ఎక్కడికని పొయ్యేది కాసేపు పొల్లగాల్లనా దగ్గరికి వేసుకుని ఏడ్చింది పిల్లలకు ఇదేం అర్థంకాక బెదిరిపోయి వాళ్ళు పడ్చిండ్లు.

ఇంటి పక్కవాళ్ళు వాడకట్టువాళ్ళు అంతా గుమికూడిను ఆ తల్లి పిల్లల ఏడ్పులకు ఆడవాళ్ళు కూడా కన్నీళ్ళు కార్చిండు.

చివరికి రాజమ్మ పెండ్లినాడు తల్లిగారు పెట్టిన కాళ్ళ కడియాలు తీసిఇచ్చింది వాట్ని తీస్కపోయి అమ్మి దీసుకొచ్చేందుకు మల్లయ్య బయలుదేరిండు.

ఎట్లయితే ఆరెన్టు అయి రెండవనాడు రామలింగు ఇంటికొచ్చిండు మళ్ళీ ఎప్పటి లాగా శోకాలు రాజక్క శోకం పెట్టింది. ఏడ్చి ఏడ్చి దమ్ముకొచ్చి ఆగిపోయింది.

రామలింగు రెండు రోజులదాక మనిషికాలేదు. వాళ్ళెంత పచ్చిపుండు తీర్గఅయి ఆ రెండు రోజులు జర్వము వచ్చి వొళ్ళు వెచ్చ చేసింది.

నాల్గోనాడు వొంట్లో ఇంకా నలతగాఉన్నా ఫస్టు షిఫ్టులో పనికి పోయిండు. ఎన్ని కష్టాలొచ్చిన పనిమాత్రం చెయ్యాలి లేకుంటే బ్రతికేదెట్లా. నాలుగేండ్ల క్రిందట బాయిపనికి వచ్చినప్పుడు కష్టాలు గట్టెక్కుతయని తానెంత సంతోషపడ్డడు. ఆ సంతోషమంతా పేకమేడలా కూలిపోసాగింది. రోట్లోమించి పెనం మీదికి వచ్చి నట్టయింది బ్రతుకు. అక్కడ పల్లెటూళ్ళో బతికిన బ్రతుకులు గుర్తుకొచ్చింది. ఏనక్క చూసుకుంటేముంది. పల్లెటూర్ల దొరల పెత్తనం కూలి పెంపుకోసం చేసిన సమ్మెలు పొలీసులు దెబ్బలు గుర్తుకొచ్చినయి. వాట్ని తప్పించుకోవటం కోసం ఉన్న ఇల్లు జాగ అమ్మి నాలుగు వేలు అప్పయితే చేసి కష్టాలు గట్టెక్కుతయి కదా అని బాయి పనికి వచ్చిండు. కానీ ఏమైంది. అక్కడ ఊరి దొరలు ఇక్కడ బాయి దొరలు. అక్కడ పోలీసులు ఇక్కడ పోలీసులు. అక్కడ తన్నులు గుద్దులు ఇక్కడ అంతె ఎక్కడికి పోయిన ఒక్కటె తంతు. ఇదంత రామలింగుకు ఏం అర్థం కావటంలెదు.

బాయిమీద తెల్సిన తోటి కార్మికులంతా సానుభూతిగా పలకరించిండ్లు. అలా పలకరించిన వారిలో చాలామంది అప్పుడో ఇప్పుడో నిర్బంధాన్ని చవి చూసినవారే. వారిలో ఆనంద్ కూడా ఉన్నాడు. ఎర్రగా బక్కపల్చగా ఉండే ఆనంద్ వచ్చి ప్రేమ పూరితంగా భుజంమీద చెయ్యేసి. "దుష్ట కాలమొచ్చింది. రెక్కలు ముక్కలు చేసుకుని పన్జేసెటోడు దొంగయి పోయిండు. వాన్ని బ్రతకనియ్యరు వాని రక్త మాంసాలు పిండుకుని ఆస్తులు పోగుచేసికునెటోడు దొరయిపోయిండు. సచ్చేంతకాలం వాడు ముక్కుతు మూల్గుతు పన్చేయవలసిందె, ఎప్పుడైన భరించలేక ఇదేందీ అంటే అది తప్పయిపోతుంది. తుపాకులేసుకొని పోలీసులొస్తాండ్లు ఎదురు తిర్గితే కాల్చి పారెయ్యటానికి సిద్ధమయితండ్లు దొంగలు లంగలు రాజ్యమేలుతండ్లు, కష్టం చేసుకుని నీతిగా బ్రతికెటోడు దొంగలు పోతండ్లు. అంత రాబందుల రాజ్యమైపోయింది ఆవేశంలో మాటలు రాక అతని గొంతు పెకలలేదు,

చుట్టూ గుమిగూడిన కార్మికులకు అది నిజమే అన్పించింది. అప్పటికి సమయం మించి పోతుందని బరువైన గుండెలతో కార్మికులు బావిలోకి దిగిపోయారు.

ఆ రోజు పనిలో రామలింగు చాలీగాక సరిగా చెప్పలేకపోయిండు పోలీసోల్ల దెబ్బలకు వొళ్ళు నొప్పులింకా తగ్గక తట్టెత్తుకునేటాల్లకు జబ్బలు పట్టినయి కాళ్ళు ముందుకు సాగలేదు. అతని అవస్త చూసి తోటి కార్మికులు సానుభూతిగా "నువు కాసేపు కూచో అన్నా, అని పన్చేస్తుంటే వారించి మనిషో తట్టయితే పోసి ఆ రోజుకు రామలింగు బాపతు డబ్బులు నింపిండ్లు.

డ్యూటీ నుండి తిర్గి వస్తాంటే ఎప్పటిలానె వెంకటస్వామికి వెంటవచ్చిండు కాని ఏం మాట్లాడకుండానే మౌనంగా నడవసాగిండు. అతను ఏదో చెప్తాడని గుంజాటన పడసాగిండు. రామలింగు కూడ అలిష్టకొద్ది ఏం మాట్లాడలేదు.

ఇద్దరు రోడ్డు మలుపున చెరోదారిన చీలిపోయి కాడికి వచ్చిండ్లు వెంకటస్వామికి ఒక క్షణమాగి "రామలింగన్నా ఇవాళ సాయంత్రం ఎటన్నా పోతానవా అంటూ ప్రస్తావించాడు.

"ఎటున్నది పోవటానికి ఇంటికాన్నే" "సాయంత్రం సింగరేణి కార్మిక సమాఖ్య వాళ్ళ మీటింగు ఉన్నది" వెంకటస్వామి.

సింగరేణి కార్మిక సమాఖ్య మీటింగ్ అనేటాల్లకు రామలింగుకు ఎందుకో భయమైంది నినగాక మొన్ననె ఉత్త పుణ్యానికి పోలీసులు పట్టుకపొయి చితకబాదిన సంగతి ఆరువందల అప్పు, కుటుంబమంత ఆగం ఆగం అయిన పరిస్థితి గుర్తుకొచ్చి "ఏమో ఏ మిటింగులో ఏమో" ఉత్త పుణ్యానికి బట్ట కాల్చి మీదేస్తాండ్లు ఇక మీటింగులు గీటింగులు అంటె బ్రతికెవశమా ఏదో నన్నిట్లా బ్రతకనియ్యి ఇప్పుడిక బుద్ధి వచ్చింది" అన్నాడు.

వెంకటస్వామి రామలింగు మాటలకేమి ఆశ్చర్యపోలే "నిజమే అన్నా బట్ట కాల్చి మీదేసినట్టుంది. పరిస్థితి ఇది వరదాక నీవు ఎందుకొచ్చిన సంఘాలు అంటె ముట్టనట్టు తిరుగుతున్నావు అట్లని నిన్ను వదిలెసిందెముంది గాలిదుమారం లేచినప్పుడు చిన్న చెట్టు పెద్ద చెట్టా ఊగకతనె దింటయి. నాకేమీ సంబంధం లేదు నేను ఊగనంటే ఇక అది కూలిపోవల్సిందె మన పరిస్థితి అంతే మన ఇష్టమున్నా లేకున్నా మన మీద పని ఒత్తిడి పొలీసొల్ల కొట్టుడు తిట్టుడు తప్పుతుందా ?

రామలింగేమీ మాట్లాడలేదు. "ఆలోచించన్నా, మన గురించి మన కష్టాల గురించి ఎవరు పట్టించు కుంటరు మన గురించి మనమే పట్టించు కోకుంటె ఇక మనం బ్రతికిదెట్టా ? ఇక తన్నులు గుద్దుల సంగతంటావా ? వందల సంఖ్యలో కుటుంబాలకు కుటుంబాలనే తీస్కపొయి చితకబాదుతాండ్లు గుడిసెలను పీకి తగలబెడ్తాండ్లు ఒడికి పొయి కాల్చి పిల్లగాల్లను కస్కపొయి కాళ్ళు వేళ్ళు విర్చేసిండ్లు మెరికలాంటి వాళ్ళను పట్టుకపొయి కాల్చి పారేసిండ్లు ఇంత గందరగోళం జర్గుతుంటే మనకేందని ఊకుంటే ఆగాలి దుమారంలో చివరికి మనం కూడా మిగలం" అన్నాడు వెంకటస్వామి.

రామలింగుకు వెంకటస్వామి మాటలు సబబే అనిపించింది కాసేపు ఎటు తేల్చుకోలేక పొయిండు.

"సాయంత్రం వస్తా ఇద్దరం కల్సిపొదాల" అని వెంకటస్వామి సెలవు తీసుకుని వెళ్ళిపొయిండు రామలింగు ఇంటి దారి పట్టిండు.

దీపాలు గుడ్డిపెట్టి చాల సేపయింది రామలింగు ఎటుతోచక వాకిట్లో మంచంలో ఎల్లెంకలుగా పండుకొని ఆకాశంలోని చుక్కలకేసి చూడసాగిండు. రాజమ్మ ఇంట్ల ఏదో పనిలో ఉంది పిల్లలు అప్పటికె నిదురకు ఉపక్రమించారు రామలింగు మనసులో

ఒ సారి ఏదో గందరగోళంగా అంతా అతలాకుతలమైన ట్టుగా, చిందరవందరగా ఆలోచనలు, మళ్ళీ అంతలోకే ఏదో ప్రశాంతత, అంతా సాఫీగా, సద్యంగా ఉన్నట్టుగా సులువుగా ఉన్నట్లుగా తోచింది. వెంకటస్వామి రాకకోసం అతను పదో పదే గలమట్లి కేసి చూడసాగిండు ఇరుకైన గుడిసెల దారులగుండా అటు ఇటు పొయే వాళ్ళు కనిపించిండ్లు ఊరకుక్క ఒకటి తోకాడించకుకుంట వచ్చి అతని కాళ్ళను మురికిచూసి కాళ్ళకట్టకు నడుంవాల్చింది.

మరో పావుగంటకు వెంకటస్వామి వచ్చి పిలిస్తె రామలింగే మారు మాట మాట్లాడకుండా వెంటబయలు దేరిండు.

వాళ్ళు అలాసందులు గొందులు తెర్గి ఊరు చివరికి వచ్చారు. అక్కడొక ముసలాయన పొగరాని చుట్టను కాడలన్ని లోట్టల ఎడంగా పీలుస్తూ వెంకటస్వామిని చూసి పరిచయ పూర్వకంగా నవ్వి అగోగా కనిపించె చింతచెట్టు క్రింది గుడిసే కాడి పొండ్లె అని చెయ్యెత్తి చూయించి మళ్ళీ యదాస్థానంలో కూసున్నాడు.

ఇద్దరు ఆ గుడిసెలోకి అడుగుపెట్టారు చుట్టుతడకలతో పైన కప్పిన ఎక్స్ పొజిప్ అట్టపెట్టె కప్పి ఉన్నాయి సాధారణంగా అక్కడున్న వేలాది గుడిసెల పోలిన ఆ గుడిసెలలో అప్పటికి పదిహేను ఇరువైమంది కార్మికులు జమయి ఉన్నరు. గుడిసె మధ్యలో మినుకు మినుకు మంటున్న చిన్న బుడ్డి దీపం వెలుతురు అస్పష్టంగా అందరి ముఖాలమీదికి ప్రసరిస్తుంది.

ఒక్కసారి కొత్తగా వచ్చిన రామలింగు, వెంకటస్వామిల కేసి చూసి "రాండ్లి ఇంత ఆలస్యమైందేమిటికూచో" అంటు ఒకతను కూచున్న కాన్నుంచి కాస్త జరిగిండు.

ఇద్దరు చతికిలపడ్డారు రామలింగు మెల్లమెల్లగా వాళ్ళు మాట్లాతున్న మాటలు వినపడసాగాయి.

"ఎ రం రోజులాయె చంద్రియ్యను బాయి మీది నుంచి పట్టుకుపోయి ఇంకా కోర్టుకు తీస్కపోరైరి కొట్టి కొట్టి చంపుతాండ్లట చూస్తు ఊరుకోవల్సిందెనా" అసహనంగా కోపంగా గునిగిండు.

మేనేజరు లంజకొడుకు రమ్మని పిల్చి పోలీసొల్లను పిల్చి పట్టిస్తె ఇక మన చూసుకుంట కూసుండుడేనా" ఇంకొకడు.

"మన బాయి మేనేజరుగాడు మరి చెల్లించుకుంటూండు ఏం చూసుకునో ఆ నిక్కుడు.

"అధికారం పోలీసుల్ల అండా"

"వాళ్ళకు పోలీసోల్ల అండ ఉంటే మనకు రాడికల్ అన్నల అండ ఉన్నది మేనేజరుగారికి బుద్ధి వచ్చేట్టు చితక పొడిస్తె గాని బుద్ధిరాదు.

"ఆ... ఆ.... మాటలతోని అయ్యే పనా నాల్లు అంటిస్తె నే గొడ్డి కొడుకు దారికాస్తడు".

"నిజమె ఇదివరకు బాయిమీద వోవరు మెన్లు, సర్దార్లు లంచాలకు మర్గి వాళ్ళ ఇష్టమొచ్చినోళ్ళకు అన్టింగ్‌లు అలిక పనులు ఇచ్చిరి. మంచి పద్ధతికాదు రూల్ ప్రకారము నడుమని చిలక్కి చెప్పినట్టు చెప్తి వాళ్ళు ఓన్నారా ఇక ఇట్లయితే లాభం లేదని లంచాలు అడిగినాన్ని మనోల్లు చితకతన్నిండ్లు ఇక దాంతో వాళ్ళకు బుద్ధి వచ్చి సక్కగుంటాండ్లు.

"గిప్పుడు గట్లనే చెయ్యాలి" ఇట్ల యువకుల మాటలిని ఓ ముసలి కార్మికుడు చసరాదుర్గి మాట్లాడుతె తన్నులు గుద్దులంటరు పిండానికి పిడుక్కు ఒక్కటే మంత్రిమంటరు,

"లేకుంటే మేనేజరుగాడు ఇక ముందుకొచ్చి మాట్లాడి నొల్లందర్ని గట్లనె ఊడపీకి పోలీసులకు పట్టిస్తాంటే చూసుకుంట కూసోవాల్నా" మళ్ళి ఓ కార్మికుడు ముసలి కార్మికుని మాటలకు అడ్డు పోయిండు.

"ఇక గట్లయితే ఈ లొల్లిలెందుకునోరు మూసుకుని పడి ఉండక"

"మనకు రివిజనిస్టులకు తేడా ఉండదు"

"వాడు మనలను డిస్మిస్ చేస్తె వాన్ని కూడా మనం డిస్మిస్ చెయ్యాలి.

"అంటే"

"మామూలె ఒక మేనేజరు లంజకొడుకును సఫా చేస్తె తతిమ్మా వాళ్ళకు బుద్ధి వస్తది అన్నాడతను కోపంగా రెట్టిస్తూ కాసేపు ఎవరేం మాట్లాడలేదు ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒకతను నెమ్మదిగా మాట్లాడ సాగిండు.

"నిజమె బాగా అణచివేతకు దిగిన మేనేజరుకు బుద్ధి చేప్పేందుకు మన ఏదో ఒకటి చేద్దాం. సరే కాని ఆ తర్వాత వచ్చే పరిస్థితి ఎట్లా ఉంటుందో ఆలోచించారా ? ఇప్పటికంటె కూడా పోలీసులు ఇంకా ఆగం ఆగం చేస్తరు నిర్బంధం పెరిగిపోతుంది కాదు కూడదన్న కార్మికుల మీద కాల్పులకు కూడా సిద్ధపడవచ్చు అగో గా వచ్చె నిర్బంధాన్ని తట్టుకునే శక్తి మనకుందా ?" అందరి కేసి పరీక్షగా చూసి మళ్ళీ మాట్లాడసాగిండు, "గోదావరి ఖనిలో ఉన్న మొత్తం బావుల్లో మనకు ఎన్ని బావుల మీద పట్టు ఉంది. రేపు శత్రువు తలపెట్టిన నిర్బంధాన్ని ఎదిరించి మనం ఎలా ముందుకు పోగల్గుతం ఇప్పటికి చాలామంది కార్మికుల ఇంకా నిర్లిప్తంగా అంటీముంట నట్టుగా దింటాండ్రు. ప్రతి బావి మీద మన యూనిట్లు పనిచేస్తున్నాయా అంటె లేదనే చెప్పాలి ఈ పరిస్థితిలో మనం తీసుకోబోయే చర్య ఎలా ఉండాలి ఒక్కసారి తప్పటడుగు వేస్తె మళ్ళి మనం దాన్ని వెనక్కి తీసుకొవటం ఎంతో కష్టమౌతుంది మను ఎంతో కష్టపడాల్సి ఉంటుంది అన్నాడు.

అతని మాటల్లో జజముందని పించింది చాలామందికి కానీ దీపం ప్రక్కన కూచున్న కార్మికుడు అంతవరదాక దుర్గికాలేసుకున్న వాడల్లా సాపుకుని బీడి తీసి ముట్టించుకుని, రెండు దమ్ములు లాగి నెమ్మదిగా అటు ఇటు యిద్దర్ని చూసి 'వరేమి మాట్లాడక పోయేసరికి తనె మాట్లాడసాగిండు.

"నిజమె మన మిత్రుడు చేప్పిన మాటల్లో నిజముంది ఇంతకు ముందు మన సోదరులు చెప్పిన దాన్లొనూ నిజముంది రెండింటిని సమన్వయం చేసుకొవటం ద్వారానే మనం ముందుకు పొగల్గుతాం మన పోరాటం పురోగమిస్తున్న కొలనీ ఈ వైరుధ్యం ఏదో ఒక స్థాయిలో ఎదురౌతూనే ఉంటుంది. ఒక వైపు మన అర్గనైజేషన్ అనుకున్నంత స్థాయిలో లేదు వాస్తవమే మన వైపు పరిస్థితులు మనల్ని ముందుకు తోస్తున్నాయి పరిస్థితులు ఎటు తీసుకపొతుంటె అటు కొట్టుకపోవటమా ? లేక పరిస్థితుల మీద మన అధిపత్యం వహించటమా? ఒక వైపు ఇంకా నిర్లిప్తంగా అంటి అంటనట్టున్న కార్మికులు, మరో వైపు మేనేజిమెంటు అణిచివేతంకు పొలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా కసితో తెగించి ముందు కొస్తున్న కార్మికులు ఈ ఇద్దరి మధ్య సమన్వయం కావాలి వర్గ కసితో ముందుకొస్తున్న కార్మికులను ఇప్పుడు సమయం కాదు సమయం వచ్చి దాక వేచి ఉంచాం అంటే ఇప్పటికి డిస్మిస్‌లు అయి, పొలీసువాళ్ళ వేధింపులకు నిత్యం

గురి అవుతు వాళ్ళు ఇక ఎంతో కాలం నిలవగలరు. అటువంటి వారిని పోరాటంలో ఇంకా ముందుకు తీసుకురావల్సిన కర్తవ్యం మనకుంది, అదే సమయంలో ఇంకా అంటీ అంటనట్టున్న కార్మికులను కూడా మనం పోరాటంలోకి తీసుకువచ్చి, ప్రతి వానిని ప్రతి వాడను మనమొక పోరాట కేంద్రంగా చేయాల్సిఉంది" కాసేపు అని అందరు తన మాటలు వింటున్నారో లేదో తెలుసుకోవడం కోసమన్నట్టుగా క్షణం సేపు ఆగి మళ్ళీ మాట్లాడసాగిండు.

ఈ రోజు ప్రతి కార్మికునికి అనివార్యంగా పోరాటంలోకి రావల్సిన పరిస్థితి ఉంది, ఒక వైపు మేనేజిమెంటు అణిచివేతలు, మరోవైపు నిర్బంధం, ఒక మాటలో చెప్పాలంటే కార్మికుని పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యిలా ఉంది. మనలో చాలా మంది గ్రామాల్లో బ్రతుకు లేక గ్రామాల్లో దొరల దోపిడి భరించలేక గ్రామాలను వదిలిపెట్టి బ్రతుకు తెరువు కోసం బాయి పనికి వచ్చిన వాళ్ళమే అన్నాడు.

"అవును నిజమే" అన్నాడు రామలింగు "అయితే మన బ్రతుకు మాత్రం రోట్ల నుండి పెనా మీదికి వచ్చినట్టయింది కంపినోడు రోజురోజుకు కొత్త కొత్త ఎత్తుగడలతో వాని లాభాల కోసం మన రక్తాన్ని చమటను మరింత పిండుకోవటం కోసం ముందు కొస్తాండ్లు. నిన్న మస్టర్ల కోత చట్టమన్నడు. ఇవ్వాల అండర్ గ్రౌండ్ డిస్ట్రిబ్యూషన్ అని పని వొత్తిడి పెంచిండు ఎదురు తిరిగితే పోలీసు మన ముంగి గుండెలకు తుపాకులు ఎక్కుపెట్టి పని తీసుకోవాలని చూస్తాండ్లు వెనక్కి తిర్గి చూసుకుంటే అక్కడ పల్లెటూళ్ళో దొరలున్నరు, ఇక్కడ బాయి దొరలున్నరు, అక్కడ పోలీసులు తన్నులు గుద్దులు, ఇక్కడ అదే తంతు ఒక్కసారి మనం పల్లెటూరి నుంచి పారిపోయి బొగ్గు బాయిలకు వచ్చిను ఎక్కడైనా ఒక్కటె తంతు అయినప్పుడు మనం ఇక ఇక్కడనుంచి ఎక్కడికి పారిపోదాం" ఆవేశంతో గంభీరమైన అతని గొంతు అందర్ని ప్రశ్నిస్తున్నట్టుగా ఆగిపోయింది.

"ఇక మనం పారిపోవడానికి ఏ దారి లేదు మనం జీవితంలో పారిపోతు పారిపోతు ఆఖరి మజిలికి వచ్చినం ఇప్పుడు మనముందున్నది రెండే రెండు మార్గాలు ఒక్కటి ఈ అణిచివేత, పీడనను భరించుతూ నికృష్టంగా చావటమా ? ఎదురు తిరగడమా అన్నది రెండవ మార్గం.

"మనమింకా సర్దుకు పోయి బతుకుదామన్నా ఈ దోపిడీ వ్యవస్థ కోరల్లోనలిగి నశించి పోవటమే ఎలాగుచావు తప్పనప్పుడు మనమింకా మొదటి మార్గంలో పయనించటంలో అర్థంలేదు తప్పు సరిగా నిజమైన చీము నెత్తురున్న మనుష్యులుగా రెండవ మార్గంలోకి పయనించాలి అంతకు మించి మనకు వేరే దారి లేదు. మనముందున్నది ఒక్కటే దారి అది పోరాట దారి మనకోసం కాకున్నా మన ముందు తరమైన మన పిల్లల భవిష్యత్తు అయినా మనలా నికృష్టంగా ఈ దోపిడి వ్యవస్థ ఉక్కుపాదాల క్రింది మనలాగె నశించి పోకుండా ఉండటం కోసమైనా మనం పోరాడక తప్పదు. ఇది చరిత్ర అనివార్యంగా మనపై పెట్టిన గురుతరమైన బాధ్యత దీన్ని మనం నిర్వర్తించాలి ఇదే సత్యాన్ని మనం మన తోటి కార్మికులకు అర్థమయ్యేలా నచ్చచెప్పాలి వాళ్ళను కూడా పోరాటంలోకి తీసుకురావాలి. అప్పుడే మనం ఈ గండినిపూడ్చగలము అట్లా కాకుండా మనం తొందరపెడ్తె నష్టపోదాం అదే సమయంలో మన పురోగమనానికి ఎట్టి అడ్డంకులు వచ్చినా, ఎన్ని కష్టాలు కల్గినా మనం వాటిని తొలగించుకుంటు ముందుకు పోకతప్పదు ఈ రెండు కర్తవ్యాలను మనం ఒకేసారి నిర్వర్తించాల్సి ఉంటుంది" అన్నాడు.

నిత్యం జీవితంలో ఎదురౌతున్న అనేక సంఘటనలకు ఉదహరిస్తూ ఆయా సంఘటనల మధ్య అలలు అలలుగా అంతర్లీనంగా పురోగమిస్తున్న పోరాట క్రమాన్ని వాళ్ళ హృదయాల్లోకి చొచ్చుకపోయేల చెప్పసాగిండు రామలింగుకు ఆయన మాటల్లో అవాస్తవమైన దేది కనిపించలేదు వాటిని అవలోకన చేసుకునేందుకు అతను శ్రద్ధగా వినసాగిండు.

ఆయన మాటలింకా ఇలా సాగినయి "ఈ పోరాట పథంలో మనం ఒంటరిగా లేము, గ్రామాల్లో మన రైతుకూలీ సహోదరులు, అడవులలో గిరిజనులు, తెగించి సాయుధ పోరాటాలకు దిగుతున్నారు. వాళ్ళతో మనం భుజం భుజం కల్పి పోరాడ వల్సిన సమయం ఆసన్నమైంది ఈ పోరాటంలో మనవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి ఇంకా వెనకబడి ఉన్న మన సోదర కార్మికులను పెద్ద సంఖ్యలో పాల్గొనటానికి ఉద్యమానికి నాయకత్వం వహించటానికి తర్ఫీదు చెయ్యాలి. ఈనిర్బంధ పరిస్థితిలో మనకు రోజు రోజుకు లీగల్ అవకాశాలు ఏ మాత్రం ఇవ్వకుండా శత్రువు తీసుకోవాల్సిన అన్ని చర్యలకు దిగుతున్నాడు వాటిని అడ్డుకోవటం కోసం మనం ప్రత్యా

మ్నాయి పద్ధతులను, ఎత్తుగడలను అనుసరించాలి. వాడవాడలా బావిబావికి పోరాట కమిటీలు ఏర్పాటు చేసి, ఈ తుపాకి రాజ్యాన్ని తుపాకితోనే అంతం చెయ్యటానికి కార్మిక వర్గ సాయుధ పోరాట దళాలను తయారు చేయాలి. మనదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయాలి అంటూ అతను ఆవేశంగా చాలా సేపు మాట్లాడిండు.

రామలింగుకు ఆయన మాటలెంటుంటె ఎందుకో అవి అతను ఉద్దేశించే చెప్పి నట్లనిపించింది. ఎన్నో ఏళ్ళుగా తనలో పేరుకుపోయిన కోపానికి కసి, నిశ్చయతతో భయంతో అంధకార బంధురమైన హృదయంలోకి ఏదో కొత్త వెల్గు ప్రసరించినట్లుగా అనుభూతి చెందాడు ప్రవాహంలో దారి తెన్ను లేకుండ కొట్టుకుపోతున్న వాడికి గమ్యం చేర్చే నావ దొరికినట్టయింది దాన్ని వదులుకోవటానికి ఇంకతను సిద్ధంగాలేడు అనుకున్నాడు.

మీటింగు అయిపోన తర్వాత వెంకటస్వామి రామలింగు ఇద్దరు ఇంటి దారి పట్టారు రామలింగు తోవ పొడుగుతా ఇంతవరదాక తను విన్నమాట , తను బ్రతికిన బ్రతుకును పోల్చుకుంటు ఏడ్వసాగిండు

వెంకటస్వామి "ఊ" కొడ్తూనే ఉన్నా. మధ్య మధ్య రామలింగు మాటలకు అడ్డుపోయి మనలాంటి కష్టజీవులు దోపిడి పీడనలేని రాజ్యాన్ని గెలుచుకున్న సంగతులు చెప్పసాగిండు.

అలా మాటలు సాగిస్తూ చివరికి చెరోదారిన చీలిపోయి ఇంటిదారి పట్టారు.

ఆ రాత్రంతా రామలింగుకు నిదురపట్టలేదు. అతను అలా గుడిసెవాసాలకేసి చూస్తూ ఆలోచిస్తూ చాలా సేపు మెలకువగా ఉండిపోయాడు. అతని మ న సు లో ఆలోచనలు సుళ్ళు తిరగసాగినయి. అతను అస్పష్టంగా గొనుక్కోసాగిండు. అవేవీ పెదవులు దాటి రాలేదు కాని అవి అతని మనసులో మారుమోగుతున్నాయి.

"మనం పా రి పో తూ పా రి పో తూ చివర మజిలికి వచ్చినం. ఇప్పుడు మన ముందున్నది ఒక్కటే దారి అదే పోరాటదారి యిలా పలవరిస్తూనే ఎప్పుడో తెల్లవారు జామున నిదురలోకి జారుకున్నాడు.

1985 సూచిక

అనువాద కవిత :

పాట :

కథ, కథనం :

అనువాద కథ :

ప్రతి స్పందన :

వ్యాసం సమీక్షవ్యాసం :

మానవతా విలువలు ;

నడుస్తున్న చరిత్ర :

చర్చ :

పుస్తక సమీక్ష, నాటక సమీక్ష :

సంస్మరణ :

గెస్ట్ ఎడిటోరియల్ :

వ్యాఖ్య :

సంపాదకీయం :

నిర్వాహణ :

సాహిత్య లేఖలు :

19వ శతాబ్దం ఆఖరిభాగంలో ఆస్కార్ వైల్డ్ అప్పటి రష్యాగురించి ఒకనాటకం రాసాడు. "వేరా ఆర్ ది నిహిలిస్ట్స్" అను పేరుతోని జారు చక్రవర్తుల పాలనకు అద్దంపట్టిన ఆ నాటకంలో సంకెళ్ళు వేసి తీసుకువెళ్తున్న ఒక ఖైదీని ఎందుకు తీసుకుపోతున్నారని ఒక అమ్మాయి ప్రశ్నిస్తే "ఇలాంటిప్రశ్నలు వేసినందుకే" అని పోలీసాఫీసరు సమాధానమిస్తాడు. ఉగ్రవాదచట్టానికి వ్యతిరేకంగా విరామంలేకుండా ప్రచారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, శతాబ్దం గడిచిన తరువాత మళ్ళి ఇవ్వాళ "జారు చక్రవర్తుల పాలన"కు గురిఅయింది. సంఘ ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్ అదే చట్టంక్రింద అరెస్టయ్యారు. నవంబర్ 16వ తేదీన హైదరాబాద్‌లో అరెస్టుచేసి, రెండురోజులు అక్రమనిర్బంధంలోఉంచి, 18వ తేదీన వరంగల్‌లో మెజిస్ట్రేటు ముందు హాజరుపర్చి, ఖాజీపేట. సబ్ ఇనస్పెక్టర్ హత్యకేసు బనాయించి, ఆయనమీద ఉగ్రవాద చట్టాన్ని ప్రయోగించారు. ఆ కేసులో నిర్బంధకులుగా ఉండగానే డిసెంబర్ 2వ తేదీన జాతీయ భద్రతా చట్టాన్నికూడా ఆయన మీద ఉపయోగించారు. ఈ నల్ల చట్టాలు చట్ట సమ్మతమయిన ప్రజాస్వామిక కార్యకలాపాలని అణచివేయడానికి అవకాశమిస్తామన్న ఎ పి సి ఎల్ సి ప్రచారానికి ఇంతకంటె బలమయిన సాక్ష్యం అవసరంలేదు. అందుకే ఈ నల్లచట్టాలని వెంటనే ఉపసంహరించాలని, బాలగోపాల్‌ని వెంటనే బేషరతుగా విడుదల చెయ్యాలని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలని డిమాండ్ చెయ్యవల్సిందిగా ప్రజాస్వామిక వాదులందరికి విజ్ఞప్తి చేస్తున్నాం.

— సాహితీ మిత్రులు

SRJANA, Telugu Monthly November - December, 1985
Regd. No. with Registrer of News paper 10953/67 H.HNK-3



కామ్రేడ్ సాయిని ప్రభాకర్
కరీంనగర్

అమరత్వ

డియర్ కామ్రేడ్
జనక్షేమం విలువలేని
ఈ వ్యవస్థలో
నీ క్షేమం
ఏమని కోరను నేను ?
మానవత మట్టికరిసిన రోజున
మంచి ఏమని ఆశించను నేను ?
మా విప్లవ సూరీడా !
రాహువు నినుమింగేసినా
నీకు మరణం లేదు
ఓ విప్లవ వట వృక్షమా !
ఆకులు రాల్చే చేతులకు
మేకులు గుచ్చుతావు నువ్వు
నివురు గప్పిన నిప్పు
నీ గుండె నిబ్బరం
"నేను మెకానిక్కునయ్యేకన్నా
కుంపటిరాజేసేవాణ్ణయితేనేమిన్న"
అంటూ I. T. I. లో
నువ్వాడిన మాటలు నిజం చేశ
జగిత్యాల జైత్రయాత్ర
మండించావు
నిరుపేదల బ్రతుకులు పండించా
ఆనాడు ఖాకీమూకలను
కకవికలు చేసిన నువ్వు
ఈనాడు ఖాకీవనంలో
బందీవయిపోయావు
నువ్వొలికించిన
ప్రతి నెత్తుటిచుక్క నుండి
కోటికోట్ల కొదమసింగా
ఉద్భవిస్తాయి
నీ త్యాగమొక వీర స్మృతి
నీ మరణం కన్నీరు తెప్పించ
నీ త్యాగం విషాదాన్నికు
మా కన్నీటి కిరణాలను
ఈ హంతకవ్యవస్థ పు

నీ మధుర స్మృతులు బాం
వీటికి సమాధులుకడతాం
మిగిలి వున్న మేము
నీ గన్నులమై పేలుతాం
ప్రజాపోరాల్లోనుండి
సింహగర్జన చేస్తాం
అడవిచీకట్ల పెడ రెక్కలు
అరుణారుణ కిరణాలను
ఆకసాని కెగరేస్తాం
బాయినెట్ల సూర్యుణ్ణి
ఉదయింపజేస్తామని